www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
బుధవారం 30 ఏప్రిల్ 2025
సంపుటి :06 సంచిక : 330 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH

## మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

- లోటుపాట్లు లేకుండా పక్కాగా భద్రతా చర్యలు
- చారిత్రక ప్రాంతాల సందర్శనకు ఏర్పాటు చేయండి
- అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఏప్రిల్29( వెలుతురు):** మిస్ వరల్డ్ పోటీలను అ÷-యతంత కట్టుదిట్టమైన భద్రతమధ్య నిర్వహించాలని, ఎక్కడా లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోటీల్లో పాల్గొనేందుకు వస్తున్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఉన్నతాధికారులనురేవంత్ రెడ్డి ఆదేశించారు. అందులోభాగంగా ఎయిర్ పోర్టులు, అతిథులు బస చేసే హోటళ్లతోపాటు అందాల పోటీలు జరిగే ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై 2 లో..

## కాశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు

- ఇంటిలిజెన్స్ హెచ్చరికలు




2 లో..

## పెగాసస్ వ్యవహారంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు

- దేశ వ్యతిరేక శక్తుల కోసం ఉపయోగిస్తే తప్పేంటని ప్రశ్న
- పహల్గాం దాడులతో పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు
- పెగాసస్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం వెల్లడి



**న్యూఢిల్లీ,ఏప్రిల్29( వెలుతురు):** దాదాపు నాలుగేళ్ల క్రితం దేశ రాజకీయాలను కుదిపేసిన పెగాసస్ వ్యవహారం పై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. దేశ వ్యతిరేక శక్తుల కోసం ఉపయోగిస్తే తప్పు లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ స్పైవేర్‌ను వినియోగించి దేశంలోని పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖులపై నిఘా పెట్టారన్న ఆరోపణలపై 2 లో..



## నేడు కేబినేట్ భద్రతా వ్యవహారల భేటీ

- పహల్గామ్ ఘటన..పరిణామాలపై చర్చ
- భారత్ గగనతలంపై పాక్‌కు నిషేధం విధించే ఛాన్స్

**న్యూఢిల్లీ,ఏప్రిల్29( వెలుతురు):** పహల్గాం ఉగ్రదాడి ఘటన తర్వాత మరోమారు కేబినెట్ ఆన్ సెక్యూరిటీ బుధవారం సమావేశం కానుంది. బుధవారం ఉదయం 11.00 గంటలకు ప్రధాని మోడీ అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఏప్రిల్ 23న సమావేశమైన భద్రతా వ్యవహారాల కేబినెట్ పుల్వామా దాడిని ఖండించింది. సిసిఎస్ సమావేశం అనంతరం భారత్ పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాల తగ్గింపుతో పాటు పలు 2 లో..

## ఉగ్రవాదం అణచివేతలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

- సైన్యం నిర్ణయం మేరకు ఆపరేషన్ నిర్వహణ
- భారత సైన్యం శక్తి సామర్థ్యాలపై అపార నమ్మకం
- ఉన్నతస్థాయి సమీక్షలో ప్రధాని మోడీ విస్పష్ట ప్రకటన

**న్యూఢిల్లీ,ఏప్రిల్29( వెలుతురు):** ఉగ్రవాదాన్ని అణిచివేసే విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్టు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆపరేషన్ నిర్వహణ, సమయం, తేదీ, టార్గెట్‌లను సైన్యమే నిర్ణయిస్తుందని, భారత దళాల సామర్థంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. పహల్గాం దాడి అనంతర పరిణామాలు, భద్రత, సన్నద్ధతపై ప్రధానమంత్రి తన నివాసంలో మంగళవారం సాయంత్రం కీలక సమావేశం నిర్వహించారు. సుమారు గంటన్నర సేపు ఈ సమావేశం జరిగింది.



పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు దారుణ మారణహోమానికి పాల్పడి వారం రోజులు పూర్తయింది. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు మృత్యువాత పడ్డారు. ఈ దాడి తర్వాత కేంద్రం పాకిస్థాన్‌కు బుద్ధి వచ్చేలా పలు నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద నిర్మూలనకు దృఢచిత్తంతో ఉన్నమని ప్రధాని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణిచివేయడం జాతీయ సంకల్పం అని ఆయన అన్నారు. 2 లో..

## నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

- ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ



**హైదరాబాద్,ఏప్రిల్29( వెలుతురు):** తెలంగాణ పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ సారి కొత్తగా మార్కులతో పాటు-సబ్జెక్టుల వారీగా గ్రేడ్స్ ప్రకటించనున్నారు. ఆ విధంగానే మార్క్స్ మెమోలు జారీ కానున్నాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగిన పది పరీక్షలకు 5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. విడుదలయిన పదో తరగతి ఫలితాలను వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఇక నుంచి పదో తరగతి మెమోల్లో సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లు ఇవ్వనున్నారు. జీపీఏ అనేది తీసివేయనున్నారు. మార్కుల మెమోలపై సబ్జెక్టులవారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడు 2 లో..

## దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి

- రాష్ట్రంలో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం
- భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి



**వరంగల్,ఏప్రిల్29( వెలుతురు):** దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి నిలుస్తుందని రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కార మార్గం చూపాలన్న సంకల్పంతో 2 లో..

## కాళేశ్వరం అవినీతిని కప్పిపుచ్చే యత్నం

- కేంద్రం నివేదకను తప్పపట్టడం దుర్మార్గం
- సొంత నిర్ణయాలతో లక్షకోట్లు నీటిపాటుచేశారు
- అయినా సిగ్గూఎగ్గు లేకుండా మాట్లాడితే ఎలా
- బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,ఏప్రిల్29( వెలుతురు):** కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్‌డీఎస్ఏ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా భారాస నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. కావాలని ఎదురుదాడి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని 2 లో..




## పాక్ ప్రతినిధుల్లా కాంగ్రెస్ నేతల తీరు

- సోషల్ మీడియాలో మోడీపై అభ్యంతరకర పోస్టులు
- పాక్ నేతలు రీ ట్వీట్ చేయడం దేనికి సందేశం
- కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి



**హైదరాబాద్,ఏప్రిల్29( వెలుతురు):** పాకిస్తాన్ ఆలోచనల ప్రకారం కాంగ్రెస్ వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతను మరిచి ప్రధానమంత్రిని కించపరిచేలా సోషల్ మీడియా పోస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. దాయాది దేశంతో 2 లో..

## అమరావతిలో ప్రధాని పర్యటన

- ఏర్పాట్లపై పోలీసులతో హోంమంత్రి ఆరా

**అమరావతి, ఏప్రిల్29 (వెలుతురు):** అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభానికి మే 2న ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్‌కు రానున్నారు. ప్రధాని రాక సందర్భంగా ఏపీ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు- చేస్తోంది. ప్రధాని సభ జరిగే ప్రాంతాన్ని ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలించగా.. తాజాగా హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. పోలీసు 2 లో..



## చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది




- చంద్రబాబు చేస్తున్న విధ్వంసం అంతా ఇంతాకాదు
- జిల్లా పార్టీలో మీరే సర్వస్వం..గెలుపు బాధ్యతా మీదే
- పార్టీ జిల్లా అధ్యక్షులతో భేటీలో జగన్ దిశానిర్దేశం

**అమరావతి,ఏప్రిల్29( వెలుతురు):** జిల్లాల్లో మీరే సర్వం.. మీరే పార్టీ.. పార్టీయే మీరు.. అని వైకాపా అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ అన్నారు.అంతే కాదు జిల్లాల్లో అన్నిస్థానాల్లో గెలిపించాల్సిన బాధ్యత కూడా మీదే అంటూ జిల్లా అధ్యక్షులపై కీలక బాధ్యతలు మోపారు. వైసీపీ జిల్లా అధ్యక్షులతో పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమైన జగన్.. పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన 7 లో..

## మతం పేరుతో చంపేస్తుంటే చూస్తూఊరుకోవాలా.?

- కాశ్మీర్ ఘటన క్షమించరాని నేరం
- ఉగ్రవాదులపై కనికరం చూపాల్సిన అవసరం లేదు
- మధుసూధన్ రావు కుటుంబానికి 50 లక్షల సాయం
- మృతులకు జనసేన పక్షాన సంతాపం
- కఠిన చర్యలే మందు అన్న పవన్ కళ్యాణ్

**మంగళగిరి,ఏప్రిల్29( వెలుతురు):** కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఉన్నంత వరకు ప్రశాంతంగా ఉందని.. అధికారం రాష్ట్రం చేతిలోకి వెళ్లగానే ఊచకోత ఘటన జరిగిందని జనసేనాని, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఇంత దారుణానికి ఒడిగట్టిన ఉగ్రవాదులపై కనికరం చూపాల్సిన అవసరం లేదన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించాల్సింఇదేనని, అందుకు ఎంతటి కఠినమైన చర్యనైనా



తీసుకోవాల్సిందేనని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. దేశమంతా ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని వెల్లడించారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో అమరులకు జనసేన సంతాపం ప్రకటించింది. మంగళగిరిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్,ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతులకు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాల పాటు మౌనం




పాటించారు. ఉగ్రదాడి మృతులకు డిప్యూటీ- సీఎం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. అమాయకులను అత్యంత దారుణంగా చంపారన్నారు. ఉగ్రదాడి ఘటన దేశం మొత్తాన్ని కుదిపేసిందని.. పహల్గామ్ 2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా ఉన్నతాధికారులకు ఆయన కీలక సూచనలు చేశారు. ఈ పోటీలకు వచ్చే అతిథులు .. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు- చేయాలన్న సూచించారు. విభాగాల వారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఉన్నతాధికారులకు సీఎం వివరించారు. అలాగే నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. హైదరాబాద్ వేదికగా 72వ మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. ఇవి మే 7వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. వేర్వేరు వేదికలపై వేర్వేరు థీమ్‌లతో వీటిని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు.దేశ,విదేశాల నుంచి మిస్ వరల్డ్ పోటీ-ల్లో పాల్గొనేందుకు అతిథులు మే 6, 7 తేదీల్లో హైదరాబాద్ తరలిరానున్నారు. మే 10వ తేదీన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీ-లు ప్రారంభమవుతున్నాయి. మే 12వ తేదీన బుద్ధభవన్‌లో అందాల భామలతో అధ్యాత్మిక పర్యటన ఏర్పాటు- చేశారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్, హదరాబాద్‌లలో హెరిటేజ్ వాక్‌లు ఏర్పాటు- చేశారు. ఇక మే 13వ తేదీన చౌమహల్లా ప్యాలెస్‌లో సుందరాంగులు, అతిథులకు వెలకం డిన్నర్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## కాశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు

**న్యూఢిల్లీ,ఏప్రిల్29( వెలుతురు):**

జమ్ముకశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు సృష్టించిన మారణకాండలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భారత భద్రతా బలగాలు ఉగ్రవాదులను అంతం చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంటెలిజన్స్ చేసిన ఓ హెచ్చరిక మరింత భయాందోళనకు గురి చేస్తోంది. పహల్‌గామ్ ఘటనను మరవక ముందే కశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు జరిగే ప్రమాదం ఉందని ఇంటెలిజన్స్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో 50 పర్యాటక ప్రదేశాలను జమ్ముకశ్మీర్ ప్రభుత్వం మూసివేసింది. దీంతో పబ్లిక్ మార్కులు, గార్డెన్లు ఇతర పర్యటక ప్రదేశాలు మూతబడ్డాయి. అయితే ఇవి మళ్లీ ఎప్పుడు తిరిగి తెరుచుకుంటాయనే విషయంలో స్పష్టత లేదు. ఇంటెలిజన్స్ నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో భద్రతను మరింత కట్టు-దిట్టం చేశారు.

## పెగాసస్ వ్యవహారంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు

సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. జాతీయ భద్రతా ప్రయోజనాల కోసం ఓ దేశం స్పైవేర్‌ను కలిగి ఉండటం తప్పులేదని కోర్టు స్పష్టంచేసింది. అయితే,అది ఎలా,ఎవరిపై ఉపయోగిం చారన్న దాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. పెగాసస్ ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది.ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ప్రస్తుతం మన దేశం ఎలాంటి పరిస్థితిలో ఉందో అందరికీ తెలుసు. మనం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఇక, సాంకేతిక బృందం నివేదిక గురించి మాట్లాడుతూ.. దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన నివేదికను బహిర్గతం చేయడం సరికాదు. ఒకవేళ ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు దాని గురించి తెలుసుకోవాలనుకుంటే.. వారికి సమాచారం అందిస్తాం. అంతేగానీ.. వీధుల్లో చర్చించుకునే ఓ డాక్యుమెంట్‌గా ఈ నివేదిక మారకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈసందర్భంగా పిటిషన్ తరపున న్యాయవాది మాట్లాడుతూ.. పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగిస్తోందా? లేదా అన్న విషయాన్ని కేంద్రం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేగాక, ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపి సాంకేతిక నిపుణుల బృందం నివేదిక కోసం సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఆదేశించిందని, ఇప్పటివరకూ ఆ నివేదిక అందలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దాన్ని వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ.. దేశం స్పైవేర్‌ను వినియోగిస్తే గనుక అందులో తప్పేముంది. అయితే, దాన్ని ఎవరిపైన ఉపయోగిస్తున్నారన్నదే ఇక్కడ ప్రశ్న. పౌర సమాజంపై కాకుండా.. దేశ వ్యతిరేక శక్తులపై దీన్ని వినియోగిస్తే గనుక అందులో ఏ తప్పు లేదు. దేశ భద్రత విషయంలో రాజీపడకూడదు. ఒకవేళ సామాన్య పౌరులపై ఉపయోగిస్తే గనుక దాని గురించి మేం దర్యాప్తు జరిపిస్తాం. ఉగ్రవాదులు గోప్యత హక్కును కోరకూడదు. అయితే, సామాన్య పౌరుల గోప్యతకు మేం తప్పకుండా రక్షణ కల్పిస్తామని స్పష్టంచేసింది. ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్ఓ గ్రూప్ అనే సంస్థ 'పెగాసస్' స్పైవేర్‌ని అభివృద్ధి చేసింది. నిఘా కార్యకలాపాల కోసం ఈ స్పైవేర్‌ను ఎన్ఎస్ఓ పలు ప్రభుత్వాలు, ప్రభుత్వ అధీనంలో పనిచేసే సంస్థలకు విక్రయిస్తుంటు-ంది. అయితే, ఈ పెగాసస్‌ను ఉపయోగించి పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖుల ఫోన్లను హ్యాక్ చేశారంటూ 2021లో ఓ అంతర్జాతీయ పత్రిక సంచలన కథనం ప్రచురించింది. భారత్ నుంచి 300 మంది ఫోన్లు హ్యాక్ అయినట్లు- పేర్కొంది. వీరిలో రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నట్లు- తెలిపింది. దీంతో ఈ వివాదం దేశ రాజకీయాలను కుదిపేసింది. అనంతరం దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే పెగాసస్‌పై విచారణకు ఆదేశించిన సుప్రీం.. ముగ్గురు సభ్యులతో స్వతంత్ర నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ- నివేదిక రూపొందించింది.

## నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

పొందుపరచనున్నారు. చివరగా విద్యార్థి పాసయ్యారా? ఫెయిల్ అయ్యారా? అనేది వివరంగా ఇస్తారు. ఇంకా బోధనేతర కార్యక్రమంలో స్టూడెంట్స్‌కు గ్రేడ్లు ఇస్తారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ అనే నాలుగు కో కరిక్యులర్ యాక్టివిటీ-స్‌కు సంబంధించిన గ్రేడ్లు కూడా ముద్రిస్తారు.

## దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి

ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ చట్టాన్ని తెచ్చిందని అన్నారు. ఈ చట్టం రైతులకు శ్రీరామరక్ష అని అన్నారు.భూ భారతి 2025 చట్టంపై మంగళవారం వరంగల్ నగరంలోని నాని గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ ప్రారంభానికి ముందు తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం భూ భారతి చట్టంపై ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. చట్టంలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించి అందులోని అంశాలను జిల్లా కలెక్టర్ వివరించారు.అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ధరణి వల్ల రైతుల వారసత్వంగా వచ్చే భూమిని అనుభవించలేక అనేక సమస్యలు ఏర్పడ్డాయని, వాటి చిక్కుముడి విప్పడానికే భూ భారతి దోహదపడుతుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండంచల వ్యవస్థను తీసుకువచ్చినట్లు- తెలిపారు. సభలో రైతులు కొంగరి భాస్కరరావు, విజయ్ కుమార్, గోపాల రాధాకృష్ణ సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ప్రజలకు అందినప్పుడు దానికి సార్థకత చేకూరుతుందని, అందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. రికార్డుల్లో తప్పుల సవరణ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూముల సర్వే, మ్యాప్ తయారీ , పెండింగ్ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు నిజాయితీగా పనిచేయాలని, లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వరంగల్ నగర పరిధిలోని 32వ డివిజన్ బిఆర్‌నగర్‌లో మంగళవారం సన్నబియ్యం లబ్ధిదారుడు సింగబోయిన అనిల్ కుమార్ ఎల్లమ్మ ఇంట్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, ఎంఎల్ఏ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ అశ్విని థానాజీ వాకడే భోజనం చేశారు. లబ్ధిదారులు అందించిన ఆతిథ్యానికి ముగ్ధులైన మంత్రులు అన్నదాత సుఖీభవ అంటూ కుటుంబ సభ్యులను శాలువతో సత్కరించి, నజరానా అందజేశారు.

# ఉగ్రవాదం అణచివేతలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

**(మొదటి పేజీ తరువాయి..)**

సాయుధ దళాల సామర్థ్యంపై పూర్తి విశ్వాసం ఉందని ఆయన తెలిపారు. తీవ్రవాదం అణిచివేయడంలో, అందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవడంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎప్పుడు, ఎలా స్పందించాలో నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛ పూర్తిగా సైన్యానిదే అని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని అధ్యక్షతన ఈ సమావేశం దాదాపు గంటన్నరపాటు- కొనసాగింది. ఈ సమావేశంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ పాటు- వివిధ దళాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలనేదే దేశ సంకల్పమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సహా త్రివిధ దళాల అధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశంలో అంతర్గత భద్రత, సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ తన నివాసంలో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను ప్రస్తావించిన ప్రధాని మోదీ.. ఉగ్రవాదులు, వారిని పెంచి పోషిస్తున్న వారిని పాతాళంలో తొక్కేస్తామని స్పష్టం చేసినట్లు- తెలుస్తోంది. అంతేకాదు, వారి ఊహకందని రీతిలో చర్యలు ఉంటాయని చెప్పినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రఘటనకు ప్రతీకార దాడులు తప్పవని ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ ప్రధాని మోదీ మాటలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. మరోవైపు భద్రతారంగ కేబినెట్ కమిటీ బుధవారం సమావేశం కానుంది. వారం రోజుల వ్యవధిలో భేటీ- కానుండటం రెండోసారి. అనంతరం మోదీ నేతృత్వంలో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ- సమావేశం కానుందని సమాచారం. ఇందులో సీసీఎస్‌లోని ఐదుగురు సభ్యులతో పాటు- రవాణా, ఆరోగ్య, వ్యవసాయ, రైల్వే మంత్రులు ఉన్నారు. ఇలా కీలక భేటీ-లు జరిగే ఒకరోజు ముందే త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోదీ సమావేశం ఏర్పాటు- చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే, 2016లో ఉరిలో ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడి భారత సైన్యం మెరుపుదాడులు చేసింది. అనంతరం 2019లో సీఆర్పీఎఫ్ బలగాలే లక్ష్యంగా పుల్వామాలో జరిగిన దాడి అనంతరం భారత సైన్యం సర్జికల్ స్ట్రయిక్స్ చేపట్టిన సంగతి తెలిసిందే.

# నేడు కేబినేట్ భద్రతా వ్యవహారల భేటీ

చర్యలను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దాడికి అనంతర పరిణామాలను కేబినెట్ చర్చించనుంది. అలాగే ఏదైనా ముఖ్య నిర్ణయాలపైనా చర్చించే అవకాశం ఉంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలోకేంద్ర ప్రభుత్వం వరుసగా కీలక భేటీలు నిర్వహిస్తోంది. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకునే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ బుధవారం సమావేశం కానుంది. దీనికి ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షత వహించనున్నారు. ఘటన జరిగిన వెంటనే ఈ కమిటీ- ఒకసారి భేటీ- అయిన సంగతి తెలిసిందే. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన తొలిసారి గత బుధవారం దిల్లీలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నరమేధానికి పాల్పడిన ముష్కరులను శిక్షించడంతో పాటు వారిని ఎగదోస్తున్న శక్తులనూ బాధ్యులుగా నిలబెడతామంటూ పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించింది. సీమాంతర ఉగ్రవాదాన్ని వీడే వరకూ పాక్ పట్ల కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. దౌత్య సంబంధాల స్థాయినీ తగ్గించింది. సింధూ జలాల ఒప్పందం అమలును తక్షణమే నిలిపివేసింది. మరోవైపు సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయిన సంగతి తెలిసిందే. పహల్గాంలో పరిస్థితులతో పాటు- భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఇదిలావుంటే పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తమపై ఆంక్షలు విధించిందనే అక్కసుతో భారత్‌పై పాకిస్థాన్ విషం చిమ్మింది. తమ గగనతలంపై మన దేశ విమానాల రాకపోకలపై నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో న్యూదిల్లీ కూడా దీనిపై ప్రతీకార చర్యలకు సిద్ధమైనట్లు- తెలుస్తోంది. పాక్ విమానయాన సంస్థలకు మన గగనతలాన్ని మూసివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇక, పాకిస్థానీ నౌకలు కూడా భారత పోర్టుల్లోకి రాకుండా నిషేధం విధించనున్నట్లు- తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఈ ప్రతిపాదన పరిశీలన దశలో ఉంది. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ అధికారి వెల్లడించినట్లు సమాచారం. ఒకవేళ దీనిపై భారత్ నిర్ణయం తీసుకుంటే.. అది పాక్ ఎయిర్‌లైన్లపై పెను ప్రభావం చూపించే అవకాశం ఉంది. పాక్ విమానాలు కౌలాలంపూర్ సహా మలేసియాలోని ఇతర నగరాలు, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే మన గగనతలాన్ని దాటాల్సిందే. ఇప్పుడు భారత్ నిషేధం విధిస్తే.. దక్షిణాసియా ప్రాంతాలకు వెళ్లేందుకు చైనా లేదా శ్రీలంక మీదుగా విమానాలను మళ్లించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రయాణసమయం పెరగడంతో పాటు నిర్వహణ పైనా అదనపు భారం పడుతుంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకు పోయిన పాక్ ఎయిర్‌లైన్లకు ఇది మరింత శరాఘాతంగా మారనుంది. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీ-వల మన విమానాలకు పాక్ తమ గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. దీంతో భారత ఎయిర్‌లైన్లు కూడా ప్రత్యామ్నాయ మార్గాల్లో విమానాలు నడుపుతున్నాయి. అయితే, ఈ నిర్ణయంతో ఆర్థికంగా మనకంటే పాక్‌కే ఎక్కువ నష్టం అని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటివరకు భారత్ నుంచి పాక్ గగనతలం మీదుగా వారానికి 800లకు పైగా అంతర్జాతీయ విమానాలు రాకపోకలు సాగించేవి. 2019లో పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో దాదాపు 5 నెలల పాటు- పాక్ తమ గగనతలంలో భారత విమానాలపై ఆంక్షలు విధించింది. దీంతో అప్పట్లో ఆ దేశం 100 మిలియన్ డాలర్ల పైగా నష్టపోయినట్లు సమాచారం.

## కాళేశ్వరం అవినీతిని కప్పిపుచ్చే యత్నం


మండిపడ్డారు. ఇంతపెద్ద కుంభకోణం జరిగి లక్షకోట్లు నీటి పాలైతే దానిమీద వారికి చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. 'ఎన్‌డీఎస్ఏ ఎవరు..? వాళ్లెవరు నివేదిక ఇవ్వడానికి' అని కించపరిచేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎక్కువ కమిషన్లు వస్తాయని గత ప్రభుత్వ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేదికపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కమిషన్ల కోసం ప్రాజెక్టు అంచనాను భారీగా పెంచుకుంటూ పోయారని మండిపడ్డారు. రూ.80వేల కోట్లకు అనుమతులు తీసుకుంటే..ఇప్పటికే రూ.లక్ష కోట్లు దాటిపోయిందని అన్నారు. వివిధ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారు. అధికశాతం వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. భారాస హయాంలోనే ప్రాజెక్టు నిర్మించారు. వాళ్ల హయాంలోనే కూలిపోయింది. ఇంతకన్నా సిగ్గుచేటు మరోటి ఉండదన్నారు. బ్యారేజీ పూర్తయిన తొలి ఏడాదిలోనే లోపాలు బయటపడ్డాయి. లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు చెప్పినా సరే.. పట్టించుకోకపోవడంతో నష్ట తీవ్రత పెరిగింది. మేడిగడ్డ నిర్మాణంలో లోపాలపై భారాస ఉన్నప్పుడు కూడా ప్రాథమిక నివేదిక ఇచ్చారు. బ్యారేజీ లోపలి భాగంలో నీళ్లు భూమిలోకి పోయి బ్యారేజీ వెలుపలకు వస్తున్నాయి. బ్యారేజీ నిర్మాణానికి మట్టి పరీక్షలు, నాణ్యత పరీక్షలు చేయలేదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సీపేజీ ఉందని ఎన్‌డీఎస్ఏ నివేదిక చెబుతోంది. నిర్మాణం మొదలుపెట్టిన 6 నెలల తర్వాత సీడబ్ల్యూసీకి డీపీఆర్ పంపించారు. ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చవద్దని ఐదుగురు విశ్రాంత ఇంజినీర్లతో కేసీఆర్ ఏర్పాటు- చేసిన నిపుణుల బృందమే చెప్పింది. సీడబ్ల్యూసీకి ఇచ్చిన డీపీఆర్‌లో కూడా తర్వాత ఇష్టారాజ్యంగా మార్పులు చేశారు. డీపీఆర్‌కు విరుద్ధంగా కేసీఆర్ ఎలా చెప్తే అలా నిర్మించేశారు. భారాస నేతల నిర్లక్ష్యం, కక్కుర్తి, అవినీతి వల్ల ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని ఉత్తమ్ మండిపడ్డారు. వజ్రోత్సవ సభలో ఏదేదో మాట్లాడిని కెసిఆర్ దీనిపై ఎందుకు నోరు మెదపలేదన్నారు. ఎన్‌డీఎస్ఏ అనేది పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడింది. చట్టం చేసినప్పుడు భారాస ఎంపీలు మద్దతిచ్చారు. బ్యారేజీల భద్రతపై ఎన్‌డీఎస్ఏ అత్యున్నత బోర్డు. దేశంలోని 700 బ్యారేజీల భద్రతను పరిశీలిస్తోంది. వివిధ అంశాల్లో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో ఈ బోర్డు ఏర్పాటైంది. తుమ్మిడిహట్టి కాదని మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించడమే ప్రధాన లోపమని ఎన్‌డీఎస్ఏ చెప్పింది. మేడిగడ్డ ప్రతిపాదనను సీడబ్ల్యూసీ ప్రారంభంలోనే తోసిపుచ్చింది. ఇవన్నీ మరచి బిఆర్ఎస్ నేతలు మాట్లాడడానికి సిగ్గుండాలని అన్నారు.

# పాక్ ప్రతినిధుల్లా కాంగ్రెస్ నేతల తీరు

**(మొదటి పేజీ తరువాయి..)**

యుద్ధమేఘాలు కమ్ముకున్న సమయంలో.. బాధ్యతాయుత ప్రతిపక్షంగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్ పార్టీ.. అన్ని విలువలకు తిలోదకాలిచ్చింది. పాకిస్తాన్, ఉగ్రవాదులు మాట్లాడుతున్న భాషలో.. మాట్లాడుతోంది. పాకిస్తాన్ మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతల ఆలోచన ఒకే రకంగా ఉందని అర్థమవుతోందన్నారు. పాకిస్తాన్ మంత్రులు.. భారతదేశానికి వ్యతిరేకంగా మాట్లాడితే, దానికి మద్దతుగా కాంగ్రెస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటు. కాంగ్రెస్ నేతలు చేసిన ట్వీవట్లను పాకిస్తాన్ రీట్వీట్ చేయడం.. వీరిద్దరి మధ్య ఉన్న అక్రమ స్నేహబంధానికి అద్దం పడుతోంది. పహల్‌గామ్ ఘటన తర్వాత.. భారతీయుల రక్తం ఉడుకుతోంది. పాక్ కు దిమ్మతిరిగే సమాధానం ఇస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. ఈ సమయంలో ప్రధానమంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి, భారతీయ సైన్యానికి అండగా ఉండాల్సిన బాధ్యతను మరిచిన కాంగ్రెస్ పార్టీ.. ఉగ్రవాదుల భాషలో మాట్లాడుతుండటం అత్యంత హేయమైనచర్య. ప్రధానమంత్రి చిత్రంలో తలను తొలగించి 'గాయబ్'అని పోస్టు చేయడం కాంగ్రెస్ పార్టీలో పెరుగుతున్న అసహనానికి నిదర్శనమని అన్నారు. ఈ సారి కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మద్దతిచ్చాయి. మజ్లిస్ పార్టీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. మజ్లిస్ పార్టీని ఎదిరించే సత్తా బీజేపీకే ఉందనే సంకేతాలు స్పష్టంగా హైదరాబాద్ ప్రజలకు ఇచ్చాం.. రాబోవు గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ, మజ్లిస్ పార్టీల మధ్యే పోటీ ఉంటుందని కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో కంటే మోడీ వచ్చాక ఉగ్రవాదం పూర్తిగా తగ్గింది.. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ లో అనేక సార్లు బాంబు బ్లాస్ట్ లు జరిగాయి.. ఉగ్రవాదంపై జీరో టోలరెన్స్ విధానంతో మంచి ఫలితాలు వచ్చాయి.. 370 రద్దు తర్వాత కశ్మీర్ అభివృద్ధి వైపుకు పయనిస్తుంది.. కశ్మీర్ అభివృద్ధి ఈ దేశంలో ఉన్న అంతర్గత శక్తులకు, పాకిస్తాన్ శక్తులకు ఏమాత్రం ఇష్టం లేదు.. శాంతి సమస్యతో ముందుకు వెళు_న్న కశ్మీర్ ను చూసి పాకిస్తాన్ సహించలేకపోతుంది.. పెహల్గంలో హిందువులు, ముస్లింలను విభజించి, అతి కిరాతంగా కాల్చి చంపారు.. కశ్మీర్ సినిమాను నాడు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది.. నేడు పెహల్గం ఘటన అదే కశ్మీర్ ఫైల్స్ సినిమాను తలపించింది.. పెహల్గం ఘటనను యావత్ దేశం వ్యతిరేకిస్తోంది.. దేశం శాంతి, సామరస్యంతో ఉండాలి.. ఉగ్ర శక్తులు భారతాన్ని ఏం చెయ్యలేవు.. భారత ప్రజలు ఐకమత్యంతో కలిసి ముందుకు నడవాలని మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## మతం పేరుతో చంపేస్తుంటే చూస్తూఊరుకోవాలా ?




ప్రకంపనలు దేశమంతా వ్యాపించాయని తెలిపారు. షికారుకు వచ్చినట్లు- వచ్చి పర్యాటకులను వేటాడారని.. ఐడీ కార్డులు అడిగి హిందువా, ముస్లింవా అని అడిగి మరీ అత్యంత క్రూరంగా అమాయకుల ప్రాణాలు తీశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిహద్దు భద్రత అత్యంత అవసరమన్నారు. నిరాయుధులతో యుద్ధం చేయకూడదని తెలిపారు. ఎంతో నమ్మకంతోనే కశ్మీర్ పర్యటనకు వెళ్లారన్నారు. లక్షలాదిమంది కశ్మీరీ పండిట్లు వలస వెళ్లిపోయారని తెలిపారు. అప్పటి నుంచి కశ్మీర్ మండుతూనే ఉందన్నారు. కశ్మీర్ భారత్‌లో భాగమే.. ఎప్పటికీ అంతే అని స్పష్టం చేశారు. భారత్‌లో ఉంటూ కొందరు పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పాకిస్థాన్‌పై ప్రేమ ఉన్నవారు ఆ దేశం వెళ్లిపోవచ్చని అన్నారు. మతం అడిగి చంపేశారని ప్రత్యక్ష సాక్షులు చెబుతుంటే నమ్మరెందుకని ప్రశ్నించారు. అతిమంచితనం కూడా మంచిది కాదని అభిప్రాయపడ్డారు. కాల్చుకుంటూ పోతే చూస్తూ ఊరుకోవాలా.. అతి సహనం కూడా ప్రమాదకరమన్నారు. పాకిస్థాన్‌ను మూడు సార్లు ఓడించామని గుర్తుచేశారు. జనసేన ఉన్నది తెలుగు రాష్ట్రాల్లోనే.. కానీ మాది జాతీయ విధానమని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదులను ఎదుర్కోవాలంటే ధైర్యంతో కూడుకున్న పని అని అన్నారు. హిందువులకు ఉన్నది ఒక్కటే దేశమని.. ఇక్కడ కూడా హిందువులనే టార్గెట్ చేస్తే ఎక్కడికి పోవాలని అన్నారు. హత్య చేసి మోదీకి చెప్పుకోండి అన్నారని.. పర్యాటకులు చెబుతున్నారని తెలిపారు. ఉగ్రదాడిలో చనిపోయిన మధుసూదన్ కుటుంబానికి పరిహారం ప్రకటించారు పవన్. జనసేన పక్షాన మదుసూదన్ కుటుంబానికి యాభై లక్షలను ప్రకటించారు. అతని కుటుంబానికి జనసేన పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. 'మనం ఏదొక రూపంలో ప్రాణాలు కోల్పోతాం. అది దేశంకోసం అయితే... మన మరణానికి ఒక అర్థం ఉంటుంది. మదుసూదన్ కుటుంబం ఆ పరిస్థితి నుంచి బయటకు రావడం చాలా కష్టం. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారందరికి జనసేన పక్షాన నివాళి అర్పిస్తున్నాం' అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## అమరావతిలో ప్రధాని పర్యటన

ఉన్నతాధికారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాని పర్యటన దృష్ట్యా కట్టు-దిట్టమైన భద్రత ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రధాని రాక సందర్భంగా 6 వేల మందితో భద్రత ఏర్పాటు- చేసినట్లు మంత్రి అనిత చెప్పారు. గత ప్రభుత్వంలో ప్రజా వేదిక కూల్చివేత నుంచి విధ్వంస పాలన చేశారు. కానీ సీఎం చంద్రబాబు అభివృద్ధిపై దృష్టి పెట్టారు. అమరావతి కోసం రైతులు ఎన్నో త్యాగాలు చేశారు. అమరావతి కోసం గతంలో బస్ యాత్ర చేస్తే రాళ్ళ దాడి చేశారు. అమరావతిని మళ్లీ ప్రారంభించడం వెనక ఎంతో ఆవేదన శ్రమ ఉన్నాయి. రైతుల న్యాయ పోరాటం సహా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ గార్ల కృషి వల్ల అమరావతి పనులు రీ లాంచ్ అవుతున్నాయి. ఏపీలో ఒక పండగ వాతావరణంలో రాజధాని రీ లాంచ్ కార్యక్రమం జరుగుతోంది' అని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.



## పెండింగ్ స్కాలర్షిప్స్, ఫిజియంబర్స్మెంట్, బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- లేనిపక్షంలో రాష్ట్ర బంద్ కు పిలుపునిస్తాం
- బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతలరామ్మూర్తి గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 29:** గత నాలుగు సంవత్సరాలుగా విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లని పెండింగ్లో పెట్టి విద్యార్థులను చదువుకు దూరం చేస్తూ నానా అవస్థలు పెడుతున్న ఈ ప్రభుత్వాలకు సరైన గుణపాఠం చెప్తామని ఏ ప్రభుత్వాలు మారినా కూడా విద్యార్థుల పట్ల విద్యార్థుల చదువులు పట్ల చిత్తశుద్ధితో ఆలోచన చేసే ప్రభుత్వాలు రావడంలేదని గడిచిన టిఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా మూడు సంవత్సరాలు ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్లో పెట్టి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న కూడా ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా స్కాలర్షిప్స్ మంజూరు చేయకుండా అద్దె బకాయిలను చెల్లించకుండా విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్న ప్రభుత్వాలకు సరైన బుద్ధి చెప్తామని త్వరలో బకాయిలను విడుదల చేయకుంటే అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్త బందుకు పిలుపునిస్తామని డిమాండ్ చేశారు, బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతల రామ్మూర్తి గౌడ్.

## ఉదారత చాటుకున్న మంత్రి పొంగులేటి....

- బాలిక చదువుకు ఆర్థిక సహాయం అందజేసిన మంత్రి....



**వెలుతురు వరంగల్ 29 ఏప్రిల్ 2025:**
వరంగల్ నగరంలోని నాని గార్డెన్స్ లో భూభారతి చట్టం-2025 అవగాహన కార్యక్రమంలో పాల్గొనడానికి వేదిక వద్దకు చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్కడే ఒక వృద్ధురాలు కాగితం చేతిలో పట్టుకొని దీన స్థితి లో ఏదో అవసరం కోసం వేచి చూస్తున్నట్లుగా ఉండడాన్ని గమనించిన మంత్రి స్వయంగా వేదిక పై నుండి నిలబడి ఆ వృద్ధురాలిని వేదిక మీదకు ఆప్యాయం గా పిలిచి ఇక్కడికి ఎందుకు వచ్చావు అమ్మా.. అని సమస్యను గురించి ఆరా తీయగా.. ఆ వృద్ధురాలు బదులిస్తూ తన పేరు వేల్పుల ఊర్మిళ అని 41 వ డివిజన్ శంభునిపేటలో తన నివాసమని, తన మనవరాలు వేల్పుల లిటి ఇటీవల 4 వ తరగతి పూర్తి చేసుకుని సెయింట్ గాబ్రియల్ పాఠశాలలో 5 వ తరగతి లో ప్రవేశానికి పరీక్ష రాసి సీటు సాధించడం జరిగిందని, కానీ లిటి తల్లిదండ్రులు మనస్పర్థల వల్ల వేరు గా ఉంటున్నారనీ, తన మనవరాలికి సీటు దక్కినప్పటికిని చదివించే స్తోమత తనకు లేదని మంత్రి వద్ద వాపోగా, వెంటనే స్పందించిన మంత్రి చదువు కోవడానికి అయ్యే వ్యయాన్ని భరిస్తానని ప్రకటించి మంత్రి చూపిన ప్రోత్సాహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## పర్యాటకరంగంలో బలమైనపునాది వేశా

- మరోమారు ట్వీట్ చేసిన స్మితా సబర్వాల్

**హైదరాబాద్,ఏప్రిల్29( వెలుతురు):**
ఇటీవల బదిలీ వేటుకు గురైన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ మరో సంచలన ట్వీట్ట్ చేశారు. భగవద్గీతలోని 'కర్మణ్యే వాధికారస్తే, మా ఫలేషు కదాచన' శ్లోకంతో ప్రారంభించి.. 'పర్యాటకంలో 4 నెలలు పనిచేశా. నా వంతు కృషి చేశాను!. చాలా కాలంగా పెండింగ్లో ఉన్న 25-30 పర్యాటక విధానాన్ని తీసుకువచ్చాను. ఇది రాష్ట్రానికి మొదటిసారి. నిర్లక్ష్యం చేయబడిన పర్యాటక ప్రాంతాలకు దిశను చూపేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు ఒక బలమైన పునాదిని సృష్టిస్తుంది. పర్యాటక శాఖ పని శైలిని పునరుద్ధరించాను. జవాబుదారీతనాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నించాను. లాజిస్టిక్స్ అండ్ ప్రణాళికకు పునాది వేశాను. ప్రపంచవ్యాప్త కార్యక్రమం కోసం.. ఇది ఖచ్చితంగా మరిన్నింటికి తలుపులు తెరుస్తుంది' అని స్మితా ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. కాగా, ప్రస్తుతం రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న స్మితా సబర్వాల్ పై రాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు-వేసింది. ఆమెను ఫైనాన్స్ కమిషన్ కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# రిజర్వేషన్లను పెంచుకుంటే పెద్ద ఎత్తున యుద్ధమే

- బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం కాలయాపన
- ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాలి
- బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

**వెలుతురు,హైదరాబాద్ 29 ఏప్రిల్ :**



స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లను పెంచు కుంటే పెద్ద ఎత్తున యుద్ధం జరుగు తుందని బిసి సంక్షేమ సంఘం జా తీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యు డు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించి కార్యచరణ సిద్ధం చేయాలని ఆయన పేర్కొ న్నారు. తెలంగాణ బిసి బిల్లుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు కోసం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు కాచిగూడ అభినం దన్ హోటల్ లో విలేకరుల సమా వేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్య ము ఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడు తూ..రాష్ట్ర ప్రభుత్వానికి బీసీల రిజర్వేషన్లు అమలు చేయడంలో చిత్తశుద్ధి కనబడటం లేదని విమ ర్శించారు. స్థానిక సంస్థల ఎన్నిక లలో బీసీ రిజర్వేషన్లు అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ప్పటికీ రాష్ట్ర గవర్నర్ ఆమోదం తె లిపిన తర్వాత రాష్ట్రపతికి పంప డం అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల నోటిఫికేషన్ లో బీసీలకు 42 శాతం ప్రకటించ కపోతే ఆమరణ నిరాహార దీక్ష చేప డుతామన్నారు. ప్రత్యేక జీవో ద్వా రా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లా లని డిమాండ్ చేశారు. బిసి వ్యతి రేకంగా చర్యలకు ప్రభుత్వం పాల్ప డుతుందని, ప్రభుత్వం తన వైఖరి ని మార్చుకోవాలని హితవు పలికా రు. పార్టీలకు అతీతంగా బీసీ నా యకులందరూ ఆయా పార్టీలపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపుని చ్చారు. విద్యార్థుల ఫీజు రీయింబ ర్స్ మెంట్ వెంటనే విడుదల చేయా లని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర పూర్వ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ.. 42 శాతం బీ సీ రిజర్వేషన్ బిల్లులపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయా లని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభు త్వాలే స్థానిక రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలను నిర్వహించవచ్చని వివ రించారు. గతంలో అసెంబ్లీలో బీసీ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో రా ష్ట్ర ప్రభుత్వం బీసీలను పక్కదోవ పట్టించిందని ఆయన విమర్శిం చారు. స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేసి మేధావులు, న్యాయనిపు ణులు సలహాలు తీసుకొని మళ్ళీ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. త ప్పుడు విధానాలతో ప్రభుత్వం ముందుకు పోతుందని ఆరోపిం చారు. జాతీయ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం మాట్లా డుతూ.. బీసీ సంక్షేమ సంఘం జాతీ య అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య నే తృత్వంలో అనేక ఉద్యమాలను చే శామని ఈ సందర్భంగా గుర్తు చేశా రు. బీసీలకు చెందాల్సిన 42 శాతం రిజర్వేషన్లను సాధించుకుంటామ ని ధీమ వ్యక్తం చేశారు. ఈ సమావే శంలో జాతీయ బీసీ సంక్షేమ సం ఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంక టేష్, బిసి సంక్షేమ సంఘం నాయ కులు రాజేందర్, మల్లేష్ యాదవ్, జెల్లా నరేందర్, పృథ్వీగౌడ్, కమలా కర్, జ్ఞానేశ్వర్, రామ్మూర్తి తదితరు లు పాల్గొన్నారు.

# తాత, ముత్తాతలు సంపాదించిన భూములను ధరణి భూతం కొల్లగొట్టింది

- కేసీఆర్ ఎన్ని దొంగ ఏడ్పులు ఏడ్చినా మా అభివృద్ధి ఆగదు.
- భూ భారతితో యాజమాన్య హక్కులలో తప్పుల సవరణ
- ఇంతవరకు 3400 దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 15 నాటికి భూ సమస్యలకు పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**వెలుతురు హైదరాబాద్ / కామారెడ్డి / వరంగల్/ ఖమ్మం ఏప్రిల్ 29:**
ధరణి చట్టాన్ని తెచ్చి పేదలను, సామాన్యులను ఏడిపించిన కేసీఆర్కు ప్రజలు రెండు సార్లు శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టినందుకు దుఃఖం వస్తుందేమోనని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. తండ్రులు, తాతలు ముత్తాతలు సంపాదించిన భూములను ధరణి భూతం కొల్లగొట్టిందని దుయ్యబట్టారు.



వరంగల్ బి. ఆర్ . నగర్లోని సింగరబోయిన అనిల్కుమార్, యల్లమ్మ దంపతుల ఇంట్లో సన్నబియ్యంతో వండిన భోజనాన్ని చేస్తున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,

బి.ఆర్.ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పేదల ఆస్తులను ధరణిని అడ్డం పెట్టుకొని వేలాది ఎకరాలను కొల్లగొట్టిన ఆనాటి పెద్దలు కనీసం పశ్చాత్తాపం పడడం లేదని విమర్శించారు.ఏదో పోయినట్లు, ఏదో జరిగినట్లు దుఃఖమొస్తుందని కపట ప్రేమ ఒలకబోశారు. కేసీఆర్ కన్నీరు మున్నీరుగా దుఃఖించినా సరే, పేద ప్రజలకు చేయాల్సిన సేవ , అభివృద్ధి చేసుతీరుతామని స్పష్టం చేశారు. .

కామారెడ్డి, వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలోని షెట్పల్లి, ఉరుసుగట్టు , సుర్దేపల్లిలో మంగళవారం నాడు నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తరతరాల నుండి సాగుచేస్తున్న భూ యజమానులకు పాసు పుస్తకాలు జారీచేయడం, తప్పులుగా నమోదు చేసిన పేర్లు సరిచేయడం, నిషేధిత భూములు విషయంలో తప్పులు సరిచేయడం వంటి అంశాలు భూ భారతి చట్టంలో ఉన్నాయన్నారు.

సామాన్య ప్రజలకు అర్ధయ్యే విధంగా భూ భారతి చట్టం తయారు చేయడం జరిగిందని, చట్టం తో పాటు రూల్స్ తయారు చేయడం జరిగింది. భూ భారతి 2025 చట్టం ప్రజలకు అర్థమయ్యే విధంగా, 18 రాష్ట్రాలు పర్యటించి 9 నెలలపాటు మేధో మధనం చేసి అధికారులు, మేధావుల సలహాలతో రూపొందించడం జరిగింది. గత ప్రభుత్వం 2020 సంవత్సరంలో తీసుకువచ్చిన చట్టంలో నిబంధనలు లేవు. భూ భారతి చట్టం 50 సంవత్సరాల పాటు మనుగడలో ఉంటుంది. . ఈ చట్టం గురించి అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని 4 జిల్లాల్లోని ఒక్కో మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద సదస్సులు నిర్వహించడంతో పాటు ప్రజల సమస్యలపై దరఖాస్తులు తీసుకోవడం జరుగుతోంది. అందులో భాగంగానే ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని లింగంపేట్ మండలాన్ని ఎంపిక చేయడం జరిగింది. ఇప్పటివరకు 20 గ్రామాలలో సదస్సులు నిర్వహించి 3400 కు పైగా అభ్యర్థన దరఖాస్తులు తీసుకోవడం జరిగింది. భూముల రిజిస్ట్రేషన్ , భూసమస్యల పరిష్కారానికి సంబంధించి తహసీల్దార్ తప్పు చేస్తే ఆర్డీఓ కు అప్పీలు చేసుకునే విధంగా, ఆర్డీఓ ఇచ్చిన తీర్పులో అన్యాయం జరిగితే కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు అభ్యంతరం ఉంటే సిసిఎల్ ఆపై ల్యాండ్ ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. అధికారులు తప్పులు చేస్తే చర్యలుతప్పవని అన్నారు. రాష్ట్రంలో 10956 గ్రామాలకు త్వరలో గ్రామ రెవిన్యూ అధికారులను నియమించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 1000 మంది సర్వేలను నియమించడం జరుగుతుందని తెలిపారు. లింగంపేట్ మండలంలోని సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. భూములు సర్వే చేసి పాస్ బుక్కులో ఎక్కించడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 15 నాటికి అన్ని మండలాల్లో సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. పర్యటనలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ జిల్లా సదస్సులో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వరంగల్ పట్టణ పరిధిలోని బి. ఆర్ . నగర్లోని సింగరబోయిన అనిల్కుమార్, యల్లమ్మ దంపతుల ఇంట్లో సన్నబియ్యంతో తయారుచేసిన మధ్యాహ్నభోజనం స్వీకరించి శాలువతో సత్కరించి రూ. 5000 నగదు బహుమతిని అందజేశారు



## ఈరోజు సాయంత్రం 4 : 00 గంటలకు తిరుమలగిరి ఆర్టీవో కార్యాలయంలో సారథి పోర్టల్ ను ప్రారంభించనున్న రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 29:**
కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ నిర్దేశకత్వంలో NIC ద్వారా అభివృద్ధి చేసినటువంటి డిజిటల్ సేవలైన "సారథి" మరియు "వాహన్" అప్లికేషన్లను ఇతర రాష్ట్రాల మాదిరిగా అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ డిజిటల్ సేవలను అమలు చేయడం ద్వారా దేశవ్యాప్తంగా పౌరులు పొందే రవాణా శాఖ సేవల లో ఏకరూపత రావడమే కాకుండా, పౌరులు తమ వాహనానికి సంబంధించిన అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ కు సంబంధించిన సమాచారాన్ని దేశంలో ఎక్కడి నుండైనా తెలుసుకునే అవకాశం మరియు రవాణా శాఖ సేవలు పొందే అవకాశం ఉంటుంది.
"సారథి" అప్లికేషను ఈరోజు, 30.04.2025న, సికింద్రాబాద్ RTO కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టుగా శ్రీ పొన్నం ప్రభాకర్ గారు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖా మంత్రివర్యుల గారిచే ప్రారంభించబడుతుంది. అదే విధంగా, "వాహన్" సేవలను 2025 ఆగస్టు చివరికి అందుబాటులోకి తేవడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించబడింది.
"సారథి" ప్రయోజనాలు:



1. సారథి అప్లికేషన్ ద్వారా, పౌరులు డ్రైవింగ్ లైసెన్ కు సంబంధించిన సేవలు, ఉదాహరణకు లైసెన్స్ పునరుద్ధరణ, చిరునామా మార్పు, కొత్త వాహన కేటగిరీ చేర్పు వంటి సేవలను దేశంలోని ఏ రాష్ట్రం నుండైనా సులభంగా ఒక్కసారి RTO కార్యాలయాన్ని సందర్శించడం ద్వారా పొందగలుగుతారు.
2. ప్రస్తుత విధానంలో, ఇతర రాష్ట్ర RTO కార్యాలయం నుంచి జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ సేవలు పొందేందుకు, లైసెన్స్ దారుడు కనీసం రెండు సార్లు RTO కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుంది: ఒకసారి పాత డేటా నమోదు కోసం, తర్వాత కోరుకున్న సేవ కోసం.
సారథి అప్లికేషన్ ఈ ప్రక్రియను సులభతరం చేస్తుంది, డ్రైవింగ్ లైసెన్స్ డేటాను కేంద్రీకృత ప్లాట్ ఫారం అందుబాటులో ఉంచడం ద్వారా, అనవసరమైన సందర్శనలను తగ్గిస్తుంది మరియు ప్రక్రియ వేగాన్ని పెంచుతుంది. ఇది పౌరులకు సౌకర్యం, అంతర్రాష్ట్ర సేవల పోర్టబిలిటీని మెరుగుపరుస్తుంది మరియు వేగవంతమైన, సమర్థవంతమైన, పారదర్శకమైన ప్రజా సేవలను అందించాలనే లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్తుంది.
3. పౌరులు లెర్నర్స్ లైసెన్స్ కు దరఖాస్తు చేసుకునే ముందు రోడ్డు భద్రత అవగాహన వీడియోను వీక్షించడం తప్పనిసరిగా చేయబడింది. తద్వారా దరఖాస్తుదారులు ప్రాథమిక ట్రాఫిక్ నిబంధనలు మరియు సురక్షిత డ్రైవింగ్ పద్ధతులపై పరిచయం కలిగి ఉండేలా చేస్తారు.
4. సారథి అప్లికేషన్ అమలుతో, డ్రైవింగ్ లైసెన్స్ లు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే డిజిలాకర్ ప్లాట్ఫారమ్ ద్వారా ప్రయోజనాలను పొందగలుగుతున్నారు. డిజిలాకర్ ద్వారా అధికారిక డాక్యుమెంట్లను, డ్రైవింగ్ లైసెన్స్ లను డిజిటల్ ఫార్మాట్లో భద్రపరచి పొందవచ్చు, ఫిజికల్ డాక్యుమెంట్లపై ఆధారపడనవసరం లేదు.సారథి డేటాబేస్ ను డిజిలాకర్ తో సమన్వయం చేయడం వల్ల, డిజిటల్ లైసెన్స్ లు చట్టపరంగా చెల్లుబాటు అయ్యేలా ఉండి, రియల్ టైంలో ధృవీకరణకు అందుబాటులో ఉంటాయి. ఇది రాష్ట్రాల మధ్య మరియు ఇతర అధికారిక సంస్థలచే తక్షణ ధృవీకరణను సులభతరం చేస్తుంది.
ఈ విధానం ద్వారా లైసెన్స్ దారులకు ఎప్పుడైనా, ఎక్కడైనా డాక్యుమెంట్లకు సులభంగా లభించడం మాత్రమే కాకుండా, డాక్యుమెంట్ల నకిలీకి అవకాశం తగ్గి ధృవీకరణ ప్రక్రియలో పారదర్శకత మరియు సమర్థత పెరుగుతుంది.
5. సారథి, అన్ని రాష్ట్రాల్లో ఒకే విధమైన ప్రక్రియను నిర్ధారిస్తుంది. రాష్ట్రాల మధ్య మారే పౌరులకు లైసెన్స్ బదిలీ అవసరమైనప్పుడు ఇది ఉపయోగకరంగా ఉంటుంది.
6. భారత డ్రైవింగ్ లైసెన్స్ లు ఇతర దేశాలకు వెళ్లినప్పుడు, వారి లైసెన్స్ లేదా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ యొక్క నిజమైనదని దేశాధికారులు ధృవీకరించుకోవడం సారథి ద్వారా సులభమవుతుంది.
7. ఇతర దేశాల్లో తాత్కాలికంగా నివసించే భారతీయ పౌరులు వారి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ గడువు ముగిసినప్పుడు, ఇండియన్ ఎంబసీ లేదా కాన్సులేట్ ద్వారా సారథి అప్లికేషన్ ద్వారా కొత్త పర్మిట్ (IDP) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీని వలన, గడువు ముగిసిన తర్వాత ప్రత్యేకంగా భారతదేశానికి రావాల్సిన అవసరం ఉండదు. ఇది ప్రవాస భారతీయులు, విద్యార్థులు, ప్రయాణికుల సౌలభ్యాన్ని పెంచుతుంది.
8. సారథి అప్లికేషన్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ డేటానుసారథి అప్లికేషన్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ డేటాను నేషనల్ డేటా సెంటర్లో భద్రంగా నిల్వ చేస్తారు. ప్రస్తుతం ఈ డేటా స్థానిక సర్వర్లలో నిల్వచేస్తున్నారు. ఇకపై రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం లేకుండా NIC నిర్వహించే డిజాస్టర్ రికవరీ సర్వర్లలో డేటా భద్రతను పొందవచ్చు.
9. మోటార్ వాహనాల చట్టం సవరణలు మరియు ఆ మేరకు జారీచేసిన నోటిఫికేషన్లు స్వయంచాలకంగా సారథి అప్లికేషన్ ద్వారా అమలవుతాయి. రాష్ట్ర స్థాయిలో స్థానికంగా సాఫ్ట్వేర్ మార్పులు అవసరం ఉండదు.
10. పౌరులు RTA కార్యాలయం నుండి పోస్టు ద్వారా ఫిజికల్ డ్రైవింగ్ లైసెన్స్ అందుకునే ముందు, ఆన్లైన్లో డిజిటల్ డ్రైవింగ్ లైసెన్సు డౌన్లోడ్ చేసుకోవచ్చు.
11. సారథి అప్లికేషన్తో ఇంటిగ్రేట్ చేసిన ఆన్లైన్ ఫిర్యాదు మాడ్యూల్ ద్వారా టికెటింగ్ సిస్టమ్ ఆధారంగా పౌరుల సమస్యలకు పరిష్కారం అందించబడుతుంది.


## సంపాదకీయం..

# పాక్‌ను కోలుకోకుండా దెబ్బకొట్టాలి !

ముల్లును ముల్లుతోనే తీయాలి. కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నట్లుగా ఉండాలి. పాక్ ఏర్పడడమే మత ఛాందసవాదంతో ఏర్పడింది. తాము భారత్‌ను చీల్చి ఏర్పడ్డామన్న జ్ఞానం వారిలో లేదు. అలాగే భారత్ భిక్షతో దేశంగా ఏర్పడ్డామన్న కృతజ్ఞత బంగ్లాదేశీయులకు లేదు. ఈ రెండు దేశాల్లో మిగిలిన అరకొర హిందువులను తన్ని తరిమేయడం..కశ్మీర్ సహా భారత్‌లో చిచ్చుపెట్టడం వీరి లక్ష్యంగా ఉంది. అది ఎప్పుడో రుజువయ్యింది. మనం శాంతి వచనాలు పలుకుతూ పోతే సమస్య పరిష్కారంకాదు. భారత్‌తో పెట్టుకుంటే అంతే సంగతులు అన్న విధంగా మన జవాబు ఉండాలి. రష్యా ఉక్రెయిన్‌పై దాడిచేసింది. ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేస్తూనే ఉంది. ఇలాంటి దెబ్బలు మనం కూడా కొట్టగలగాలి. నష్టం కలిగినా ఫర్వాలేదు. దేశాన్ని పటిష్టం చేసే క్రమంలో మనమంతా త్యాగాలకు సిద్ధపడాలి. ఈ దేశాన్ని వందలాది ఏళ్లుగా ఎందరో దాడులు చేసి ధ్వంసం చేశారు. మనలను బానిసలుగా మార్చారు. ఇవన్నీ మనకు గుణపాఠం కావాలి. ఇంకా దాడులను తట్టుకుంటూ పోదాం అన్న పద్దతి మాత్రం మంచిది కాదు. పహల్గాం దాడి జరిగి వారం రోజులు అవుతోంది. పాక్ నుంచి శిక్షణ పొందిన ముష్కరులే దాడికి కారణమని తేలింది. ముంబై దాడులు కావచ్చు..పుల్వామా దాడి కావచ్చు...పహల్గామ్ కావచ్చు.. అన్నీ పాక్ కుతంత్రాల వల్లనే జరిగిన ఘటనలు. అయినా దాయాది దేశానికి బుద్ది రావడం లేదు. పహల్గాం దాడిలో పాల్గొన్న నలుగురు ఉగ్రవాదుల్లో ఒకడైన హషిమ్ మూసా పాక్ సైన్యంలో మాజీ పారా కమాండో అని దర్యాప్తులో తేలింది. దీనిని బట్టి పాక్ సైన్యంలో పనిచేసిన వారు ఆ తరవాత ఎలా ఉగ్రవాదులుగా మారుతున్నారో గమనించాలి. ప్రస్తుతం అతడు కరుడుగట్టిన టెర్రరిస్టుగా మారినట్లు దర్యాప్తు బృందాలు పేర్కొన్నాయి. పాక్‌కు చెందిన లష్కరే తోయిబాతో కలిసి అతడు పని చేస్తున్నట్లు వెల్లడించాయి. ఆ సంస్థ మాస్టర్ మైండ్లే అతడిని కశ్మీర్‌కు పంపినట్లు- పేర్కొన్నాయి. ఇప్పటికే భారత సైన్యం ఉగ్రవాదులకు అనుకూలంగా పని చేస్తున్నారన్న అనుమానంతో వందల మంది స్థానికులను అదుపులోకి తీసుకొంది. వీరిలో 15 మంది ఉగ్రవాద ఓవర్ గ్రౌండ్ వర్కర్స్, మూసాకు ఉన్న సైనిక నేపథ్యాన్ని ధ్రువీకరించారని అధికారులు వెల్లడించారు. అతడు పాక్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ నుంచి లష్కరేలోకి సహాయకారిగా వచ్చినట్లు తెలుస్తోందని సైన్యం ధృవీకరించింది. ఇంతకన్నా ఆధారాలు ఇక అవసరం లేదు. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ ఎత్తేసిన తరవాత అక్కడ శాంతి నెలకొనడమే గాకుండా స్థానికులకు ఉపాధి దక్కుతోంది. పర్యాటకం పెరిగింది. అక్కడి యువతలో కూడా మార్పు వచ్చింది. వారంతా జనజీవన స్రవంతిలో కలిసి పోతున్నారు. దీనిని విచ్ఛిన్నం చేసే పన్నాగమే ఉగ్రదాడి అని తేలింది. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఘటన అమాన వీయమైనదే కాదు.... మనిషన్నవాడు చేసే పని కాదు. ఇది కేవలం రాక్షస జాతి మాత్రమే చేస్తుంది. పాక్ పెంచి పోషిస్తున్న రాక్షసులు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇందుకుమనం కూడా సన్నద్దం కావాలి. మరణించిన వారి ఆత్మకు శాంతి జరగాలి. ఉగ్రమూకలను చీల్చి చెండాడం ద్వారా మన సత్తా చాటాలి. అలాగే కాశ్మీర్‌లో ఉంటూ...ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న కొందరు పాక్ సానుభూతిపరులను కూడా గుర్తించి కఠినంగా శిక్షించాలి. వారిని కూడా ఉగ్రదాడులకు బాధ్యులను చేయాలి. భూతల స్వర్గంగా భావిస్తున్న కశ్మీర్‌ను చూడాలని వెళ్లిన పర్యాటకులను హతమార్చిన ఘటనను ఇప్పటికీ భారతీయులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ నరమేధాన్ని ప్రపంచ దేశాలు అన్నీ తీవ్రంగా నిరసించాయి. కేంద్ర ప్రభుత్వం ఇందుకు తగిన విధంగానే ప్రతిస్పందించింది. ఈ దుర్ఘటనకు కారణమైన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్‌ఎఫ్)ను, దానికి సహకారం అందించిన లష్కర్ ఎ తోయిబాను, దీనికి వెన్నుదన్నుగా ఉన్నదను కుంటున్న పాకిస్థాన్‌ను లక్షంగా చేసుకొని తక్షణ చర్యలు చేపట్టింది. తక్షణమే రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను రద్దు చేయడం, నీటి ఒప్పందాలను వెనక్కు తీసుకోవడంతోపాటు ఇంకా అనేక చర్యలు చేపట్టింది. సరిహద్దులను మూసివేయడం కూడా వెంటనే అమలు చేశారు. అదే విధంగా దాడికి బాధ్యులైన వారి లక్షంగా గాలింపు ముమ్మరం చేశారు. ఇవన్నీ ఊహించినవే అయినా సరిపోవని గుర్తించాలి. ప్రజల్లో వస్తున్న తీవ్ర నిరసన కారణంగా దాడులకు తక్షణ చర్యలు ఉండాలి. ఇప్పటికే కాశ్మీర్‌లో వేలాదిమంది పౌరులు, సైనికులు నేలకొరిగారు. వేలాదిమందిని హత్యలు చేశాలరు. లక్షల మందిని మత మార్పిళ్లు చేశారు. ఇవన్నీ గమనించిన తరవాతనే కేంద్రం 2019లో 370 ఆర్టికల్ రద్దు చేసి కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని ఎత్తేసింది. దీంతో సాధారణస్థితికి వచ్చి కాశ్మీర్ పర్యాటకంగా మళ్లీ చిగురించింది. దీనిని జీర్ణించుకోలేని పాక్ పాపాల భైరవులు దాడులకు తెగించారు. ఈ క్రమంలో అసవరమైతే యుద్ధం దాకా కూడా భారత ప్రభుత్వం వెళ్లవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇక పాక్‌ను ఎంతమాత్రం నమ్మరాదు. పాముకు పాలుపోసి పెంచినట్లుగా మన గత పాలకులు పాక్ పాలకులకు చేయూతను ఇచ్చారు. అందువల్ల మనం ఎంతమాత్రం ఉపేక్షించరాదు. కష్టమైనా, నష్టమైనా దేశాన్ని ఏకతాటిపైకి తీసుకుని రావాలి. రాజకీయపార్టీలు కూడా విభేదాలు పక్కన పెట్టి పాక్‌కు గుణపాఠం చెప్పే ప్రయత్నాలకు బేషరతు మద్దతు పలకాలి. అలాగే పాక్ ఉనికినే ప్రశ్నార్థకం చేసేలా ప్రతీకార చర్యలు ఉండాలి. అప్పుడే భారత్‌కు శాంతి. గత కొన్నేళ్లుగా మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరుతుంది.

# నలుగురు ముష్కరుల్లో ఒకడి గుర్తింపు

- షహిమ్ మూసా పారా కమాండోగా గుర్తింపు
- లష్కరే తోయిబాతో చేతులు కలిపి దాడికికుట్ర
- మిరిన్ని దాడులు జరగకుండా అప్రమత్తం అయిన సైన్యం





**న్యూఢిల్లీ,ఏప్రిల్29( వెలుతురు):** పహల్గాం దాడిలో పాల్గొన్న నలుగురు ఉగ్రవాదుల్లో ఒకడైన హషిమ్ మూసా పాక్ సైన్యంలో మాజీ పారా కమాండో అని దర్యాప్తులో తేలింది. దీంతో పాక్ సైన్యం కనుసన్నల్లోనే దాడులు జరుగుతున్నాయని రుజువయ్యింది. ప్రస్తుతం అతడు కరుడుగట్టిన టెర్రరిస్టుగా మారినట్లు దర్యాప్తు బృందాలు పేర్కొన్నాయి. పాక్‌కు చెందిన లష్కరే తోయిబాతో కలిసి అతడు పని చేస్తున్నట్లు వెల్లడిం చాయి. ఆ సంస్థ మాస్టర్ మైండ్లే అతడిని కశ్మీర్‌కు పంపినట్లు పేర్కొన్నాయి. ఉగ్రవాదులకు అనుకూలంగా పని చేస్తున్నారన్న అనుమానంతో వందల మంది స్థానికులను ఇప్పటికే భారత సైన్యం అదుపులోకి తీసుకొంది. వీరిలో 15 మంది ఉగ్రవాద ఓవర్ గ్రౌండ్ వర్కర్స్, మూసాకు ఉన్న సైనిక నేపథ్యాన్ని ధ్రువీక రించారని అధికారులు వెల్లడించారు. దీనిని బట్టి పాక్ కుతంత్రాలను గమనించవచ్చు. అతడు పాక్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ నుంచి లష్కరేలోకి సహాయకారిగా వచ్చినట్లు తెలుస్తోందని దర్యాప్తు బృందానికి చెందిన ఓ అధికారి పత్రికలకు వెల్లడించారు. ఈనేపథ్యంలో ఉగ్రవాదులకు, పాక్ సైన్యానికి మధ్య ఉన్న సంబంధాలను ఇది తెలియజేస్తోందన్నారు. పాక్ పారా కమాండోలు అత్యాధునిక శిక్షణ పొందుతున్నారు. వీరు సంప్రదా యేతర యుద్ధతంత్రం, కోవర్ట్ ఆపరేషన్లలో దిట్టలు. శిక్షణలో వీరిని మానసికంగా.. శారీరకంగా బలోపేతం చేస్తారు. దీంతోపాటు- యుద్ధరంగంలో ఎత్తుగడలు కూడా నేర్పిస్తారు. వీరు అత్యాధునిక ఆయుధాల వినియోగంలోను, నేరుగా చేతులతో పోరాడటంలోను నిపుణులు. ఈ దాడిలో పాల్గొన్న వారిలో కొందరు గతంలో గగన్‌నగర్, గదర్‌బాల్ అడవుల్లో ఆరుగురు స్థానికేతరులు, ఒక డాక్టర్‌ను, ఇద్దరు సైనిక పోర్టర్లను హత్య చేసిన ఘటనల్లో పాల్గొన్నారు. మూసా మాత్రం ఈ మూడు దాడుల్లోను పాల్గొన్నాడు. ఇక జునైద్‌భట్, అర్బాజ్ మిర్ కూడా పాక్‌లో శిక్షణ పొందినట్లు- గుర్తించారు. పహల్గాంకు చేరుకునేందుకు దాదాపు 22 గంటల పాటు టెక్కింగ్ చేసినట్లు దర్యాప్తులో తేలిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తమ ప్రణాళికను అమలుచేసేందుకు కోకెర్నాగ్ అడవుల నుంచి బైసరన్ లోయ వరకు కాలి నడకన వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయమే ఉగ్రమూకకు సైనిక శిక్షణ లభించిన అంశాన్ని తెలియ జేస్తోంది. ఇప్పటికే ఈ మూకను భారత సైన్యం వేటాడుతోంది. నాలుగుసార్లు త్రుటిలో వారు భద్రతా దళాల నుంచి తప్పించుకొన్నారు. మరికొన్ని రోజుల్లో దొరకవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈక్రమంలో వారిని కనుగొనేందుకు అడవుల్లో గాలిస్తున్నారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి తర్వాత భారత భద్రతా బలగాలు అప్రమత్త మయ్యాయి. ముష్కరులను పట్టుకునేందుకు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. పహల్గామ్ ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్‌ఐఎ దర్యాప్తు చేస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పలు వీడియోలు, సమాచారం అందడంతో వాటి ఆధారంగా.. ఉగ్రవాదులను గుర్తించడానికి విచారణను వేగవంతం చేసింది. ఇందులోభాగంగా ఉగ్రదాడి ప్రదేశంలో సీన్ రీక్రియేట్ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ సమయంలో ఉన్న పర్యాటకులు, స్థానిక ప్రజలను ప్రశ్నిస్తున్నారు. అక్కడ వారు తీసుకున్న ఫొటోలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈక్రమంలో కశ్మీర్‌లో మరిన్ని ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. పహల్గాం దాడి అనంతరం కశ్మీరీ లోయలో స్లీపర్‌సెల్స్ యాక్టివేట్ అయినట్లు తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్మూకశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాదుల ఇళ్లను సైన్యం పేల్చేస్తుండడంతో దానికి ప్రతీకారంగా వారు పెద్దఎత్తున దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు- తమకు సమాచారం అందిందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని..ఎవరైనా అనుమానాస్పదం గా కనిపిస్తే భద్రతా బలగాలకు సమాచారం ఇవ్వాలని సూచించాయి. దీంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కశ్మీర్ వ్యాప్తంగా ఉన్న మొత్తం 87 టూరిస్టు కేంద్రాల్లో 48 కేంద్రాలను మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కశ్మీర్‌లోని ప్రధాన ప్రదేశాలు గుల్మార్గ్, సోనామార్గ్ దాల్ లేక్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన పర్యాటక ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించాయి. ఏప్రిల్ 22న పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. దీంతో అక్కడినుంచి పర్యాటకులను ప్రత్యేక విమానాల్లో తరలించి.. ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం మళ్లీ పర్యాటకులు కశ్మీర్‌కు వస్తున్న నేపథ్యంలో నిఘా వర్గాలు తాజా హెచ్చరికలు చేశాయి.

# పహల్గాం దాడిపై పార్లమెంటులో చర్చిద్దాం

- సభలను అత్యవసరంగా సమావేశ పర్చండి
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ అగ్రనేతల లేఖ





**న్యూఢిల్లీ,ఏప్రిల్29( వెలుతురు):** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో అత్యవసరంగా పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. అత్యవసరంగా పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు. వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం ఎల్లప్పుడూ కలిసి నిలబడతామని చూపించాలని లేఖలో రాహుల్ కోరారు. పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మందికి నివాళులర్పించేందుకు సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా భారత పార్లమెంటు సాక్షిగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని లేఖలో తెలిపారు. కాగా.. పహల్గామ్ దాడి జరిగిన వెంటనే తర్వాతి రోజు సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం కూడా చేశారు. భారత ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలకు తాము మద్దతుగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ- సమావేశం నిర్ణయం తీసుకుంది. ఆ తరువాత జరిగిన అఖిల పక్ష సమావేశానికి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేతో పాటు- అన్ని పార్టీల నేతలు హాజరయ్యారు. ఆ సమావేశంలో భారత ప్రభుత్వం చేపట్టే చర్యలన్నింటికీ మద్దతుగా ఉంటామని, వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు. అయితే ఆ సమావేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకాకపోవడాన్ని మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. టు-వంటి ముఖ్యమైన సమావేశానికి ప్రధాని మోదీ వచ్చి అక్కడ జరిగిన సంఘటనలను వివరించి ఉంటే బాగుండేదని, ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రధాని మోదీ పార్లమెంటు- సమావేశాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. టీఎంసీ నేత సుధీప్ బందోపాధ్యాయ, ఆప్ నేత సంజయ్ సింగ్ కూడా ఈ దాడి ఘటన భద్రతా లోపాలను చూపిస్తోందని.. ఈ క్రమంలో భద్రతా లోపాలు ఎందుకు జరిగాయి.. వాటిని ఏ విధంగా సరిచేస్తున్నారు అనే దానిపై ప్రధాని మోదీ జవాబు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్ కూడా ప్రధాని మోదీకి లేఖ రాశారు.

ఉగ్రవాదంపై దేశం ఏకమైందని.. ప్రపంచానికి సందేశం ఇవ్వడానికి పార్లమెంటులో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని లేఖలో కోరారు. ఉగ్రవాద దాడుల ఫలితంగా ఉత్పన్నమయ్యే పరిస్థితిని ఎదుర్కోవడానికి సమిష్టి సంకల్పాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.అయితే బైసరన్ లోయ తెరిచిన విషయం తమకు తెలియదని కేంద్రం తెలిపింది. ఇది కచ్చితంగా భద్రతా వైఫల్యమేనని ఎంపీ సుప్రియా సూలే పేర్కొన్నారు.

# నేడు అక్షయతృతీయ పుణ్యతిథి

## శుభకార్యాలకు మంచిదని పండితుల ఉవాచ




**తిరుమల,ఏప్రిల్29( వెలుతురు):** అక్షయమంటే క్షయం కానిది. ఈ రోజు అంటే బుధవారం అక్షయ తృతీయ హిందువులకు చాలా ప్రత్యేకమైన, పవిత్రమైన రోజు. ఈ పండుగను ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో శుక్ల పక్షం మూడో రోజు వస్తుంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న వచ్చింది.అక్షయ తృతీయ రోజున వివాహం, గృహప్రవేశం, కొత్త వ్యాపారం లాంటి శుభ కార్యక్రమాలు ప్రారంభించడానికి, దానధర్మాలు చేయడానికి ఉత్తమమైనదిగా పరిగణిస్తాయ. అక్షతయ తృతీయరోజున చేసే అన్ని మంచి పనులు శాశ్వత ప్రభావాన్ని చూపుతాయి. పురాణాల ప్రకారం ఈ రోజునే శ్రీ మహావిష్ణువు లక్ష్మీదేవిని పెళ్లాడాడని ప్రతీతి. పరమశివుడు కుబేరుడిని సంపదలకు సంరక్షకుడిగా నియమించాడు. ఇక, అక్షయ తృతీయ రోజు కేవలం మతపరంగానే ముఖ్యమైనది కాదు. జీవితంలో ఆనందం, శ్రేయస్సు, విజయాన్ని పొందడానికి గొప్ప అవకాశాన్ని కూడా ఇస్తుందని పండితులు చెబుతారు. అయితే, లక్ష్మీదేవి కటాక్షం దక్కాలంటే ఆమెకు ఇష్టమైన మంచి పనులనే చేయాలి. అక్షయ తృతీయ నాడు విష్ణువు, లక్ష్మి దేవికి ఆచారం ప్రకారం పూజించాలి. అక్షయ తృతీయ రోజున చేసే దానానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఆహారం, బట్టలు, బంగారం, ఆవు, గొడుగు మొదలైన వాటిని దానం చేస్తే చాలా శుభప్రదం అంటారు. చేపట్టిన పనులు విజయవంతమై ఫలవంతమైనదిగా జీవితంలో ఆనందం, శ్రేయస్సు పెరుగుతుందని నమ్ముతారు. అక్షయ తృతీయ రోజున ఏదైనా కొత్త పని చేయడాన్ని శుభప్రదంగా భావిస్తారు. కొత్తగా ఆస్తి లేదా ఇంకేదైనా కొనేందుకు, ఎక్కడైనా పెట్టుబడి పెట్టేందుకు అక్షయ తృతీయ అనుకూలమైన రోజుగా భావిస్తారు.ఈ రోజున బంగారం, వెండి, వాహనం, ఇల్లు లేదా భూమిని కొంటే శుభం కలిగి అదృష్టం నడిచొస్తుందని భావిస్తారు. అందుకే అక్షయ తృతీయ రోజు బంగారం కొనడం ఓ సెటిమెంట్‌గా భావిస్తారు.

## మంచి నీరు జీవనాధారమే కాదు

# ప్రాణాధారం

● శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ కుమార్




**శంకర్ పల్లి వెలుతురు ఎప్రిల్ 29**

నీరు జీవనాధారమే కాదు ప్రాణాధారము కాబట్టి వేసవిలో ప్రజల దాహోర్తిన తీర్చడానికి ప్రతీ ఒక్కరు పాటుపడాలని శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ కుమార్ (సతీష్) పేర్కొన్నారు. మంగళ వారం స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రయాణీకులకు దాహోర్తిని తీర్చడానికి కీ.శే.ఎం.నర్సింహస్వామి (బీసీ నాయకులు, ప్రముఖ జర్నలిస్ట్), అలాగే కీ.శే.వడ్ల మోనాచారి (సామాజిక కర్త) పేరిట చలివేంద్రాన్ని ప్రారభించిడం జరిగింది. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి కార్యక్రమాలను చేయాలన్నారు. వికారాబాద్ రైల్వే శాఖ ఆఫీసర్ వినోద్ రెడ్డి మాట్లాడుతూ నరేష్ అన్న పేరిట, వేణేంద్రచారి నాన్న పేరిట ప్రయాణీకుల దాహాన్ని తీర్చడానికి నీటిని అందించడం అభినందనీయమన్నారు. శంకర్ పల్లి రైల్వే స్టేషన్ మాస్టర్ రవిందర్ మాట్లాడుతూ సేవా ఫౌండేషన్ వారు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జెనరల్ సెక్రటరి వేణేంద్రచారి, టీచర్ ఆర్.కళావతి, ఫౌండేషన్ సభ్యులు కరాటే రవీందర్, కార్తిక్ యాదవ్, వికారాబాద్ మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్, వినయ్ కుమార్ గౌడ్, ధీరజ్, శ్రీశైలం, రైల్వే సిబ్బంధి, ప్రయాణీకులు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులకి శంకుస్థాపన చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ AMC చైర్మన్ ఉబ్బు వెంకటయ్య



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ ఏప్రిల్ 29 :**

పట్టణ కేంద్రం 17,వ వార్డులో బచ్చన్ స్కూల్ నుండి కూరగాయల మార్కెట్ వరకు సి,సి రోడ్డు నిర్మాణం పనులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, షాదిఖాన చైర్మన్ Md కరీం, AMC డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్ ,చింతల సాయిలు, పస్తం గంగా రాములు, Md ఏజాస్, చిలువేరు మంగయ్య, వీరమల్ల సత్తయ్య, తూర్పాటి నరసింహ, మాదాని గోపాల్, ఎల్లప్ప, వడ్డేగోని నరసింహ, గంటల బుచ్చి రెడ్డి, పస్తం నరసింహ, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మాయి మిస్సింగ్.. కేసు నమోదు

● జహీరాబాద్ పట్టణ ఎస్ ఐ కాశీ నాథ్ వెల్లడి...

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 29:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బాగరెడ్డిపల్లి కు చెందిన ధ్యరంగుల స్వప్న (20) భవాని మందిర్ రోడ్ లోని అశ్విని టైలరింగ్ షాప్ లో టేలర్ వర్క్ నేర్చుకుంటుంది.. ఈ నెల 25న టైలరింగ్ వర్క్ కు వెళుతున్న అని చెప్పి ఆమె తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు స్థానికంగా బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈమేరకు ఆమె తండ్రి ధ్యరంగుల కేశప్ప ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు.

## బాధితుడు బతికుండగానే చనిపోయినట్లు నివేదిక సమర్పణ

● ఆర్ ఐ, డిప్యూటీ తహసిల్దార్ ల సస్పెన్షన్...

● తప్పుడు వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన అధికారులు...

● బాధితుని ఫిర్యాదుతో సస్పెండ్ చేసిన కలెక్టర్ క్రాంతి వల్లూరు...

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 29:**



వాస్తవికతకు విరుద్ధం గా తప్పుడు వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేసినందుకు గాను గతంలో జహీరాబాద్ డిప్యూటీ తహసిల్దార్ గా పనిచేసి ప్రస్తుతం కల్హేర్ డిప్యూటీ తహసిల్దార్ గా చేస్తున్న బీటీ పవన్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ యాది లాల్ లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.జహీరాబాద్ మండలానికి చెందిన షేక్ అహ్మద్ తండ్రి బాసిత్ అహ్మద్ బతికే ఉన్నప్పటికీ అతను చనిపోయినట్లు అతని కోడలు బిపాషాకు వారసత్వ ధ్రువీకరణ పత్రం ఆర్ ఐ యాది లాల్ ఇచ్చిన పంచనామా నివేదిక మేరకు డిప్యూటీ తహసిల్దార్ వారసత్వ ధ్రువీకరణ పత్రంమంజూరు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరుపకుండానే బతికి ఉన్న వ్యక్తి చనిపోయినట్లు పంచనామా నివేదిక సమర్పించారు. వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన డిప్యూటీ తాసిల్దార్ బి.టీ. పవన్ కుమార్ , తప్పుడు నివేదిక సమర్పించిన ఆర్ ఐ యాదిలాల్ లను తెలంగాణ సివిల్ సర్వీసెస్ (CCA), రూల్స్1991 లొని రూల్ (8) సబ్ రూల్ 1&2) ప్రకారం విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకుగాను డిప్యూటీ తహసిల్దార్, ఆర్ ఐ లను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు.

## కలెక్టర్ పై విరుచుకుపడ్డ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 29**

మండల కేంద్రంలో భూభారతి అవగాహన సదస్సులో, మంగళవారం యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం ధరణిని తీసుకొచ్చి, చాలా పొరపాట్లు చేసిందని వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ లేకుండా చేసిందని, ఆ వ్యవస్థ బాగాలేదని, ఇప్పుడు ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చాలా బాగా ఉందని మీరందరూ స్టేజి ముందు కూర్చున్న వారు చప్పట్లు కొట్టాలని ఒక కాంగ్రెస్ కార్యకర్తలాగా వ్యవహరించడం, తగదని మండిపడడం జరిగింది. అనంతరం రజతోత్సవ సభ అయిపోయిన వెంటనే కేసీఆర్ పై కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, కేసీఆర్ సభలో ఎండగట్టారన్నారు. తెలంగాణ ప్రజలను దగా చేసి, బీఆర్ఎస్ పార్టీపై, కేసీఆర్ పై ఆరోపణలు చేయడం విచారకరమ న్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయలేక గ్రామా ల్లోకి వెళ్లాలంటేనే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు వణుకు పుడుతుందన్నారు. ఈ వణుకు చూసే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేక కాంగ్రెస్ పార్టీ చేతులేత్తింసిందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్, పున్న వెంకటేశం, ఎండి అమీర్, జిల్లా నాయకులు ఎస్కే చాంద్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, నాయకులు బత్తుల వెంకటేశం, కోనూరు ముత్తయ్య, బండ శ్రీనివాస్ రెడ్డి, ఆవుల నరేందర్, ఆవుల శ్రీధర్, లవణం రాము, బత్తిని నాగరాజు, నోముల లింగస్వామి కర్రె శీను, కుక్కు సాయి, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం - రైతుల చుట్టం

● ధరణి దండగ - భూ భారతి పండగ

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 29**

భూ భారతి చట్టం - రైతుల చుట్టం అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు, మంగళవారం నాడు రామన్నపేట మండల కేంద్రంలో భూ భారతి చట్టం అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని కల్యాణ లక్ష్మీ ద్వారా మంజూరైన 32 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసి, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూర్కెన 87 చెక్కులను పంపిణీ చేశారు. రామన్నపేట బస్టాండ్ ఆవరణలో నూతనంగా కోనుగోలు చేసిన ఆర్టీసీ బస్సు ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంత్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధరణి వైబ్ సైట్ ప్రైవేట్ వ్యకి చేతుల్లో ఉండేది.ప్రజల భూములకు రక్షణ కవచం లాగా ఉండాలనే భూ భారతి చట్టం తీసుకవచ్చింది.కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం గ్రామలాల్లో వీఆర్వో వ్యవస్థ రద్దు చేశారు. అది చాలా పెద్ద పొరపాటు,ఆధార్ కార్డు లాగే ఇకపై మన భూమికి భూదాన్ కార్డ్ ఉంటుంది. ఎక్కడ కూడ రైతులకు, మరీ ముఖ్యంగా పేద వారికి అన్యాయం జరగవద్దు. అనేదే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. ఇంత మంచి చట్టం తెచ్చిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు ధన్యవాదముల.



## పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 29**

మండలం మునిపంపుల గ్రామానికి చెందిన గాదె ఉపేందర్ మసూర గార్ల కుమారుడు కూతురు పట్టు వస్త్రాలు అలంకరణ కార్యక్రమం పట్టణ కేంద్రంలోని జేపీ ఫంక్షన్ హాల్ లో జరగగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై చిన్నారులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గాదం పారిజాత, ముకుంద, మాజీ సర్పంచులు డోగ్గిపర్తి జానకి, రాములు, కట్ట యాదయ్య, టిఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు బత్తుల వెంకటేశం, నాయకులు ఆవుల నరేందర్, ప్రభాకర చారి, మేకల రాములు, కర్రె శీను, ఉయ్యాల సాయి, తదితరులు పాల్గొనడం జరిగింది.

## మహాత్మా జ్యోతిబా పూలే ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం.

*మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపాల్ మల్క సంధ్యారాణి..*

**తూప్రాన్ వెలుతురు ఏప్రిల్ 29:**



రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఇంటర్మీడియట్ ప్రవేశ సీటు పొందేందుకు దరఖాస్తులను కొరడం జరుగుతుందని తూప్రాన్ మండల కేంద్రంలోని రావెల్లి గ్రామ శివారులోని మహాత్మ జ్యోతిబా పూలే సర్సాపూర్ బాలకల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రవేశ అవకాశాలను వచ్చేనెల మే 12 వరుకు విద్యార్థులు సద్వినియోగం చేసుకుని దరఖాస్తులు అందజేయలని పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే ఇంటర్మీడియట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని ఇలాంటి మంచి అవకాశాలను విద్యార్థులందరూ సద్వినియోగ పరచుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ నర్సాపూర్ బాలికల జానియర్ కళాశాలలో ఎం.పి.సి, బై.పి.సి కోర్సుల అడ్మిషన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే లో చదివిన విద్యార్థులకు కేవలం ప్రిన్సిపాల్ కి ఒక అర్జీ పెట్టుకుంటే సరిపోతుందని, ఇతర పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్ లైన్లో అప్లికేషన్ పెట్టుకోవాల్సి ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.



# “అంతర్జాతీయ విత్తనాల ఉత్సవాలు”






**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 29:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని పస్తాపూర్ గ్రామంలోగల డిడిఎస్ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ విత్తనాల దినోత్సవాని స్మరించుకుంటూ విత్తనాల ప్రదర్శనతో మహిళా రైతులు ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో 30 గ్రామల నుండి సుమారు 60 విత్తన సంరక్షకులు, డిడిఎస్ స్టాఫ్ సభ్యులు పాల్గొన్నారు. సంఘం రైతులు అందరూ కలిపి 70 వరకు దేశియా విత్తన రకాలను ప్రదర్శించారు. వీటిలో ముఖ్యంగా చిరుధాన్యాలు, పప్పు గింజలు మరియు నూనె దినుసులువంటి తిండి పంటలను రైతులు ఎక్కువగా కాపాడుకున్నారు. అత్తకోడళ్ళ జొన్నలు, నల్ల తొగరి, బుర్క తొగరి, తెల్ల శనగలు, నల్ల బెబ్బరి వంటి అరుదైన మునిగిపోతున్న పంట రకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వీరిలో బిడకన్నె గ్రామం మహిళా సంఘం నుండి శ్రీమతి జడల చంద్రమ్మ 58 విత్తన రకాలు ప్రదర్శించి మొదటి బహుమతిని అందుకున్నారు. రెండవ బహుమతిని 56 రకాలు ప్రదర్శించిన శ్రీమతి కర్నె నర్సమ్మ, గుంజోటి గ్రామం, మూడవ బహుమతి 55 విత్తన రకాలు ప్రదర్శించిన శ్రీమతి కందకం మొగులమ్మ, పొటపల్లి గ్రామం అందుకున్నారు. “ఆడవారికి విత్తనాలు చాలా దగ్గర సంబంధం ఉన్నది. మొదటిగా వ్యవసాయం మానవులు కనుక్కున్నది. ఆడవారు వాళ్ళ ఇంటి దగ్గర విత్తనాలు దాచుకోవటం మళ్ళీ వాటితో పరిశోధన చేయటం కారణంగానే వ్యవసాయం అన్నది అభివృద్ధి చెందింది. అట్లాంటి మంచి పద్ధతిని మనం ముందుకు తీసుకువెళ్తున్నాం అంటే అది చాలా గొప్ప విషయం.” అని చుక్కమ్మ, సంఘం సూపర్వైజర్ అన్నారు. “నేడు ప్రపంచం అంతా కూడా పోగొట్టుకున్న పద్ధతులు మళ్ళీ వెలుగులోకి తీసుకురావాలని చూస్తున్నది. మన తిండి వ్యవస్థలో స్వంత విత్తనాలు దాచుకోవటం యొక్క విశిష్టతను ప్రపంచం మొత్తం గుర్తిస్తున్నారు. ఎన్నో దశాబ్దాలుగా ఈ పద్ధతులు మునిగిపోకుండా కాపాడిన డిడియస్ మహిళలు నుండి నేడు స్ఫూర్తి అందుకుని అందరూ ఈ పనిని ముందుకు తీసుకుపోవాలి.” అని డా. గౌరి శంకర్, విత్తన శాస్త్రవేత్త అన్నారు. “ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలలో రైతులకు విత్తనాలు దాచుకునే హక్కులు కూడా లేవు. ప్రతి విషయంలో మార్కెట్ మీద ఆధారపడవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. ఇట్లాంటి సమయంలో మీరు ఇన్ని ఊర్లు నుండి వచ్చి ఇన్ని రకాల విత్తనాలు చాలా గర్వంగా ప్రదర్శించటం చాలా ఆనందంగా ఉన్నది” అని డా. దివ్య వెలుగురి, డిడియస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అన్నారు. ఈ కార్యక్రమలో విత్తన సంరక్షకులు, డిడియస్ స్టాఫ్ సభ్యులు, డిడియస్ కెవికె స్టాఫ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో వివక్ష తగదు

- ఇందిరమ్మ కమిటీ పేరుతో సామన్యులకు శటగోపం
- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు ఇవ్వకపోతే మండల కార్యాలయం ముట్టడి చేస్తాం
- మీడియా సమావేశంలో బిజెపి నాయకుల హెచ్చరిక...



**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 29:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో వివక్ష చూపెడుతుందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం బిజెపి మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో శంకరపట్నం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమ్మిరెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులు ఎంపికలో ఇందిరమ్మ కమిటీ పేరుతో ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తూ కేవలం ఇందిరమ్మ కమిటీ, కాంగ్రేసు నాయకులకు సిఫారసు చేసిన జాభితానే అధికారులు సర్వే చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ ఇండ్లు మంజూరు చేస్తామని చేసిన వాగ్దానం రేవంత్ రెడ్డి నిలుపుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలలో టిఆర్ఎస్ పార్టీ గ్రామాలలో ఏ ఒక్క ఇల్లు మంజూరు చేయకపోవడంతో కాంగ్రెస్ పార్టీని నమ్మి సామాన్య ప్రజలు ఇల్లు వస్తుందని ఆశతో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని అలాంటి సామాన్యులను సంవత్సర కాలంగా ఊరిస్తూ తీర ఇడ్లు ఇచ్చే సమయానికి సవ లక్ష కొర్రీలు పెడుతూ వారి ఆశలపై నీళ్లు చల్లుతుందని పెర్కొన్నారు. కొలతల సాకుతో సైతం సామాన్యులకు ఇండ్లను దూరం చేసే దూరం చేస్తుందని పేర్కొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కోసం సర్వే చేసినప్పుడే అధికారులు తప్పులు తడకగా జాభితా తయారు చేశారని గతంలో గ్రామసభలలో ప్రజలు నిలదీయడంతో సవరించి మళ్ళీ గ్రామసభలు పెడతామని ఇప్పటివరకు గ్రామ సభలు పెట్టలేదని అర్హులైన వారిని కూడా ఎల్ 1 జాబితాలో కాకుండా ఎల్ 2, ఎల్ 3 జాబితాలో చేర్చి అర్హులు లబ్ధి పొందకుండా చేశారని, అధికారులు కూడా కాంగ్రెస్ నాయకుల కనుసన్నాలో నివేదికలు తయారు చేసి పంపిస్తున్నారని పేర్కొన్నారు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని లేని పక్షంలో మండలంలోని అర్హులైన లబ్ధిదారులతో పెద్ద ఎత్తున మండల కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దొంగల రాములు, దాసరపు నరేందర్, రాసమల్ల శ్రీనివాస్, బిజిలి సారయ్య, చెర్ల శ్రీనివాస్, గూళ్ళ రాజు, గుర్రం శ్రీనివాస్, అమరగొండ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం వక్ఫ్ పై సవరణలు చేపట్టింది..

- లక్షల కోట్ల విలువచేసే ఆస్తులు కలిగిన వక్ఫ్ బోర్డు ఇన్నేళ్లు ఎవరి ప్రయోజనాల కోసం పనిచేసిందనే విషయాన్ని గ్రహించాలి..
- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర....



**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 29:**
వక్ఫ్ నిబంధనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడానికి, పేద మధ్యతరగతి ముస్లింల ప్రయోజనాలు, సంక్షేమం అభివృద్ధి కోసం మోడీ ప్రభుత్వం వక్ఫ్ (సవరణ) చట్టం చేపట్టిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర తెలిపారు. బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు, వక్ఫ్ బోర్డు సవరణ కమిటీ తిమ్మాపూర్



మండల ప్రోగ్రాం కన్వీనర్ బూట్ల శ్రీనివాస్ అధ్యక్షతన వక్ఫ్ చట్ట సవరణ -2025 జన జాగరణ అభియాన్ మండల కార్యశాల ప్రోగ్రాం సోమవారం రోజున కొత్త పల్లి లోని సాయిరాం ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి ఆయన మాట్లాడుతూ వక్ఫ్ అనేది ఇస్లామిక్ చట్ట ప్రకారం ఇవ్వబడిన తిరిగి ఇవ్వలేని దాతృత్వ నిధి అన్నారు. భారతదేశంలో 1996 నుండి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. 2018 కేంద్రీయ వక్ఫ్ పరిషత్ నివేదిక ప్రకారం భారత్లో 10 లక్షల కోట్లకు పైగా అంచనా విలువ కలిగిన ఎనిమిది లక్షల ఎకరాలకు పైగా వక్ఫ్ కు ఆస్తులు ఉన్నాయని తెలిపారు.

అయితే వక్ఫ్ యొక్క పాలన వ్యవస్థ బలహీనంగా ఉండి , బోర్డులో ఎవరు ఎవరికి జవాబు దారి గా ఉండడం లేదని , ఆ కారణం చేతనే మోడీ ప్రభుత్వం వక్ఫ్ వ్యవస్థను క్రమబద్ధీకరించడానికి వీలుగా వక్ఫ్(సవరణ) చట్టం-2025ను ప్రవేశపెట్టిందన్నారు. ప్రధానంగా వక్ఫ్ పెద్ద మొత్తంలో ఆస్తులు కలిగి ఉన్న ముస్లిం సమాజ ప్రయోజనాలు ,సంక్షేమం అభివృద్ధి కోసం వక్ఫ్ పనిచేసిన దాఖలాలు ఏమీ లేవని, ముస్లిం సమాజాన్ని దోచుకుందని ఆరోపించారు. ముస్లిం ప్రజా సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన వక్ఫ్ భారత్లో అన్నింటికన్నా పెద్ద స్కామ్ గా తయారైందన్నారు. లక్షల కోట్ల ఆస్తులు కలిగి ఉన్న వక్ఫ్ ముస్లిం సమాజ సంక్షేమ, అభివృద్ధి కోసం ఏనాడు ఆలోచన చేయలేదన్నారు. ఈరోజుకి 31 శాతం ముస్లింలు దారిద్యరేఖకు దిగువనే జీవితాలను గడుపుతున్నారని , వారికి చేయూతనివ్వాలనే ఆలోచన వక్ఫ్ ఏనాడూ చేయలేదన్నారు. ప్రధానంగా వక్ఫ్ భూములలో షాపింగ్ మాల్స్, హోటల్లు, వ్యాపార భవనాలు విలసిల్లుతున్నాయి కానీ పేద ముస్లింలకి ఇప్పటికీ ఏ విధమైన ప్రయోజనం చేకూరలేదన్నారు. 80 శాతం వక్ఫ్ భూములు అవినీతి, అక్రమ కబ్జాలకు గురయ్యాని పేర్కొన్నారు. ముస్లిం వర్గాల సేవ కోసం ఉద్దేశించిన వక్ఫ్ భూమి కొంతమంది వ్యక్తులకు రియల్ ఎస్టేట్ వ్యాపార సామ్రాజ్యంగా మారిందన్నారు. 2018 లో కేంద్ర వక్ఫ్ పరిషత్ వెలువరించిన నివేదికలో వక్ఫ్ బోర్డులో ఏలాంటి పారదర్శకత లేదని, అవినీతి పతాకాస్థాయిలో ఉందని పేర్కొన్న విషయాన్ని ఆయనఈ సందర్భంగా గుర్తు చేశారు. 2006 సచార్ కమిటీ నివేదిక ప్రకారం విద్య, ఉద్యోగం, ప్రభుత్వ సేవల పరంగా ముస్లింల పరిస్థితి దళితుల కన్నా అద్వాన స్థితిలో ఉందని , ఈ పరిస్థితిని మెరుగుపరచకపోతే ఎవరి సంక్షేమం కోసం చట్టం తయారు చేయబడిందో ఆ చట్టం ద్వారానే దోపిడి గురయ్యే అవకాశం ఉందన్నారు. వక్ఫ్ స్కాలర్షిప్ నిధులు నకిలీ లబ్ధిదారుల పేరుతో దోపిడీకి గురయ్యాయని , దీంతో అసలైన పేద ముస్లిం విద్యార్థులు చదువుకునే అవకాశం కోల్పోయారని తెలిపారు. ప్రస్తుతం 70 శాతం వక్ఫ్ ఆస్తులు ఆక్రమణలకు గురయ్యాయని, మిగిలిన ఆస్తులు ,మాల్స్, హోటల్లు, పరిశ్రమలకు నామమాత్రపు లీజుకు కట్టబెట్టారన్నారు. గత వక్ఫ్ బోర్డులో ఉన్న లోపాలను సరి చేస్తూ మోడీ ప్రభుత్వం చట్టంలో సవరణలు చేపట్టిందన్నారు. అయితే ఇన్నాళ్లు వక్ఫ్ ఆస్తులను దోచుకున్నోళ్లకు, సొమ్మును అనుభవించిన కొంతమందికి సవరణ చట్టం మింగుడు పడడం లేదని తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టం పేద ముస్లిం సమాజ ప్రయోజనాలు సంక్షేమ అభివృద్ధి కోసమేననే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి, మోడీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఇట్టి ప్రోగ్రాంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, మండల కన్వీనర్ వక్ఫ్ బోర్డు సవరణ చట్టం కమిటీ కో కన్వీనర్లు గడ్డం శ్రీనివాస్ రెడ్డి , బోనాల మోహన్ ,మండల ఉపాధ్యక్షులు తమ్మనవేణి రాజు,జిల్లా ఓబీసీ కార్యదర్శి ఎర్రోజు లక్మన్ , బీజేవైఎం మండల అధ్యక్షులు గడ్డం అరుణ్,బూత్ అధ్యక్షులు బండి స్వామి, తమ్మణవేని మహేష్, గొల్లపల్లి మల్లేశం గౌడ్,సుద్దాల సతీష్,పుట్ట ఓంకార్,లెనిన్, సిరిసిల్ల నర్సయ్య, ఇజ్జగిరి హరీష్,వరుకోలు రాజయ్య,మల్లెతుల అశోక్, వినవంక అంజయ్య, కొత్తూరు శ్రీనివాస్ ,చిందం అంజి తదితరులు పాల్గొన్నారు.

## కర్రెగుట్ట చుట్టూ మందుపాతరలు

- ఆచితూచి అడుగేస్తున్న బలగాలు

**ములుగు,ఏప్రిల్29( వెలుతురు):**
తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. ఎనిమిది రోజులుగా కేంద్ర బలగాలు కర్రెగుట్ట అడవులను తమ ఆధీనంలోకి తీసుకొని మావోయిస్టుల కోసం అన్వేషిస్తున్నాయి. వేలాది కేంద్ర బలగాలు సెర్చ్ ఆపరేషన్ను నిరంతరంగా చేపడుతున్నాయి. సుమారు వెయ్యి మంది మావోయిస్టులు కర్రెగుట్టల్లోని సొరంగాలలో ఉన్నారనే సమాచారం మేరకు కూంబింగ్ బలగాలు ఆ దిశగా వేట కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని చత్తీస్గఢ్ పోలీసులు ధ్రువీకరించారు. అయితే, కర్రెగుట్టల చుట్టూ మావోయిస్టులు భారీగా మందుపాతరలు అమర్చడంతో కూంబింగ్ ఆపరేషన్ ఆలస్యమవుతోందని తెలుస్తోంది. మావోయిస్టులు అమర్చిన సుమారు 100కు పైగా బాంబులను కేంద్ర బలగాలు నిర్వీర్యం చేసినట్లు- సమాచారం. మావో యిస్టులు బీరు బాంబులను సైతం అమర్చగా వాటిని చూసిన కేంద్ర బలగాలు ఆశ్చర్యం వ్యక్తం పరుస్తున్నట్లు- తెలుస్తోంది. కర్రెగుట్టల్లో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నట్లు- జోరుగా ప్రచారం జరుగుతుండటంతో కేంద్ర బలగాలు సెర్చ్ ఆపరేషన్ను మరింత ముమ్మరం చేశాయి. ఇదిలా ఉండగా కర్రెగుట్టల్లో కూంబింగ్ ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి.

## మంగళ ట్యూబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో లీగల్ అవేర్నెస్ క్యాంపు

- పాల్గొన్న లీగల్ అవేర్నెస్ క్యాంపును ప్యానెల్ అడ్వకేట్ సోమశేఖర్...



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 29:**
మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ వారి ఆధ్వర్యంలో మంగళ ట్యూబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ లో లీగల్ అవేర్నెస్ క్యాంపును ప్యానెల్ అడ్వకేట్ సోమశేఖర్ నిర్వహించి అక్కడ పనిచేస్తున్న కార్మికులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కనీస వేతన చట్టం, పనిప్రదేశాల్లో భద్రత, పని ప్రదేశాల్లో మహిళల లైంగిక వేధింపుల నిరోధక చట్టం పై వివరించారు. ఉచిత న్యాయ సేవా సహాయం పై అవగాహన కల్పించారు. ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్, కంపెనీ కార్మికులు మరియు యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## బసవేశ్వరుడి ఆశయాలు సాధించాలి



**వెలుతురు నారాయణఖేడ్ ఏప్రిల్ 29 .**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కులమత భేదాలు లేని సమాజ స్థాపనకు అవిరామంగా కృషిచేసిన గొప్ప సంఘసంస్కర్త బసవేశ్వరుడు, సామాజిక వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది, వీరశైవ మతస్థాపకుడు మహాత్మా బసవేశ్వర... జయంతి సందర్భంగా వినూత్నంగా రావి ఆకుపై మహాత్మా బసవేశ్వర చిత్రాలతో నారాయణఖేడ్ పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికి మహాత్మా బసవేశ్వర జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి ఆశయాలు సాధించడానికి కోసం అందరు కృషి చేయాలని అన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్

**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 29:**




ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు గతంలో ఇచ్చినట్లుగా వేసవిని దృష్టిలో ఉంచుకొని మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ప్రత్యేకంగా సమ్మర్ అలవెన్స్ చెల్లించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీపరీతమైన ఎండలు కొడుతున్న ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లోకనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారని, మంచినీటి సౌకర్యం, నీడ సౌకర్యం, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ల పంపిణి తో పాటు దూర ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించి కొలుతలు లేకుండా పని కల్పించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి ఉపాధి హామీ పనులు కల్పించడంతో పాటు పనిదినాలను పెంచాలని,కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని రేవంత్ రెడ్డి అధికారం లోకి వచ్చిన తర్వాత గత సంవత్సరం సమ్మర్ అలవెన్స్ చెల్లించలేదని గత సంవత్సరం బకాయిలతో పాటు, వేసవి తీవ్రతను పరిగణలోకి తీసుకొని ఉపాధి కూలీలకు మే నెలలో 30 శాతం, ఏప్రిల్ నెలలో 35 శాతం, మే నెలలో 40 శాతం సమ్మర్ అలవెన్స్ చెల్లించాలని సృజన్ కుమార్ డిమాండ్ చేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి దానికి సంబంధించిన అందరిపై ఏసీబీ దాడులు జరపాలి

- కేవలం గిరిజన బిడ్డ ఈఎన్సీ హరి రామ్ నాయక్ ఇంటిపైనే ఏసీబీ దాడులా ??
- జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 29:**
కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై దానికి సంబంధించినటువంటి అందరి పైన ఏసీబీ దాడులు జరగాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో ఏసీబీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేవలం గజ్వేల్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) గిరిజన బిడ్డ హరినాయక్ పైనే ఏసీబీ దాడులు చేస్తారా ?? ఆ ప్రాజెక్టుకు సంబంధించి అందులో ఇన్వాల్వ్మెంట్ అయినా రాజకీయ నాయకులు మరియు అధికారుల పైన ఏసీబీ దాడులు జరగవా అని ప్రశ్నిస్తున్నాం.కాళేశ్వరం ప్రాజెక్టులో వేలకోట్ల రూపాయల అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చెపుతుంది గానీ తిమింగలాలను వదిలి చేపలను వేటాడినట్లుగా ఉందని అన్నారు.

# బాల్యవివాహ విముక్త్ భారత్ ప్రతిజ్ఞ, పోస్టర్ రిలీజ్





**మునుగోడు వెలుతురు ఏప్రిల్ 29:**

మునుగోడు మండలములోని పలివెల గ్రామంలో ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహలకు వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమము నిర్వహించడం జరిగింది. బాల్యవివాహలు చేస్తే వాటివలన కలిగే అనర్ధాలను, పెళ్లిళ్లు చేసి వాళ్ళ బంగారు భవిషత్తు పాడుచేయకుండా చూడాల్సిన బాధ్యత అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు, అనంతరం బాల్యవివాహ విముక్త్ భారత్ ప్రతిజ్ఞ, పోస్టర్ రిలీజ్ చేయటం జరిగింది. పూజారి శ్రీనివాసులు శర్మ, అశ్రీత కార్యకర్త ధనమ్మ, గ్రామ పంచజాయితీ సెక్రటరీ, ఆశా వర్కర్ - అరుణ, ప్రమీల, పుష్పలత, మహిళా లీడర్ లు, కమ్యూనిటీ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ళ కోసం, అర్హులైన ఇల్లు లేని పేద వారిని గుర్తించండి

- **స్పెషల్ సెక్రెటరి హౌసింగ్ డిపార్టెంట్ శ్రీ వి.పి గౌతమ్ IAS.**



**రంగారెడ్డి వెలుతురు ఏప్రిల్ 29:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు పథకం లో భాగంగా తుక్కుగూడ మునిసిపాలిటిలో తేది. 29. 04. 2025 మంగళవారం రోజున 8వ వార్డ్ మంఖాల్, 10 వ వార్డు తుక్కుగూడలో మరియు మహేశ్వరం మండలంలోని సిరిగిరి పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారుల యొక్క ఎంపిక జరుగుతున్న తీరు మరియు ఇంత వరకు సేకరించిన లబ్ధిదారుల వివరాలు ఇంటిఇంటికి తిరిగి తనిఖీ చేసారు. అదేవిధంగా ఈ సందర్భంగా స్పెషల్ సెక్రెటరి లబ్ధిదారులతో మాట్లాడం జరిగినది. ఇట్టి పరిశీలనలో లబ్ధిదారుల యొక్క కుటుంబ ప్రస్తుత నివాస స్థితిగతులు, వారి ఆర్థిక పరిస్థితులు మరియు లబ్ధిదారుల ఎంపిక వివరాల గురించి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ సెక్రెటరి లబ్ధిదారులతో మాట్లాడుతూ నిజమైన లబ్దిదారులని ఇంటి దగ్గరే అధికారులు వచ్చి వాళ్ళ వివరాలను సేకరించి ఎంపిక చేయడం జరుగుతుందని వ్యక్తం తెలిపారు. అదేవిధంగా అర్హులైన ఇల్లు లేని పేద వారిని గుర్తించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీమతి ప్రతిమ సింగ్ I.A.S (LBS) గారు పాల్గొని మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి ఖచ్చితమైన సర్వే చేసి ప్రభుత్వానికి మరియు జిల్లాకి మంచి పేరు తీసుక రావాలని అధికారులను ఆదేశించారు. ఇట్టి కార్యక్రమలో గౌరవ శ్రీ వి.పి.గౌతమ్ IAS, స్పెషల్ సెక్రెటరి హౌసింగ్ డిపార్ట్మెంట్, అడిషనల్ కలెక్టర్ శ్రీమతి ప్రతిమ సింగ్ IAS (LBS), ధరావత్ చంప్లా నాయక్ ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్-రంగా రెడ్డి జిల్లా, శ్రీమతి A.వాణి కమిషనర్ తుక్కుగూడ మునిసిపాలిటి, T.సైదులు, తాసిల్దారు మహేశ్వరం మండలం, K.శైలజ రెడ్డి, ఎంపీడీఓ మహేశ్వరం మండలం, రామ్ ప్రసాద్ వెరిఫికేషన్ ఆఫీసర్ మరియు మునిసిపల్, మండల సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# రెండు కార్లు ఎదురెదురుగా ఢీ

- **ఒకరు మృతి..పలువురికి గాయాలు**

**భద్రాచలం,ఏప్రిల్29( వెలుతురు):**



రెండు కార్లు ఎదురెదురుగా అతి వేగంతో ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలు కాగా వారిలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..దక్షిణ కొరియా నుండి ఇండియా పర్యటనలో భాగంగా భద్రాచలం పరిసర ప్రాంతాలు సందర్శించేందుకు ముగ్గురు వ్యక్తులు ఒక గైడును వెంట బెట్టు-కొని కారులో భద్రాచలంనకు బయలుదేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆళ్లపల్లి మండలానికి చెందిన వానపాకుల సాంబశివరావు హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ, నాలుగు రోజుల క్రితం బూర్గంపాడు మండలం, వేలేరులోని తమ బంధువుల ఇంట శుభకార్యానికి వచ్చాడు. అనంతరం తన భార్య శ్రీలత, మరదలు సంధ్య లతో కలిసి కారులో హైదరాబాద్ బయలుదేరాడు. అదే సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సరిహద్దు గ్రామమైన వినోభానగర్ సమీపంలో రెండు కార్లు అతివేగంతో ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో రెండు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. రెండు కార్లలో ప్రయాణిస్తున్న ఏడుగురికి గాయాలయ్యాయి. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్‌లు అందించిన సమాచారం మేరకు 108 వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుండి గాయపడిన దక్షిణ కొరియా వాసులు ఖమ్మంలోని సురక్ష హాస్పిటల్‌లో తక్షణ వైద్యం పొందుతుండగా, తీవ్రంగా గాయపడిన వానపాకుల సాంబశివరావు కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# “బాల్య వివాహాల నివారణ స్కోప్ సంస్థ లక్ష్యం


## - డాక్టర్ బండి సాయన్న “



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 29:**

అక్షయ తృతీయ సందర్భంగా బాల్యవివాహాల నివారణకు తెలంగాణలోని మత పెద్దలు, మత విశ్వాస నాయకులు, స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) భాగస్వామ్యం

తెలంగాణలోని సంగారెడ్డి, జనగాం , యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బాల్యవివాహాల నివారణ కోసం వివిధ మతాలకు చెందిన మత పెద్దలు, మత విశ్వాస నాయకులు , స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) కలిసి అవగాహన కార్యక్రమాలను ప్రారంభించారు. రాబోయే పెళ్లిళ్ల కాలంలో, ముఖ్యంగా అక్షయ తృతీయ రోజున, ఒక్క బాల్యవివాహం కూడా జరగకుండా చూడడం ఈ ప్రచార




లక్ష్యం.

ఈ సందర్భంగా, మత పెద్దలు, మత విశ్వాస నాయకులు, స్కోప్ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. “బాల్యవివాహం ఒక తీవ్రమైన నేరం. ఇందులో పాలుపంచుకునే వారెవరైనావివాహాన్ని నిర్వహించే వారు గానీ, సహకారం చేసే వారు గానీచట్టపరంగా శిక్షార్హులవుతారు. జైలు శిక్షలు కూడా విధించబడవచ్చు.”

ఈసారి అక్షయ తృతీయను బాల్యవివాహాల్లేని పండుగగా మార్చేందుకు విశ్వాస నాయకుల ప్రబలమైన మద్దతు కీలకంగా నిలవనుంది. ఇది పిల్లల హక్కులను పరిరక్షించే దిశగా సమాజం చూపుతున్న సంకల్పానికి నిదర్శనంగా నిలుస్తుంది.

స్కోప్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) ఆధ్వర్యంలో నడుపబడుతున్న చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా (సి ఎం ఎఫ్ ఐ) అనే దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా పనిచేస్తోంది. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ఏలియన్స్ అనేది 250 ఎన్ జి ఓ సంస్థల నెట్వర్క్ ,దేశవ్యాప్తంగా 416 జిల్లాల్లో బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తోంది.

అక్షయ తృతీయ పండుగ కొనసాగుతున్న పెళ్లిళ్ల కాలం సందర్భంగా బాల్యవివాహాలను అరికట్టేందుకు చేపట్టిన కీలక ఉద్యమంలో భాగంగా, సంగారెడ్డి , జనగామ , యాదాద్రి భువనగిరి జిల్లాలలోని వివిధ మతాల పెద్దలతో , మత విశ్వాస నాయకులు, స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) భాగస్వామ్యంలో నడుస్తున్న బాల్యవివాహ రహిత భారతం చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా - సి ఎం ఎఫ్ ఐ) ప్రచారానికి మద్దతుగా ముందుకు వచ్చారు. వివిధ మతాల నాయకులు బహిరంగంగా తమ మద్దతు ప్రకటించడంతో, ఈ జిల్లాలోని ఆలయాలు, మసీదులు, చర్చీలు, ఇతర మతస్థలాల్లో ఒక్క బాల్యవివాహం కూడా జరగదు అన్న నమ్మకాన్ని స్కోప్ సంస్థ వ్యక్తం చేసింది.

ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా, బాల్యవివాహాలను అనుమతించబడదన్న స్పష్టమైన సందేశాలతో పోస్టర్లు, బ్యానర్లు పూజా స్థలాల్లో ప్రముఖంగా ప్రదర్శించబడ్డాయి.

జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) మద్దతుతో నడుస్తున్న సి ఎం ఎఫ్ ఐ చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా ), దేశవ్యాప్త ఉద్యమంగా 2030 నాటికి భారతదేశంలో బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు కట్టుబడి ఉంది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు చట్టపరమైన జోక్యాలు, విస్తృత స్థాయిలో ప్రజల్లో అవగాహన, సమాజంలోని సమూహాలను చైతన్యపరిచే చర్యలు చేపట్టబడుతున్నాయి.

జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) అనేది బాలల రక్షణ కోసం ప్రపంచంలో చట్టపరంగ జోక్యం చేసుకునే అతిపెద్ద నెట్వర్క్, బాల్యవివాహ రహిత భారత్ (సి ఎం ఎఫ్ ఐ) ఉద్యమానికి ప్రధాన మద్దతుదారు. గత రెండు సంవత్సరాలలో ఈ ఉద్యమం ద్వారా లక్షలాదిగా అంటే రెండు లక్షలకుపైగా బాల్యవివాహాలు అడ్డుకోబడినాయి. అంతేకాకుండా, ఐదు కోట్లకుపైగా ప్రజలు బాల్యవివాహానికి వ్యతిరేకంగా నిలవాలని ప్రతిజ్ఞ చేశారు. సంగారెడ్డి, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో, సి ఎం ఎఫ్ ఐ, జె ఆర్ సి భాగస్వామిగా ఉన్న స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్), జిల్లా అధికారులు, మత నాయకులు , స్థానిక ప్రజల లతో సన్నిహితంగా పని చేసింది. సకాలంలో చట్టపరమైన జోక్యాలు, కుటుంబాల పరస్పర సలహాలు, విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాల ద్వారా, ఇప్పటి వరకు 3 లక్షలకుపైగా బాల్యవివాహాలను అడ్డుకోవడంలో / నిలిపివేయడంలో వారు విజయవంతమయ్యారు.

అన్ని భాగస్వామి స్వచ్ఛంద సంస్థలు, జె ఆర్ సి స్థాపకుడు భువన్ రిభు రాసిన 2023 పుస్తకం “వెన్ చిల్డ్రన్ హావ్ చిల్డ్రన్: టిప్పింగ్ పాయింట్ టు ఎండ్ చైల్డ్ మ్యారేజ్” లో వివరించిన వ్యూహాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి.




ఈ దిశలో తీసుకుంటున్న చర్యలు, భారత దేశ సుప్రీం కోర్టు ఇటీవల (2024) జారీ చేసిన బాల్యవివాహ నిర్మూలన మార్గదర్శకాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నాయి. మత పెద్దలు , మత విశ్వాస నాయకుల నుండి లభించిన అపారమైన మద్దతుతో ఉత్సాహంతో, సంగారెడ్డి, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాల విషయమై, స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) అధ్యక్షులు & డైరెక్టర్ డా. బండి సాయన్న మాట్లాడుతూ,

“బాల్యవివాహం అనే ఘోర నేరాన్ని అంతమొందించే మా పోరాటంలో ఇది ఒక కీలకమైన ముందడుగు. చట్టాలు ఉన్నా, సమాజంలో విస్తృత అవగాహన లేకపోవడం ప్రధాన సమస్య. ఇంకా ఎంతోమంది బాల్యవివాహం మన దేశంలో నేరమని తెలిసికూడా బాల్య వివాహాలు చేస్తున్నారు. అలాంటి వివాహాలకు హాజరవ్వడం, నిర్వహించడం లేదా ఏవైనా సేవలు అందించడమేనైనా చట్టపరంగా శిక్షార్హం అనే విషయాన్ని వారికి అర్థం కావడం లేదు.



కానీ, పెళ్లిళ్లు వారు లేకుండా జరగలేని స్థాయిలో ఉన్న మత నాయకుల బలమైన మద్దతుతో, ఈ అక్షయ తృతీయ నిజంగా శుభదినంగా నిలుస్తుందని - అంటే, జిల్లాలో ఒక్క బాల్యవివాహం కూడా జరగకుండా చూసేలా చేస్తామని - మేము నమ్ముతున్నాం” అని డైరెక్టర్ డా. బండి సాయన్న గారు చెప్పారు. పురోహితులకు, మత నాయకులకు బాల్యవివాహం అత్యాచారానికి దారితీసే చర్యగా మారుతోందని, ఇది ఏ ఒక్క మతమూ సహించలేని నేరమని స్కోప్ సంస్థ ప్రతినిధులు వివరించారు. వారి మద్దతు లేకుండా ఏ సమాజమూ బాల్యవివాహాన్ని జరిపించజాలదు. ఇప్పుడు మత నాయకులు తమ అప్రతిహతమైన మద్దతు అందిస్తుండటంతో, ఈ ఏడాది అక్షయ తృతీయ రోజున సంగారెడ్డి, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఒక్క బాల్యవివాహం కూడా జరగదనే ధీమాను స్కోప్ సంస్థ ప్రతినిధులు వ్యక్తం చేశారు.




# చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది

చర్యలపై దిశానిర్దేశం చేస్తూ.. కీలక సూచనలు చేశారు.. చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.. రెడ్ బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో అమలవుతోంది.. చంద్రబాబు చేస్తున్న విధ్వంసం అంతా ఇంతాకాదు.. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్నిరంగాల్లోనూ విధ్వంసమే.. విచ్చలవిడిగా అవినీతి జరుగుతోంది.. మద్దతు ధరలు దొరక్క రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వివిధ జిల్లాల్లో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు గుప్పించారు.. అయితే, రైతుల తరఫున పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది.. ఆ మేరకు జిల్లాల్లో రైతులకు అండగా ఉండాలి.. రైతుల డిమాండ్లపై పోరాటం చేయాలి. వీటిని ప్రజల్లోకి బాగా తీసుకువెళ్లాలి అని సూచించారు.. సాధారణంగా రెండు, మూడు సంవత్సరాలు అయితే కానీ.. ప్రభుత్వంపై వ్యతిరేకత బయటకు కనిపించదు.. కానీ, ఏడాదిలోపే కూటమి ప్రభుత్వంమీద వ్యతిరేకత తీవ్రంగా వచ్చిందన్నారు వైఎస్ జగన్.. అందుకే యుద్ధ ప్రాతిపదికన కమిటీ-నిర్మాణం పూర్తిచేయాలి.. దీని తర్వాత పార్టీ పరంగా మీకూ, నాకూ పూర్తిగా పని ఉంటు-ంది. అందరం కలిసికట్టు-గా పార్టీపరంగా కార్యక్రమాలు బలంగా ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.. జిల్లాలో పార్టీ ఓనర్‌షిప్ మీది.. ప్రజా సంబంధిత అంశాల్లో ఒకరి ఆదేశాల కోసం మీరు ఎదురు చూడొద్దు.. మీకు మీరుగా స్వచ్ఛందంగా కదలాలని స్పష్టం చేశారు.. నియోజకవర్గ ఇన్‌ఛార్జితో కలిసి మొదట కదలాల్సిందే మీరే.. ప్రజలకు అండగా మీరు చేస్తున్న కార్యక్రమాల వల్ల అది రాష్ట్రస్థాయి దృష్టిని ఆకర్షిస్తుంది. దీని ద్వారానే మీ పనితీరు బయటపడుతోందన్నారు జగన్.. ఇక, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ మన్ననలు పొందాల్సిన బాధ్యత మీదన్నారు జగన్.. సమాజంలో గొంతులేని వారికి బాసటగా నిలిచేది వైసీపీయే.. ప్రతి సమస్యలోనూ బాధితులకు తోడుగా నిలిచేది వైసీపీయేనన్న జగన్.. మే నెలలోపు మండల కమిటీ-లు పూర్తిచేయాలి.. జూన్-జులైల్లో గ్రామస్థాయి, మున్సిపాల్టీలల్లో డివిజన్ కమిటీ-లు పూర్తిచేయాలి.. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో బూత్ కమిటీ-లు ఏర్పాటు- కావాలి.. జిల్లా స్థాయి నుంచి పార్టీని గ్రామస్థాయి వరకూ తీసుకువెళ్లే బాధ్యతల్లో మీరు ఉన్నారని తెలిపారు.. పార్టీ వ్యవస్థీకృతంగా ముందుకు సాగాలి... జిల్లా అధ్యక్షుల పాత్ర పార్టీలో చాలా కీలకమైనదని.. మీమీ జిల్లాల్లో పార్టీ మీద మీకు పట్టు- ఉండాలన్నారు.. పార్టీ బలోపేతం కోసం గట్టిగా కృషిగా చేయాలి. బాధ్యతల నుంచే అధికారం వస్తుంది. జిల్లాల్లో మీరే సర్వం.. మీరే పార్టీ.. పార్టీయే మీరు. జిల్లాల్లో అన్నిస్థానాల్లో గెలిపించాల్సిన బాధ్యత మీదే.. అదే తలంపుతో పార్టీని నడపాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో గెలిపించే బాధ్యత మీది.. అది మీ ప్రధాన బాధ్యత.. దీనికోసం ఏం చేయాలన్నదానిపై మీరు గట్టిగా పనిచేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ ప్రతి కమిటీ బలంగా ఉండాలి. ఏదైనా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పనితీరు బాగోలేకపోతే పిలిచి చెప్పగలగాలి. అప్పటికీ పనితీరు బాగోలేకపోతే ప్రత్యామ్నాయం చూడ్డంలో మీ భాగస్వామ్యం కీలకం అన్నారు.. పార్టీలో ఇద్దరి మధ్య వివాదం ఉన్నప్పుడు పిలిచి సమన్వయం చేయాల్సిన బాధ్యత మీది. మీ పరిధిలో 7కు ఏడు గెలిపించాల్సిన బాధ్యత మీది. బాధ్యత, అధికారం రెండూ తీసుకోండి. మీరు సమర్థులని భావించి, మీకు ఈ బాధ్యతలు అప్పగించడం జరిగింది. అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమన్వయం చేయడం, జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ కమిటీ- నిర్మాణం మీ ప్రధాన బాధ్యత. అలాగే ప్రజా సంబంధిత అంశాల్లో చురుగ్గా ఉండాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మన నాయకత్వ ప్రతిభ బయటపడుతుంది. భారీ లక్ష్యం ఉన్నప్పుడే బ్యాట్స్‌మన్ ప్రతిభ బయటపడుతుంది. అప్పుడే ఆ బ్యాట్స్‌మెన్ ప్రజలకు ఇష్టుడు అవుతాడు. ఇదికూడా అంతే. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మనం చేసే పనులవల్ల మనం ఎలివేట్ అవుతాం. ప్రజల దగ్గర, పార్టీలోనూ గౌరవం పెరుగుతుంది. ఇమేజీ పెరుగుతుంది. మన పనితీరు వల్లే మనం మన్ననలను పొందగలుగుతామని కీలక సూచనలు చేశారు.

## కాంగ్రెస్‌పై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు సరికాదు

- చరిత్ర తెలుసుకుని మాట్లాడాలన్న ఎంపి చామల



**హైదరాబాద్,ఏప్రిల్29( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నాయకులు పాక్ పై ప్రేమ ఉంటే అక్కడికే వెళ్లండి అంటూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై చామల కిరణ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎంపీ చామల మాట్లాడుతూ.. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి 140 సంవత్సరాల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దీనిని ప్రజలు గమనించాలని కోరారు. ప్రజలు ఉప ముఖ్యమంత్రిని చేసినపుడు నాయకుడు అనేవాడు ఆలోచించి మాట్లాడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ, భారతదేశాన్ని కాపాడే పార్టీ. నరేంద్ర మోడీని ప్రసన్నం చేసుకోవాలి అనుకుంటే,భారత ప్రధానమంత్రి నివాసం) లో డ్యాన్స్ వేసుకుంటూ కూర్చోవాలి. లేకుంటే రాజకీయాలు మానేసి, రెండు సినిమాలు తీసి నరేంద్ర మోడీని ప్రసన్నం చేసుకోవాలని ఎద్దేవ చేశారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడి మా మనోభావాలు, ప్రజల, కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడవద్దు. మీ నాయకుని లెక్క కుల మతాల మధ్య చిచ్చు పెట్టట్లేదని అన్నారు. నిజంగా నిలదీయాలి అంటే మీ నాయకుడినే నిలదీయాలని ఎంపి అన్నారు. నలుగురు వచ్చి కాల్చిపోతే మీరు పిట్ట కథలు చెప్పుకుంటూ తిరుగుతున్నారు. పవన్ కళ్యాణ్ అడగవలసింది.. నలుగురు ముష్కరులు 28 మందిని చంపితే వారం రోజుల నుంచి అరెస్టు చేయకుండా ఎవరి వైఫల్యం జరిగిందో అడగాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యమా? ఇంటెలిజెన్స్ వైఫల్యమా? కాశ్మీర్‌లో 370 లేకుండా చేసి ప్రశాంత వాతావరణం తీసుకొచ్చిన అని చెప్పిన నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పేలుడు

- ముగ్గురు కార్మికుల దుర్మరణం

**యాదాద్రి భువనగిరి,ఏప్రిల్29( వెలుతురు):**
జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. మోటకొండూరు మండలం కాటేపల్లి వద్ద ఉన్న ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి భవనం కుప్పకూలిపోయింది. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనస్థలానికి చేరుకొని అక్కడకు చేరుకొని పరిశీలిస్తున్నారు. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మోటకొండూరు మండలంలోని ప్రీమియర్ ఎక్స్ ఎ÷–లోజివ్ కంపెనీలో పేలుడు సంభవించింది. పేలుడు ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పేలుడు ధాటికి భవనం కుప్పకూలిపోయింది. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న నలుగురు కార్మికులు గాయపడ్డారు. మరో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు.. ఘటనా స్థలంలో ఇద్దరు మృతి చెందారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. శిథిలాల కింద ఇద్దరి మృతదేహాలు ఉన్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జేసీబీ సహాయంతో శిథిలాల్లో చిక్కుకున్న వారికోసం గాలింపు చేపట్టారు. కార్మికుల మృతితో గ్రామస్తులు కంపెనీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ లోపలికి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి.

## బిజెపి, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు

- కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికలో అవినీతి ప్రస్తావన లేదు
- ఉత్తమ్ వ్యాఖ్యలను ఖండించిన మాజీమంత్రి హరీష రావు

**హైదరాబాద్,ఏప్రిల్29( వెలుతురు):**



కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక మీద నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ మాట్లాడినవన్నీ అబద్ధాలేనని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదన్నారు. రాష్ట్రమంతటా బీఆర్ఎస్ రజతోత్సవ సభ, కేసీఆర్ ప్రసంగంపై చర్చ జరుగుతోందనే అక్కసుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్డీఎస్ఏ ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగామారిందని హరీశ్‌రావు ఆక్షేపించారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై హరీశ్‌రావు స్పందించారు. ఈ సందర్భంగా పలువురు నేతలతో కలిసి ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలకు డీపీఆర్ ఉందా? డీపీఆర్ లేకుండానే కొడంగల్ ఎత్తిపోతల పనులు ప్రారంభించారు. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ కొట్టు–కుపోతే ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడలేదు? పోలవరానికి ఎందుకు పోలేదు? ఎందుకు నివేదిక ఇవ్వలేదు? ఎన్డీఎస్ఏ అనేది ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారింది. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు.

## ప్రధాని నివాసంలో మరోమారు అత్యున్నత సమావేశం

- హాజరైన రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ,ఏప్రిల్29( వెలుతురు):**
జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గతవారంలో 26 మంది టూరిస్టులను పొట్టనపెట్టుకున్న ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సాయంత్రం తన నివాసంలో అత్యున్నత స్థాయి భద్రతా సమావేశం నిర్వహించారు. పరిస్థితిని సమీక్షించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. త్రివిధ దళాధి పతులు జనరల్ ఉపేంద్ర ద్వివేది (ఆర్మీ), అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి (నేవీ), అమర్ ప్రీత్ సింగ్ (ఎయిర్‌ఫోర్స్) సైతం హాజరయ్యారు. జాతీయ భద్రతాంశాలపై విధాన నిర్ణయాలు తీసుకునే కేబినెట్ భద్రతా వ్యవహారాల కమిటీ–బుధవారంనాడు కీలక సమావేశం జరుపనుంది. దీనికి ప్రధానమంత్రి అధ్యక్షత వహించనున్నారు. ఈ కీలక సమావేశానికి ముందుగానే మోదీ నివాసంలో త్రివిధ దళాధిపతులు, అజిత్ దోవల్ తదితరులు మంగళవారం సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితిపై ప్రధానమంత్రికి సోమవారంనాడు సుమారు 40 నిమిషాల పాటు– రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రధానమంత్రికి వివరించారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తీసుకుంటు–న్న చర్యలు, భద్రతపై సమీక్షించేందుకు హోం మంత్రిత్వ శాఖకార్యాలయంలో మంగళవారం సాయంత్రం అత్యున్నత స్థాయి భద్రతా సమావేశం నిర్వహించారు. దీనికి హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షత వహించారు.

# తోణమే ఆపరేషన్ కాగర్ నిలిపివేయాలి

- ఆదివాసీల ప్రయోజనాలకు విఘాతం కలిగించొద్దు
- మంత్రి సీతక్క వెల్లడి



**వరంగల్,ఏప్రిల్29( వెలుతురు):**
ఆదివాసీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలన్నారు. మావోయిస్టు పార్టీలను సమూలంగా అంతమొందించడమే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌పై మంత్రి సీతక్క స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ, చత్తీస్‌గడ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలని అన్నారు. మధ్యభారతంలోని ఆదివాసి ప్రాంతాలు రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయని తెలిపారు. అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక హక్కులుంటాయన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. అందుకే ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి వారి శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలని సూచించారు. బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని ఆదివాసి బిడ్డగా కోరుకుంటు–న్నానని తెలిపారు. ఆదివాసీల హక్కులను ఎవరూ కాలరాయవద్దన్నారు. ఆ జాతి బిడ్డగా ఆదివాసులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు తీవ్ర భయాందోళనతో ఉన్నారన్నారు. మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరారు. రెండు వైపుల ప్రాణ నష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపుతాయని అన్నారు. కాగా.. మంత్రి సీతక్కను పీఎస్ కమిటీ– బృందం కలిసింది. కాగా.. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలపై ఎనిమిదవ రోజు భద్రతా బలగాల కుంబింగ్ కొనసాగుతోంది. హెలికాప్టర్ ద్వారా కర్రెగుట్టలపైకి భారీగా బలగాలు చేరుకుంటున్నాయి.

కర్రెగుట్టలపై తాత్కాలిక బేస్ క్యాంపు ఏర్పాటు–చేస్తున్నట్లు– సమాచారం. బేస్ క్యాంప్ కోసమే బలగాలు, ఆయుధ సామాగ్రిని హెలికాప్టర్ ద్వారా భద్రతా బలగాలు తరలిస్తున్నాయి. ఆపరేషన్ కర్రెగుట్టలపై కేంద్రం ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. ఛత్తీస్‌గఢ్, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో కేంద్ర బలగాలు, ఛత్తీస్‌గఢ్ బలగాలు గత వారం రోజులుగా కూంబింగ్ కొనసాగుతోంది. ఆపరేషన్ కర్రెగుట్టలు నిలిపివేయాలని ఓ వైపు ప్రజాసంఘాలు, పౌరహక్కుల నేతలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి. అటు– మావోయిస్టులు కూడా ఇప్పటికే మూడు నాలుగు సార్లు లేఖలు రాసినప్పటికీ కేంద్రం మాత్రం వెనక్కి తగ్గడం లేదు.

అంతేకాకుండా కర్రెగుట్టలపై బేస్ క్యాంప్‌ను ఏర్పాటు– చేస్తున్నట్లు– తెలుస్తోంది. ఈరోజు ఒక్కరోజే వెంకటాపురం సీఆర్పీఎఫ్ క్యాంపు నుంచి కర్రెగుట్టలపైకి రెండు హెలికాప్టర్లు నాలుగు సార్లు అక్కడకు వెళ్లి బలగాలు, మందుగుండు సామాగ్రిని తరలించాయి. ఇటీ–వల వడదెబ్బ కారణంగా 40 మంది జవాన్లు వెనక్కి వచ్చినప్పటికీ రెట్టింపు సంఖ్యలో బలగాలను చేరవేస్తూ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

# హైదరాబాద్‌ను వీడిన నలుగురు పాక్ జాతీయులు

- దుబాయ్ మీదుగా పాక్ పకు పయనం



**హైదరాబాద్,ఏప్రిల్29( వెలుతురు):**
పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ వాసుల వీసాలు రద్దు చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకోవడంతో పాటు, వారు వెంటనే దేశం విడిచి వెళ్లాలని ఆదేశించడంతో హైదరాబాద్‌లో ఉన్నవారు తిరుగు ప్రయాణం కట్టారు. భారత్‌లో ఉన్న పాకిస్థాన్ పౌరులు దేశాన్ని విడిచి వెళ్లేందుకు మంగళవారం చివరి రోజు కావడంతో పాకిస్థానీలు దేశం విడిచి హుటాహుటిన తమ దేశానికి పయనమయ్యారు. అలాగే హైదరాబాద్‌లో ఉన్న పాకిస్థాన్ వాసులను గుర్తించిన పోలీసులు.. వారు వెంటనే నగరం విడిచి పెట్టిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పాకిస్థానీలు హైదరాబాద్‌ను వీడుతున్నారు. తాజాగా నలుగురు పాకిస్థానీలు హైదరాబాద్‌ను వీడి పాకిస్థాన్‌కు వెళ్లిపోయారు. ఆ నలుగురిలో ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు, మరో బాలుడు ఉన్నారు. వీరంతా కూడా శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుబాయ్ మీదగా పాకిస్థాన్‌కు వెళ్లిపోయారు. నలుగురు పాకిస్తానీలు ఆదివారమే హైదరాబాద్ నుంచి వెళ్ళిపోయారు. తెలంగాణలో మరికొంత పాకిస్తానీలకు సంబంధించిన డాక్యుమెంట్లను పోలీసులు వెరిఫై చేస్తున్నారు. పాకిస్థానీలకు గడువు ముగింపు ఉండటంతో నిన్నటి వరకు నలుగురు పాకిస్థానీలు వెళ్ళిపోయినట్టు–అధికారులు చెబుతున్నారు. కాగా.. కేంద్రం ఆదేశాలతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ మూడు కమిషనరేట్‌లో మొత్తం 213 మంది పాకిస్థానీలు ఉన్నట్లు– పోలీసులు గుర్తించారు. అయితే వీరిలో నలుగురు షార్ట్ టర్మ్ వీసాపై ఉన్నారని, మిగిలిన వారందరికీ లాంగ్ టర్మ్ వీసాలు కలిగి ఉన్నట్లు– తెలుస్తోంది. అయితే లాంగ్ టర్మ్ వీసాలు కలిగిన పాకిస్తానీలకు కేంద్రం మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో షార్ట్ టర్మ్ వీసా ఉన్న నలుగురు పాకిస్థానీలను దేశం విడిచి వెళ్లాల్సిందిగా హైదరాబాద్ పోలీసులు నోటీ–సులు జారీ చేశారు. గడువులోపు దేశం విడిచి వెళ్లని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరికాలు జారీ చేశారు. ఈ క్రమంలో నలుగురు పాకిస్థానీలు దేశం విడిచి వెళ్లిపోయారు. అయితే పాకిస్థాన్ పౌరులు దేశం విడిచి వెళ్లేందుకు ఏప్రిల్ 29 వరకు కేంద్ర ప్రభుత్వం డెడ్‌లైన్ విధించిన విషయం తెలిసిందే. మెడికల్ పరంగా వచ్చిన వారికి కూడా ఈరోజు వరకు గడువు విధించారు. కేంద్రం ఆదేశాల నేపథ్యంలో దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అలర్ట్ అయి.. పాకిస్థానీలను గుర్తించి వారిని దేశం విడిచి వెళ్లాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. దీంతో నేటితో గడువు ముగియనుండటంతో ఇప్పటికే అనేక మంది పాకిస్థానీలు తమ దేశానికి తిరుగుముఖం పట్టారు.

# రాజ్యసభకు పాకా నామినేషన్ దాఖలు

- చంద్రబాబుతో బిజెపి నేతల మర్యాదపూర్వకభేటీ



**అమరావతి,ఏప్రిల్29( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ నేత పాకా వెంకట సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు.. ఏపీ శాసనసభ ప్రాంగణంలో రిటర్నింగ్ అధికారి వనితారాణికి తమ నామినేషన్ పత్రాలను అందించారు. నామినేషన్ పత్రాల దాఖలు కార్యక్రమంలో కేంద్ర పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు.. తదితర ఇతర నేతలు పాల్గొన్నారు.. నామినేషన్ వేసిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కూటమి రాజ్యసభ అభ్యర్థి పాకా సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు... బీజేపీతో తనకు ఉన్న అనుబంధాన్ని సీఎంకు వివరించారు.. కొద్దిసేపు తాజా రాజకీయ పరిణామాలపై వీరి మధ్య చర్చ జరిగింది.. ఈ సమావేశంలో, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస వర్మ ఇతర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.. రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయిరెడ్డి రాజీనామా చేయడంతో.. ఏపీ నుంచి రాజ్యసభకు ఖాళీ ఏర్పడింది.. ఈ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇవాల్టితో నామినేషన్ దాఖలు గడువు ముగియనుంది.. ఇక, టీ–డీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి రాజ్యసభ బరిలో నిలిచేది ఎవరు? అనే చర్చ సాగుతోన్న తరుణంలో.. టీ–డీపీ–జనసేన.. బీజేపీకి ఆ స్థానాన్ని వదిలేసింది.. దీంతో.. పార్టీతో సుదీర్ఘ కాలం పనిచేస్తూ వస్తున్న పాకా వెంకట సత్యనారాయణను బీజేపీ తమ అభ్యర్థిగా ప్రకటించడం.. ఈ రోజు నామినేషన్ వేయడం జరిగిపోయాయి.. 1980 నుండి నేటి వరకు భారతీయ జనతా పార్టీ క్రియాశీల కార్యకర్తగా, పట్టణ ప్రధాన కార్యదర్శిగా, పట్టణ,జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనేక బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి, భీమవరం మునిసిపల్ కౌన్సిలర్‌గా ప్రజల మన్ననలు పొంది, ఓబీసీ సంఘాల నాయకుడిగా బీసీ వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటు–పడుతూ, రాజ్యసభ ఉప ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన పాక వెంకట సత్యనారాయణ ఎన్నిక లాంఛనమే కానుంది.

# నేడు విజయవాడకు సిఎం రేవంత్

- దేవినేని ఉమ తనయుడి వివాహానికి హాజరు
- పెళ్లిలో చంద్రబాబును కలుసుకునే ఛాన్స్

**హైదరాబాద్,ఏప్రిల్29( వెలుతురు):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బుధవారం విజయవాడ వెళ్లనున్నారు.. బెజవాడలో జరగనున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు వివాహానికి హాజరు కాబోతున్నారు రేవంత్ రెడ్డి.. ఇక, విజయవాడ పర్యటన కోసం ఉదయం 9.15 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరి వెళ్లనున్నారు.. ఉదయం 10.40 గంటలకు కానూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణానికి చేరుకుంటారు.. ఉదయం 10.50 గంటల నుండి 11.30 గంటల వరకు అయన కల్యాణ మండపం నందు.. దేవినేని ఉమా కుమారుడు వివాహానికి హాజరై.. వధూవరులను ఆశీర్వదించనున్నారు.. విజయవాడ నుంచి తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు సీఎం రేవంత్ రెడ్డి.. కాగా, గత వారం



హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు.. తన కుమారుడు వివాహానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను సీఎంకు అందించి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానించారు.. మరోవైపు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సుదీర్ఘకాలం తెలుగుదేశం పార్టీలో పనిచేసిన రేవంత్ రెడ్డి.. దేవినేని ఉమాతో సన్నిహితంగా ఉండేవారు.. ఆ తర్వాత పార్టీ మారి.. తెలంగాణ సీఎం అయినా.. వారి మధ్య స్నేహ బంధం కొనసాగుతోంది.. దీంతో, మిత్రుడి ఆహ్వానం మేరకు ఆయన కుమారుడి వివాహానికి హాజరుకాబోతున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ఇక, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ఈ వివాహానికి హాజరు అయ్యే అవకాశం ఉండడంతో.. పెళ్లి వేడుకలో రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు కలుసుకునే అవకాశం లేకపోలేదు.

# ఉక్రెయిన్ తో యుద్ధానికి బ్రేక్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 29, ( వెలుతురు)

రష్యా ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఉక్రెయిన్‌పై మూడు రోజుల పాటు యుద్ధం ఆపివేస్తున్నట్టు ప్రకటించాడు. మే8 నుంచి మే11 వరకూ సీజ్ ఫైర్ ప్రకటించాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్ నాజీ జర్మనీపై సాధించిన విజయానికి 80వ వార్షికోత్సవం సందర్భంగా పుతిన్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నాడు.దాదాపు మూడేళ్ల నుంచి ఉక్రెయిన్ రష్యా మధ్య ఈ యుద్ధం కొనసాగుతోంది. ఈ యుద్ధంలో ఇప్పటికే వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు చాలా దేశాల అధ్యక్షులు ప్రయత్నిస్తున్నప్పటికీ యుద్ధం మాత్రం ఆగడంలేదు. ఇలాంటి యుద్ధంలో పుతిన్ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు సంచలనంగా మారింది.

# ఉగ్రవాదులకు 10 మంది కశ్మీర్ లు సాయం



శ్రీనగర్, ఏప్రిల్ 29, ( వెలుతురు)

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఉగ్రదాడికి తెగబడ్డ ఉగ్రవాదులు.. పర్యాటకులను వారి మతం అడిగి మరీ కాల్చిచంపారు. అయితే.. ఈ ఘటనపై విచారణకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ)ను ఆదేశించింది. అయితే తాజాగా ఉగ్రవాద దాడిపై జరిపిన దర్యాప్తులో దాడి జరిగిన సమయంలో 10 మందికి పైగా కశ్మీరీ ఓవర్ గ్రౌండ్ వర్కర్‌లు దాడి చేసిన వారితో ప్రత్యక్ష సంబంధంలో ఉన్నారని తేలింది. ఈ OGWలు చాట్ చేయడానికి, ఉగ్రవాదులలో సమన్వయం చేయడానికి ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ అప్లికేషన్‌లను ఉపయోగించి, ఉగ్రవాదులతో రియల్ టైమ్ కమ్యూనికేషన్‌ను కొనసాగించినట్లు సమాచారం. ఏప్రిల్ 23 నుండి పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన ప్రదేశంలో ఉన్న జాతీయ దర్యాప్తు సంస్థ బృందాలు ఆధారాల కోసం అన్వేషణను ముమ్మరం చేశాయి. ఉగ్రవాద నిరోధక సంస్థకు చెందిన IG, DIG, SP నేతృత్వంలోని బృందాలు ఏప్రిల్ 22న జరిగిన దాడిని గమనించిన ప్రత్యక్ష సాక్షులను ఇప్పటికే ప్రశ్నించాయిఉగ్రవాదుల కార్యనిర్వహణ విధానాల ఆధారాల కోసం దర్యాప్తు చేస్తున్న NIA బృందాలు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను నిశితంగా పరిశీలిస్తున్నాయి. దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ భయంకరమైన దాడి వెనుక ఉన్న ఉగ్రవాద కుట్రను వెలికితీసేందుకు ఆధారాల కోసం ఫోరెన్సిక్, ఇతర నిపుణులు మొత్తం ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అలాగే, పహల్గామ్‌లో జరిగిన దాడి తర్వాత ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి భారత సైన్యం అనేక శోధన కార్యకలాపాలను ప్రారంభించి, అప్రమత్తంగా ఉంది.

# సైన్యం పేరుతో సైబర్ నేరగాళ్ల టోపి



హైదరాబాద్, ఏప్రిల్ 29, ( వెలుతురు)

సైబర్ మోసగాళ్లకు అన్నీ అవకాశాలే. ఏ సందర్భం వచ్చినా బ్యాంక్ ఖాతాలు ఇచ్చి డబ్బులు జమ చేయమని ఫోర్స్ చేస్తూ ఉంటారు. ఇప్పుడు భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులను అలాగే క్యాష్ చేసుకోవాలని అనుకుంటున్నారు. ఇందు కోసం వాట్సాప్ ను వినియోగించుకుంటున్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత భారతదేశం , పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని వాట్సాప్‌లో ఒక సందేశం వైరల్ అవుతోంది. కేంద్ర ప్రభుత్వం భారత సైన్యం కోసం బ్యాంకు ఖాతాను తెరిచిందని, సైన్యానికి సహాయం చేయడానికి ప్రజల నుండి ఆర్థిక సహాయం కోరిందని ఆ వాట్సాప్ సందేశం సారాంశం. ఫేస్‌బుక్, వాట్సాప్ ,మఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్ అవుతున్న సందేశంలో కనీసం ఒక్క రూపాయి అయినా జమ చేసి దేశభక్తిని చాటుకోవాలని సూచిస్తోంది. ఈ డబ్బుతో ఆయుధాలు కూడా కొనుగోలు చేస్తామని అందులో పేర్కొన్నారు. ఈ అంశం కేంద్రం దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించింది. అది సైబర్ నేరగాళ్ల కుట్ర అని.. మొత్తం ఫేక్ అని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ప్రకటించింది. PIB తన అధికారిక వెబ్‌సైట్ ద్వారా వైరల్ పోస్టుల గురించి ఖండించింది. వాట్సాప్‌లో తప్పుదారి పట్టించే సందేశం వైరల్ అవుతోందని, అందులో భారత సైన్యాన్ని ఆధునీకరించడం, యుద్ధంలో గాయపడిన లేదా అమరవీరులైన సైనికుల కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతాలో ఆర్థిక విరాళాలు ఇవ్వడం గురించి చర్చ జరుగుతోందని పిఐబి తెలిపింది. అలాంటి పోస్టులను నమ్మవద్దని తెలిపింది. నటుడు అక్షయ్ కుమార్ పేరు కూడా ఈ వాట్సాప్ మెసెజ్‌లో ఉపయోగించారు. ఈ ప్రతిపాదనకు అక్షయ్ కుమార్ ప్రధాన ప్రమోటర్‌గా ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారని.. అది కూడా పచ్చి అబద్ధమని స్పష్టం చేసింది. తెలంగాణ పోలీసులు కూడా ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రకటన చేశారు.ద

# రాయలసీమ ఎక్స్ప్రెస్లో భారీ దోపిడీ

అనంతపురం, ఏప్రిల్ 29, ( వెలుతురు)

నిజామాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న రాయలసీమ ఎక్స్ప్రెస్లో భారీ దోపిడీ జరిగింది. అనంతపురం జిల్లాలోని గుత్తి వద్ద మంగళవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అమరావతి ఎక్స్ప్రెస్కు లైన్ క్లియర్ చేసేందుకు గుత్తి శివారులో రాయలసీమ ఎక్స్ప్రెస్ను నిలిపారు. అప్పటికే అక్కడ మాటువేసిన ఐదుగురు దుండగులు రైలులోకి చొరబడ్డారు. మొత్తం పది బోగీల్లో దోపిడీకి పాల్పడ్డారు. ప్రయాణికుల బంగారం, నగదుతోపాటు విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితులు తిరుపతి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# బీజేపీతో బీఆర్ ఎస్ పోత్తా...

- మోడీని పల్లెత్తుమాట అనని గులాబీ బాస్
- సభ సక్సెస్సా.. ఫెయిలా..



వరంగల్, ఏప్రిల్ 29, ( వెలుతురు)

వెనకటికి ఎవడో కొండంత రాగం తీసి అదేదో పాట పాడాడంట. బి ఆర్ ఎస్ వరంగల్ రజతోత్సవ సభ చూస్తే అలాగే అనిపించింది. టిఆర్ఎస్ పాతికేళ్ల పండగ పేరిట రేవంత్ సర్కార్ మీద యుద్ధం ప్రకటించే వేదిక గా కెసిఆర్ కుటుంబం చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. చివరికి సభకు వచ్చిన జనం. కెసిఆర్ స్పీచ్ చూశాక 200 కోట్లు బొందలో పోశారు కదరా అని మాట్లాడుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతని క్యాష్ చేసుకోవడానికి 200 కోట్లు ఖర్చుపెట్టి సిల్వర్ జూబ్లీ సభ చేస్తే. వచ్చిన జనం లక్షన్నర దాటలేదు. జనం రాకపోతే పాయె కెసిఆర్ సార్ స్పీచ్ ఇరగదీస్తాడేమో అనుకుంటే పాడిందే పాట పాచిపల్ల దాసరి లాగా చెప్పిందే చెప్పి బోర్ కొట్టిచ్చాడు కేసీఆర్.రాబోయే రోజుల్లో బిజెపితో మాకు సంబంధాలు ఉంటాయి అని చెప్పడానికి అనుకుంటా ఒక్కచోట తప్ప మోడీని పల్లెత్తు మాట అనలేదు. బిజెపిని ఎక్కడ విమర్శించలేదు. ఈ విషయంలో కేసీఆర్ ముందుచూపునీ కచ్చితంగా మెచ్చుకోవాలి. ఏతవాతా కెసిఆర్ స్పీచ్ మాత్రం అట్టర్ ఫ్లాప్. ఈ ఒక్క విషయంలో కాంగ్రెస్ వాళ్ళు సంతోషించవచ్చు. వరంగల్ రజతోత్సవ సభకి పాతిక లక్షలు జనం వస్తారని బి ఆర్ ఎస్ అంచనా వేసింది. కాంగ్రెస్ పై ఉన్న వ్యతిరేకత మొత్తం సభలో కనిపించవచ్చని చాలా ఆశలు పెట్టుకుంది. బ్లాక్ అండ్ వైట్ కలిపి ఈ సభ కోసం 200 కోట్లు రూపాయలు ఖర్చుపెట్టి ఉంటారని ఒక అంచనా. పార్టీ సొమ్ము కాకుండా ప్రతి జిల్లాస్థాయి లీడర్ కి, ఎమ్మెల్యే కి టార్గెట్ పెట్టారు. దేశంలోనే అత్యధికంగా పార్టీ అకౌంట్లో 1450 కోట్లు ఉన్న బి ఆర్ఎస్ పార్టీ ఈ మీటింగ్ కోసం 30 కోట్లు అధికారికంగా చెల్లించింది.ఇది దేశంలోనే అతిపెద్ద బహిరంగ సభ కానుందని ఊదరగొట్టారు బిఆర్ఎస్ నేతలు. రైతుల దగ్గర రిలీజ్ తీసుకున్న 1200 ఎకరాల్లో చదును చేయడం ,బారికేడ్లు, రోడ్లు వేయడం, స్టేజి ,గెస్ట్ ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ..వీటి కోసమే 25 కోట్లు ఖర్చు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 500 మంది ఆర్టిస్టులతో వాల్ రైటింగ్ ,గులాబీ జెండాలు ,ఫ్లెక్సీలు ,హోర్డింగులు, పేపర్లు ,టీవీలో ప్రకటనలు దీనికోసం మరో 25 కోట్లు ఖర్చు పెట్టారు. ఇక జన సమీకరణం కోసం అయితే ఆర్టీసీ కే 9 కోట్లు చెల్లించారు. ప్రైవేట్ వాహనాలు ప్రయాణం మధ్యలో వారికి భోజనాలు ,మందు షరా మామూలే. వీటన్నిటికీ మరో పాతిక కోట్లు ఖర్చు అయినట్లు సమాచారం. ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి జనం దగ్గర కొట్టేసిన సొమ్ము జనానికి ఖర్చు పెట్టడంలో కెసిఆర్ ఏ మాత్రం వెనకడుగు వేయరని మరోసారి నిరూపించారు. బస్సుల్లో టిఆర్ఎస్ కార్యకర్తలు మందు బాటిల్స్ తాగుతూ విలాసంగా నినాదాలు చేస్తుంటే. ఇది కదా గులాబీ పార్టీ హవా అనిపించింది. ఇదంతా బానే ఉంది. ఇన్ని వందల కోట్లు ఖర్చుపెట్టి రెండు నెలలు హంగామా చేస్తే మొత్తం వచ్చిన జనం లక్షన్నర. వేసిన కుర్చీలు 75 వేలు. నిలబడిన వాళ్లు మరో 75 వేలు. సరే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంది రాలేకపోయారు చాలామంది జనం అని అనుకుంటే వాళ్లు 50 వేలు ఉంటారు అనుకున్నా మొత్తం కలిసి కూడా రెండు లక్షలు నిండలేదు. మనిషికి 500 ఇచ్చి, బిర్యానీ ప్యాకెట్లు, మందు బాటిల్స్ ఇన్ని సప్లై చేసినా కూడా జనాన్ని తీసుకురావడం కష్టం అయిపోయింది. ప్రతి బి ఆర్ఎస్ నాయకుడికి టార్గెట్లు పెట్టిన ఒకరిద్దరు మినహా మిగిలిన వాళ్ళు ఎవరు టార్గెట్ రీచ్ కాలేకపోయారు. ఈ మాత్రం దాని కోసమా రెండు నెలల నుంచి 200 కోట్లు ఖర్చుపెట్టి ఇంత హంగామా చేసింది అని అనిపించింది బి ఆర్ ఎస్ సభ చివరికిఇక కెసిఆర్ స్పీచ్ విషయానికొస్తే. అంతఅన్నాడు ఇంత అన్నాడు గంగరాజు అయినాక వగ్గిస్తాడే గంగరాజు అన్నట్లు అసలు కెసిఆర్ వస్తే భూకంపం పుట్టిస్తాడు అన్నట్టుగా బిల్డప్ ఇచ్చారు. ఇంకా బాధాకరమైన విషయం ఏంటంటే. ఈ సభలో ఒక్క నాయకుడు కూడా మాట్లాడలేదు. కెసిఆర్ స్పీచ్ కి మళ్ళీ ఎక్కడ ఆటంకం కలుగుతుందో అన్నట్లు సభ మొత్తం వన్ అండ్ ఓన్లీ కెసిఆర్ స్పీచ్ తో అదిరిపోవాలి అనుకున్నారు. కెసిఆర్ హెలికాప్టర్ లో దిగి సభ పైకి రావడానికి చాలా సేపు వేచి ఉండాల్సి వచ్చింది. సరే వచ్చిన తర్వాత అయినా ఇరగదీసాడా అంటే మళ్లీ పాడిన పాటే పాడాడు. అవే పిల్లి శాపనార్థాలు అవే తిట్లు. కెసిఆర్ స్పీచ్ లో కనీసం కొత్త తిట్లు కూడా లేవు. పోనీ ఏదైనా సంచలన ప్రకటన ఉంటదా అన్న అంటే అది లేదు. కాంగ్రెస్. రేవంతు టార్గెట్ గానే కెసిఆర్ స్పీచ్ మొత్తం సాగిందిమొత్తం మీద రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ఇంత వ్యతిరేకత ఉంటే. ఆ వ్యతిరేకతని క్యాష్ చేసుకోవడంలో బి ఆర్ఎస్ అట్టర్ ఫ్లాఫ్ అయింది. 200 కోట్ల రూపాయలు వందలో పోసినట్లయింది. ఇంత చేసి పాపం హరీష్ రావు చివరికి సభలో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉద్యోగం కూడా చేశాడు. కానీ ఎక్కడ హరీష్ రావు బొమ్మ కనపడకుండా వేదిక మీద చాలా జాగ్రత్త పడ్డారు కేసీఆర్ కేటీఆర్. పాపం హరీష్ కి ఇదొక విషాదం. మొత్తం మీద కెసిఆర్ భూకంపం పుట్టించడం మాట నుంచి, టిఆర్ఎస్ భ్రమలో ఉంది అనే విషయం మాత్రం ఈ సభ ద్వారా అందరికీ తెలిసింది.

# రేవంత్ ను లైట్ తీసుకున్న కేసీఆర్






హైదరాబాద్, ఏప్రిల్ 29, ( వెలుతురు)

సంబరం అంబరాన్ని అంటింది.. ఉత్సాహం తారస్థాయికి చేరింది.. మొత్తంగా గులాబీ పార్టీ.25 ఏళ్ల వేడుక ఎల్కతుర్తి లో అంగరంగ వైభవంగా సాగింది.. ఒకరకంగా అనధికారిక దర్పంగా ఈ కార్యక్రమం సాగింది. ఇంతటి వేడుకలో పార్టీ నాయకులకు మాట్లాడే అవకాశం రాలేదు. కేవలం ఒకే ఒక్క వ్యక్తికి మాత్రమే ప్రసంగించే అవకాశం లభించింది.సిల్వర్ జూబ్లీ వేడుకలో కల్వకుంట్ల చంద్రశేఖర రావు పార్టీ అధ్యక్షుడి హోదాలో మాట్లాడారు. దాదాపు గంట వరకు కేసీఆర్ ప్రసంగం సాగింది. తెలంగాణ రాష్ట్రంలో గడచిన 10 సంవత్సరాల కాలంలో ఏం చేశామో ఆయన చెప్పుకొచ్చారు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం వల్ల తెలంగాణ రాష్ట్రం వెనుకబడిపోయిందని ఆరోపించారు.. తాము స్కీములు పెట్టి ప్రజలను బాగు చేస్తే.. కాంగ్రెస్ నాయకులు స్కామ్ లతో రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. గంటసేపు సాగిన మాజీ ముఖ్యమంత్రి ప్రసంగంలో కొత్తదనం కనిపించలేదు. పైగా ఆయన విమర్శలకు.. ఆరోపణలకు.. 10 సంవత్సరాల తన పరిపాలన వరకే పరిమితమయ్యారు. అంతేకాదు తెలంగాణకు మొదటి నుంచి కూడా కాంగ్రెస్ పార్టీ శత్రువు అని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు కాకుండా నాడు, నేడు కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నదని వివరించారు. మొత్తంగా కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఇన్ని రోజుల పాటు మౌనంగా ఉండి.. ఇప్పుడు బయటికి రావడం.. సభను భారీగా నిర్వహించడంతో.. కీలక వ్యాఖ్యలు చేస్తారని అందరూ అనుకున్నారు. కానీ దానికి తగ్గట్టుగా ఆయన మాట్లాడకపోవడం ఒకరకంగా భారత రాష్ట్ర సమితి శ్రేణులను నిరాశకు గురి చేసిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. గంటసేపు సాగిన కెసిఆర్ ప్రసంగంలో ఎక్కడా కూడా రేవంత్ పేరు వినిపించలేదు. కనీసం రేవంత్ పేరును ప్రస్తావించడానికి కూడా కేసీఆర్ ఇష్టపడలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించిన %దీ=ా% అధినేత కేసీఆర్..ఎక్కడా సీఎం రేవంత్ రెడ్డి పేరును ప్రస్తావించలేదు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు బోల్తా పడ్డారని..ప్రభుత్వంలో ఉన్న నాయకులు..నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.బీఆర్ఎస్, కేసీఆర్ మీద నిందలు వేస్తున్న కాంగ్రెస్ పాలకులు మంచిగా ఉన్న తెలంగాణను ఆగమాగం చేశారని ఫైర్ అయ్యారు. కేసీఆర్ శాసనసభకు ఎందుకు రారని ప్రశ్నించేవారికి చెబుతున్నానంటూ.. అసెంబ్లీలో తమ పార్టీ నాయకులు ప్రశ్నిస్తేనే ఈ ప్రభుత్వానికి సమాధానం చెప్పే దిక్కులేదని%ొా%అలాంటప్పుడు వాళ్లకు నేనెందుకంటూ సీఎం రేవంత్ పేరును ప్రస్తావించకుండానే కౌంటర్ ఇచ్చారు. ఇలా కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు అంశాల్లో ఆగ్రహం వ్యక్తం చేసిన కేసీఆర్..ఎక్కడా సీఎం రేవంత్ రెడ్డి పేరును ఎత్తలేదు. కనీసం ముఖ్యమంత్రి అనిగాని, సీఎం అనిగాని ప్రస్థావించలేదు. ఒకటి రెండు సందర్భాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేరును ప్రస్తావించకుండానే ఆర్థిక మంత్రి అని మాట్లాడారు. కేసీఆర్ సుధీర్ఘ ప్రసంగంలో ఒక్కసారి కూడా సీఎం రేవంత్ రెడ్డి పేరును పలకకపోవడంపై తెలంగాణ రాజకీయవర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్షంలో భారత రాష్ట్ర సమితి.. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నాయి. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత భారత రాష్ట్ర సమితిపై ఉంది. ప్రజలకు మెరుగైన పాలన అందించే బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉంది. ఈ సమయంలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం పరిపాటి. ఎందుకంటే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్న మనదేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతుంటాయి. పరస్పరం విమర్శలు కొనసాగుతుంటాయి. అయితే విచిత్రంగా భారత రాష్ట్ర సమితి 25 సంవత్సరాల వేడుకలో కల్వకుంట్ల చంద్రశేఖర రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు పలకకపోవడం వెనక పెద్ద కారణమే ఉందని భారత రాష్ట్ర సమితి నాయకులు అంటున్నారు. ఇక ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూడా గట్టిగా కౌంటర్ ఇస్తున్నాయి. తన పేరు కూడా పలకడానికి భయపడే పరిస్థితిని కల్వకుంట్ల చంద్రశేఖర రావు కు రేవంత్ రెడ్డి కల్పించారని వ్యాఖ్యానిస్తున్నాయి. ఇంతవరకు అసెంబ్లీకి ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే వచ్చారని.. అప్పుడు యుద్ధం చేస్తానని పెద్దపెద్ద ప్రకటనలు చేశారని.. యుద్ధం కాదు కదా కనీసం బయటికి కూడా రాలేని పరిస్థితిని మాజీ ముఖ్యమంత్రి కి రేవంత్ రెడ్డి కల్పించారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.. 2023 ఎన్నికల్లో ఓటమి తర్వాత మాజీ ముఖ్యమంత్రి అసెంబ్లీకి రెండు సందర్భాల్లో మాత్రమే వచ్చారు. శాసన సభ్యుల ప్రమాణ స్వీకార సమయంలో మాజీ ముఖ్యమంత్రి కాలు జారిపడి.. ఆస్పత్రి పాలయ్యారు. ఆ సమయంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ను రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఆ తర్వాత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆరోగ్యం కుదురుకున్న తర్వాత శాసనసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఇక ఆ మధ్య బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఒకసారి అసెంబ్లీకి వచ్చారు. ఇప్పుడు తన వ్యవసాయ క్షేత్రానికి మాత్రమే కెసిఆర్ పరిమితమవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ.. భారత రాష్ట్ర సమితి ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. బహుశా ఆ పార్టీ చరిత్రలో ఇది అత్యంత దారుణమైన ఓటమి. ఇక దీని కవర్ చేయడానికి భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియాను ప్రధాన అస్త్రంగా వాడుకుంటున్నది. అయితే సోషల్ మీడియా ప్రచారం వేరు.. వాస్తవ పరిస్థితి వేరని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. భారత రాష్ట్ర సమితి నాయకులు సోషల్ మీడియాలో బలంగా ఉన్నారని.. తమ ప్రజల్లో బలంగా ఉన్నామని.. ప్రజల్లో బలంగా ఉన్న వారే గెలుస్తారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు..

# లబ్ధిదారుల్లో అయోమయం

నిజామాబాద్, ఏప్రిల్ 29, ( వెలుతురు)

పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఇళ్ల నిర్మాణం విషయంలో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపే ఇళ్లను నిర్మించాలని షరతు విధించడంతో ఈ పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో మొదటి విడతగా 70,122 ఇళ్లకు అనుమతులు ఇవ్వగా.. 2,830 మంది లబ్ధిదారులు ఇప్పటికే పునాది పనులు పూర్తి చేశారు. అయితే వీరిలో దాదాపు 280 మంది 600 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారని అధికారులు గుర్తించారు.దీంతో వారికి మొదటి విడత బిల్లు రూ.లక్షను విడుదల చేయడానికి అధికారులు నిరాకరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునాదిలో మార్పులు చేసుకుంటేనే బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. దీనిపై లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సొంత స్థలాలు ఉన్నవారు తమకు నచ్చిన విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకోవచ్చని,



ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ప్రభుత్వం అనేక సందర్భాల్లో చెప్పిందని వారు గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా, మోడల్ ఇళ్లను అందుబాటులో ఉంచి ఎలాంటి నిబంధనలు ఉండవని తెలిపిందంటున్నారు.ఇప్పుడు హఠాత్తుగా 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించాలని చెప్పడం సరికాదని అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో పాటు అదనంగా తాము కూడా డబ్బులు ఖర్చు చేసుకుంటున్నామని, ఇప్పుడు నిబంధనలు విధిస్తే ఎలా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. అయితే 600 చదరపు అడుగులు దాటితే బీపీఎల్ పరిధిలోకి రారని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి పేదల ఇళ్లను 400 చదరపు అడుగుల్లోనే నిర్మించాలని.. ప్రభుత్వం అదనంగా 200 చదరపు అడుగులకు పెంచిందని గృహ నిర్మాణ శాఖ పేర్కొంటోంది. ఈ మేరకు ఇండ్ల నిర్మాణాలు చేపడితేనే బిల్లులు వస్తాయని క్లారిటీ ఇచ్చారు.ఇక మే 5వ తేదీలోపు ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ఈ మేరకు ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల లోపు ఉండాలనే నిబంధనను విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా యంత్రాంగాలకు గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ ఇంటి నిర్మాణాలను చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

# తిరుపతి మంగళంలో దారుణం

- భవనంపై నుంచి పడి ముగ్గురు కార్మికులు దుర్మరణం



**తిరుపతి,ఏప్రిల్29( వెలుతురు):**
నిర్మాణంలో ఉన్న భవనంపై నుండి ప్రమాదవశాత్తూ పడి ముగ్గురు కార్మికులు మృతి చెందిన ఘటన మంగళవారం తిరుపతి జిల్లాలో జరిగింది. మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ తుడా క్వార్టర్స్ హెచ్ఐజి ఫ్లాట్ నెంబర్ 63 లో 5 అంతస్తుల భవన నిర్మాణం జరుగుతుంది. భవన యజమాని అండాలయ్య జిపిఎస్ జీ ప్లస్ 3 కి అనుమతి తీసుకొని 5 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఉదయం నలుగురు మేస్త్రీలు భవనం 5వ అంతస్తు గోడకు పూత పని చేయడానికి వేసుకున్న బెడ్ కర్ర విరిగిపోవడంతో ఈ ప్రమాదం జరిగి ముగ్గురు కార్మికులు కిందికి పడిపోయి మరణించారు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ డిఎస్పి, ఆర్డీవో రామ్మోహన్, తిరుపతి అర్బన్ తాసిల్దార్ భాగ్యలక్ష్మి, సిఐ సునీల్ కుమార్, సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చనిపోయిన ముగ్గురు కార్మికులు ఒంగోలుకు చెందిన వసంత్ (40), ఒంగోలు శీను (38), పెళ్ళకూరు మండలం, అక్క గారి పేట గ్రామం కు చెందిన బోటతొట్టి శ్రీనివాసులు (38) గా గుర్తించారు. 108 సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి కిందపడిన కార్మికులను పరిశీలించి వారు మృతి చెందినట్లు-గా నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జిప్‌లైన్ ఆపరేటర్‌పై అనుమానాలు

- అతని వ్యవహార శైలి సెల్ఫీ వీడియోలో రికార్డు
- విచారణకు సమన్లు ఇచ్చిన ఎన్ఐఏ



**శ్రీనగర్,ఏప్రిల్29( వెలుతురు):**
పెహల్‌గామ్ ఉగ్రదాడికి సంబంధించి ఓ కొత్త వీడియో వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఆ వీడియో పలు అనుమానాలకు తావిస్తోంది. అహ్మదాబాద్‌కు చెందిన ఓ పర్యాటకుడు జిప్‌లైన్ పై రైడ్ చేస్తూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అందులో ఉగ్రదాడికి సంబంధించిన దృశ్యాలు రికార్డయ్యాయి. జిప్‌లైన్‌పై ప్రయాణిస్తూ అతడు కేరింతలు కొడుతుండగా.. కింద ఉన్న పర్యాటకులు కేకలు వేస్తూ పరుగులు తీస్తున్న దృశ్యాలు అందులో నిక్షిప్తమయ్యాయి. అంతేకాదు తుపాకీ శబ్దాలు కూడా వినిపించాయి. ఈ రైడ్‌కు ముందు జిప్‌లైన్ ఆపరేటర్ వ్యవహార శైలిపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 'అల్లాహూ అక్బర్' అంటూ మూడుసార్లు జిప్‌లైన్ ఆపరేటర్ అనడంపై అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. ఈ నేపథ్యంలో అతడిని విచారించేందుకు ఎన్ఐఏ సమన్లు జారిచేసినట్లు తెలుస్తోంది. మరోవైపు పెహల్‌గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ముష్కరుల కోసం కశ్మీర్ లోయలో వేట కొనసాగుతోంది. గత వారం రోజులుగా కశ్మీర్ లోయను సైన్యం జల్లెడపడుతోంది. ఈ క్రమంలో ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఉగ్రవాదులు చైనా మెసేజింగ్ యాప్‌లను వాడినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. ఈ యాప్‌ల సాయంతోనే ఉగ్రవాదులు భారత సరిహద్దుకు ఆవల ఉన్నవారితో సమచారాన్ని పంచుకున్నాయని, ఆదేశాలు అందుకున్నాయని వివరించాయి. ఈ యాప్‌లను 2020లో గల్వాన్ ఘర్షణ అనంతరం భారత్ నిషేధించిందని పేర్కొన్నాయి. గల్వాన్ ఘర్షణ తర్వాత ఇండియా నిషేధం విధించిన చైనా మెసేజింగ్ యాప్స్‌లో వీచాట్, క్యూక్యూ ఇంటర్నేషనల్ వంటివి ఉన్నాయి.

# ప్రధాని మోడీ పర్యటనకు భారీ ఏర్పాట్లు

- మోడీ పర్యటించేప్రాంతాలను పరిశీలంచిన ఎస్పీజి

**అమరావతి,ఏప్రిల్29( వెలుతురు):**



ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రాబోతున్న వేళ ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. మే 2వ తేదీన ఏపీ రాజధాని అమరావతి పనులకు భారత ప్రధాని శంకుస్థాపన చేయబోతున్నారు .. మోడీ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఏపీ ప్రభుత్వం.. ఇప్పటికే అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసింది.. మంత్రులు, అధికారులతో కమిటీలు వేసి.. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు.. ఇక, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ప్రతీరోజూ.. ప్రధాని మోడీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షలు నిర్వహిస్తూ ఆరా తీస్తున్నారు.. ఇక, ప్రధాని పర్యటనకు మూడు రోజుల ముందే ఎస్పీజీ రంగంలోకి దిగింది.. అమరావతి చేరుకున్న ప్రధాని మోడీ భద్రతా దళం.. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించే ప్రాంతాలను పరిశీలించి.. మోడీ టూర్ సాగే రూట్లలో ప్రయాణిస్తూ.. ప్రత్యేకంగా పరిశీలించింది.. హెలిప్యాడ్, సభా వేదిక మార్గం, సభా వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించింది.. భద్రతా ఏర్పాట్లను ఎస్పజకి స్థానిక అధికారులు వివరించారు. ప్రధాని మోడీ అమరావతి పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఇప్పటికే ఖరారు అయ్యింది.. ప్రధాని మోడీ టూర్‌కు సంబంధించిన షెడ్యూల్ అధికారికంగా ఏపీ ప్రభుత్వానికి అందింది.. రాజధాని నిర్మాణ పనుల పునఃప్రారంభంతో పాటు- పలు ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేయనున్న విషయం విదితమే కాగా.. మే 2వ తేదీన తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి.. మధ్యాహ్నం 2.50 గంటలకు మోడీ గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు .. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో అమరావతికి చేరుకోనున్నారు. ఏపీ సచివాలయం ఎదురుగా ఉన్న హెలిప్యాడ్ నుంచి 3.30 గంటలకు వేదిక వద్దకు చేరుకుంటారు.. ఇక, అప్పటి నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు వివిధ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కాబోతున్నారు.. మొత్తంగా ప్రధాని మోడీ అమరావతి పర్యటన గంట 15 నిమిషాల పాటు- సాగనుంది.. ఆ తర్వాత హెలికాప్టర్‌లో గన్నవరం ఎయిర్‌పోర్ట్ చేరుకుని.. అక్కడి నుంచి సాయంత్రం 5.20 గంటలకు ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు.

# నామినేషన్ దాఖలు చేసిన పాకా

- పార్టీలో వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం

**విజయవాడ,ఏప్రిల్29( వెలుతురు):**
బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా ఎన్డీయే కూటమి తరపున పాకా వెంకట సత్యనారాయణను ఎంపిక చేయడంతో ఆయన మంగళవారం విజయవాడలో నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పార్థసారథి, ఇతర నేతలు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాకా మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా తాను బీజేపీలో పని చేస్తున్నానని, బీజేపీ పట్టణ అధ్యక్షుడి నుంచి రాష్ట్ర నేతగా ఎదిగానని, డ్రాఫ్టింగ్ కమిటీ- ఛైర్మన్‌గా, కేంద్ర మంత్రుల బృందానికి కన్వీనర్‌గా, క్రమశిక్షణ సంఘం కమిటీ- ఛైర్మన్‌గా పని చేశానని అన్నారు. వెనుకబడిన తరగతుల వారికి పార్టీలో ప్రాధాన్యత, పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు వస్తుందనేందుకు తనకు రాజ్యసభ ఎంపికే నిదర్శనంమని పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర నేతలు అందరూ తన పేరు సూచించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టు-కునేలా పని చేస్తానని అన్నారు. ఏపీలో బీజేపీ బలోపేతం చేస్తూ కూటమి లక్ష్యాలను ముందుకు తీసుకెళతానన్నారు. అన్ని వర్గాల వారిని అక్కున చేర్చుకునేలా



కలిసి పని చేస్తామని, దేశం హితం, రాష్ట్రం అభివృద్ధి కోసం కలిసి ప్రయాణిస్తామని స్పష్టం చేశారు. మోదీ నేతృత్వంలో జరిగే అభివృద్ధిలో తనకు భాగస్వామ్యం కలగడం ఆనందంగా ఉందన్నారు. మోదీ, అమిత్ షా, నడ్డాలతో కలిసి పనిచేసే అవకాశం రావడం మా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. వివాదాస్పద చట్టాలు పక్కన పెట్టి మోదీ తీసుకునే నిర్ణయాలు ఆదర్శంగా ఉన్నాయని పాకా వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. పాకా సత్యనారాయణ మొట్టమొదటి నుంచీ బీజేపీ కోసం పని చేశారని, ఆయన సేవలు గుర్తించి రాజ్యసభకు ఎంపిక చేయడం ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ అన్నారు. పార్టీని నమ్ముకుని పని చేసిన వ్యక్తికి సముచిత స్థానం దక్కిందని అన్నారు. తాను, ఆయన భీమవరం రోడ్లపై ఒకే బండి మీద తిరిగామని, 35 సంవత్సరాలుగా మేము కలిసి పని చేస్తున్నామని చెప్పారు. ఇప్పుడు ఢిల్లీలో కూడా మేమిద్దరం రాష్ట్రం కోసం కలిసి పని చేస్తామని అన్నారు. కార్యకర్తలు సేవలను గుర్తించి ఇటీవల పార్టీ నాయకత్వం నిర్ణయాలు తీసుకుంటు-ందని, తాను, పాకా సత్యనారాయణ, సోము వీర్రాజు, సత్యకుమార్‌లు సమకాలీకులమని తెలిపారు. మేమంతా కలిసిపని చేశామని.. ఇప్పుడు కలిసి పదవుల ద్వారా అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యామన్నారు. కష్టపడి పని చేసే కార్యకర్తలకు పార్టీలో తప్పకుండా గుర్తింపు ఉంటు-దని శ్రీనివాస వర్మ అన్నారు.

# తెలంగాణకు ఎప్పటికి కాంగ్రెస్ పార్టీనే విలన్

- ఎంత ధాన్యం కొన్నారో లెక్కలు చెప్పండి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శలు

**సూర్యాపేట,ఏప్రిల్29( వెలుతురు):**
తెలంగాణకు ఎప్పటికి కాంగ్రెస్ పార్టీనే విలన్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేరు విలన్ గానే తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది.. 16 నెలల్లో సమైక్య రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు వచ్చాయని ఆరోపించారు. ఒక్క ఏడాదిలోనే గురుకుల పాఠశాలల్లో 90 మంది విద్యార్థులు చనిపోయారు అని చెప్పుకొచ్చారు. ఇక, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తర కుమార ప్రగల్భాలు ఆపాలని సూచించారు. ఈ రోజు వరకు ఎంత ధాన్యం కొన్నారో ఉత్తమ్ కుమార్ లెక్క చెప్పాలి అని డిమాండ్ చేశారు. ఎన్ని వడ్లు కొన్నారు?.. ఎంత బోనస్ ఇచ్చారో చెప్పాలన్నారు. చెప్పకపోతే మీరు రండలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మీద ఎందుకు ఏడుస్తున్నారు.. కేసీఆర్ మీకు సంవత్సరం పైనే సమయం ఇచ్చారని జగదీష్ రెడ్డి తెలిపారు. ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభపై ప్రజల్లో చర్చ జరుగుతోంది అని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. ఇక, సభకు వచ్చిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు.. బహిరంగ సభలో రేవంత్ రెడ్డి పేరు కేసీఆర్ చెప్పలేదని సీఎం బాధపడుతున్నారనిఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ ని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు గుర్తు పెట్టుకోవడం లేదని సెటైర్లు.. ఇక, తెలంగాణను ఆంధ్రాలో కలిపింది కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ పేరు ఎత్తితే వాళ్ళను నక్సలైట్ల పేరుతో కాంగ్రెస్ కాల్చి చంపింది అని గుర్తు చేశారు. చంద్రబాబు చేతిలో నడ్డి విరిగిన కాంగ్రెస్ 2004లో టీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుంది.. యూపీఏ కామన్ మినిమమ్



ప్రోగ్రామ్ లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును టీఆర్ఎస్ పెట్టించింది.. కేసీఆర్ తిడుతున్న వాళ్ళు నాడు సమైక్యాంధ్ర తొత్తుల కింద ఉన్నారు అని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన రిపోర్ట్ నిజమని నిరూపించు ఉత్తమ్ కుమార్ రెడ్డి మాజీమంత్రి జగదీష్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తే ఎవరూ పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఏం మాట్లాడుతారోనని మీరు, ప్రజలు ఎదురు చూశారు.. అసెంబ్లీలో పిల్లల్ని ఏం పీకలేకపోతున్నారు.. అవతలి టీమ్ బలహీనంగా ఉందని పిల్లల్ని అసెంబ్లీకి పంపుతున్నారు.. కేసీఆర్ ఏ టైంకి, ఎట్లా రావాలో అసెంబ్లీకి వస్తారు.. ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని జీవో ఇచ్చారు.. 41 వేల కోట్లు రుణమాఫీ అని చెప్పి 21 వేల కోట్లు చేశామని చెప్పారు.. ఇప్పుడు రైతు రుణమాఫీ పూర్తి అయిందని అంటున్నారు.. బీఆర్ఎస్ సభను చూసి లాగులు తడుపుకుంటున్నారని సెటైర్లు వేశారు.

# శరవేగంగా రాజధాని పర్యటన ఏర్పాట్లు

## మరోమారు అధికారులతో పరిశీలించిన నారాయణ



**అమరావతి,ఏప్రిల్29( వెలుతురు):**
ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లు శరవేగంగా పూర్తి కావస్తున్నాయి. చంద్రబాబు, మంత్రులు సమీక్షలు చేస్తూ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. అలాగేమంత్రుల కమిటీ కూడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. ఈ క్రమంలో దాదాపు 90 శాతం పూర్తయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. మిగిలిన పనులను బుధవారం నాటికి పూర్తిచేస్తామని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. రూ.43 వేల కోట్ల పనులను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుంది. రాజధాని కోసం కేవలం 50 రోజుల్లో ఒక్క సమస్య కూడా లేకుండా రైతులు భూములు ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో రాజధాని కట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సింగపూర్ సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందించాం. 365 కి.మీ ట్రంక్ రోడ్లు, 1500 కి.మీ లే ఔట్ రోడ్లు నిర్మించేలా ప్లాన్ ఉంది. గతంలోనే రూ.41 వేలకోట్లకు పనులు ప్రారంభమయ్యాయి. 2019కు ముందు రూ.5 వేల కోట్ల బిల్లులు కూడా చెల్లించాం. గత ప్రభుత్వం రాజధానిపై మూడు ముక్కలాట ఆడింది. న్యాయపరమైన సమస్యలు లేకుండా ముందుకెళ్లేందుకు ఇంత సమయం పట్టింది. మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి చేస్తాం. సోమవారం అమరావతి ప్రాంత రైతులతో సీఎం రెండుగంటలపాటు- మాట్లాడారు. 29 గ్రామాల రైతులను ప్రధాని సభకు రావాలని సీఎం స్వయంగా ఆహ్వానించారు. అమరావతిపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని రైతులు కోరారు. ఈ అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారని నారాయణ తెలిపారు. అన్నీ సక్రమంగా సాగుతున్నాయి. ఇక రాజధాని నిర్మాణం వేగం పుంజుకుంటుందని మంత్రి అన్నారు.

# గద్వాల జిల్లాలో రోడ్డు ప్రమాదం

- ఇద్దరు నర్సింగ్ విద్యార్థుల దుర్మరణం

**గద్వాల,ఏప్రిల్29( వెలుతురు):**
జోగుళాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు-చేసుకుంది. జిల్లా కేంద్రంలో నర్సింగ్ విద్యార్థులను బోలేరా వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఐదుగురు విద్యార్థినులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడని వారిని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు- వైద్యులు తెలిపారు. నర్సింగ్ కాలేజ్ నుంచి హాస్టల్ కు వెళ్లే క్రమంలో బస్ పాయింట్ దగ్గర ఆగినప్పుడు ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. గద్వాల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నర్సింగ్ విద్యార్థిణులు మృతి చెందడం పట్ల ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న అమ్మాయిలు, చిన్న వయసులోనే ఇలా మరణించడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సంతోష్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, మృతుల కుటుంబాలకు అండగా ఉండాలని వారికి సూచించారు. ఇదే ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న మరో విద్యార్థినికి అవసరమైన వైద్య సాయం అందించాలని కలెక్టర్‌ను, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. మృతుల కుటుంబాలకు మంత్రి సానుభూతి ప్రకటించారు. మరణించిన విద్యార్థిణుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# మరోమారు నగరంలో డ్రగ్స్ కలకలం

- రూ.1.40కోట్ల విలువైన డ్రగ్స్, గంజాయి స్వాధీనం

**హైదరాబాద్,ఏప్రిల్29( వెలుతురు):**
డ్రగ్స్ యువత జీవితాలను చిత్తు చేస్తోంది. మాదకద్రవ్యాల కట్టడికి ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడడం లేదు. హైదరాబాద్ లో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. నార్కొటిక్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్, నల్లకుంటా పోలీసులు జాయింట్ ఆపరేషన్ లో భారీగా డ్రగ్స్ పట్టు-బడ్డాయి. రూ.1.40కోట్ల విలువైన డ్రగ్స్, గంజాయి స్వాధీనం చేసుకున్నారు అధికారులు. నగర అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.. హైదరాబాద్ నార్కొటిక్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్,నల్లకుంటా పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారని తెలిపారు.

వినియోగదారులు పేడ్లర్లుగా మారుతున్నారన్నారు. నల్లకుంటలో దాడులు నిర్వహించి డ్రగ్ పేడ్లర్ హర్షవర్ధన్, సప్లయ్ కం పేడ్లర్ శ్రీనివాస రాహుల్ లోకల్ పేడ్లర్స్ అభిషేక్, దవల్ ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. డార్క్ వెబ్ ద్వారా పరిచయాలు పెంచుకుని పేడ్లర్ గా అభిషేక్ మారాడని వెల్లడించారు. హర్షవర్ధన్ ప్రధాన అంతర్రాష్ట్ర పెడ్లర్ అని తెలిపారు. 1380 గ్రాముల హైడ్రోపోనిక్ గంజా( ఓజి కుష్), 44రాఉ బోల్ట్స్, 10వేల రూపాయలు క్యాష్, 6మొబైల్స్, 2ద్విచక్ర వాహనాలు, పార్కింగ్ మెటీ-రియల్స్ సీజ్ చేసామని తెలిపారు. మొత్తం పట్టు-బడ్డ డ్రగ్ వాల్యూ 1.40కోట్లు- ఉంటుందని వెల్లడించారు. స్నాప్ చాట్, వివిధ యాప్స్ ద్వారా డ్రగ్స్ అమ్మకాలు చేస్తున్నారు. చదువుకున్న యువత ఎక్కువగా మత్తుపదార్థాలకు అలవాటు- పడుతున్నారు.. పిల్లలపై తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్నాం.. పోలీసులు కంట్రోల్ చేస్తున్నారు.. నిందితుడు హర్షవర్ధన్ ఒక్కో రోజే 10లక్షలు, మిగతా రోజుల్లో లక్షల్లో ట్రాన్సక్షన్ యాప్ ద్వారా బదిలీ చేసాడు.. డిటిడిసి కొరియర్ ద్వారా డ్రగ్స్ సప్లయ్ చేస్తున్నారు.. ఇందులో హవాలా ఆపరేటర్స్, క్రిఎ÷-టో కరెన్సీ ప్రమేయం ఉంది. నిందితుడు హర్షవర్ధన్ శ్రీవాస్తవ జబల్పూర్, మధ్యప్రదేశ్ లో ఉంటాడు.. డబ్బు అవసరమయ్యే వ్యాపారాన్ని ప్రారంభించాడు.. సులభంగా డబ్బు సంపాదించాలని టార్గెట్ పెట్టు-కున్నాడు.. ।ష కమ్యూనిటీ- ద్వారా డ్రగ్‌ని ఎలా సేకరించాలి సరఫరా చేయాలో నేర్చుకున్నాడు అని సీపీ తెలిపారు.

# ఎన్టీఆర్-నీల్ కాంబినేషన్

## 2026 జూన్ రిలీజ్ అంటూ ప్రకటన

ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ ఈ కాంబినేషన్లో సినిమా అనగానే అంచనాలు ఆకాశాన్నంటాయి. కెజియఫ్, సలార్ సినిమాల తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తున్న సినిమా కావడం ఒకటైతే ఇది ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ అవడం టైగర్ ఫ్యాన్స్ ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. అత్యంత భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాలు టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తో పాటు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కన్నడ భామ రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తుండగా రవి బస్రుర్ సంగీతం అందిస్తున్నారు.కాగా ఈ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేస్తామని పూజా కార్యక్రమాలు నిర్వహించిన రోజు ప్రకటించారు మేకర్స్. కానీ అనుకోని కారణాల కారణంగా షూటింగ్ వాయిదా పడుతూ వస్తుండడం, మధ్యలో వార్ 2కు ఆగష్టులో ప్రమోషన్స్ కోసం డేట్స్ ఇవ్వాల్సి ఉండడం వంటి కారణంగా ఈ సినిమా సంక్రాంతికి రాదు అనే వాదనలు వినిపించాయి. ఆ వాదనలకు తెరదించుతూ న్యూ రిలీజ్ డేట్ ను ప్రకటించారు మేకర్స్. 2026 జూన్ 25న ఎన్టీఆర్ నీల్ సినిమాను రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేసారు. అలాగే యంగ్ టైగర్ పుట్టిన రోజు కానుకగా మే 20న న ఎన్టీఆర్, నీల్ సినిమా గ్లిమ్స్ రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వారం క్రితం యంగ్ టైగర్ ఈ సినిమా సెట్స్ లో పాల్గొన్నారు.




# ఉగ్రవాదానికి మతం లేదు.. పహల్గామ్ దాడికి తిరిగి చెల్లించాలి

## : ఇమ్రాన్ హష్మీ



జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిపై దేశవ్యాప్తంగా పలువురు సినీ ప్రముఖులు స్పందిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ కూడా ఈ దాడిని ఖండిస్తూ.. ఉగ్రవాదంపై బదులు తీసుకునే సమయం వచ్చిందని తెలిపాడు. ఉగ్రవాదానికి ఎటువంటి మతం లేదని తెలిపిన ఆయన ఈ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, వారికి “తిరిగి చెల్లించాలి” (payback) అని ఆయన డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని మతం పేరుతో సమర్థించే వారికి ఖండించిన ఆయన.. టెర్రరిజంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, శాంతిని నెలకొల్పడానికి అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా ఇమ్రాన్ చేసిన ప్రస్తుతం వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# హీరోల కోసం త్రివిక్రమ్ చూపు

## వెంకటేశ్‌తో చేస్తాడన్న ప్రచారం



మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పైనే అందరి చూపు ఉన్నా..ఆయన చూపు ఎవరి వైపు అన్నదే ఇప్పుడు చర్చ. నిత్యం పెద్ద హీరోలు, భారీ బడ్జెట్ సినిమాలతో త్రివిక్రమ్ కాంపౌండ్ కళకళలాడేది. కానీ ఇప్పుడు వెలవెల బోతోంది. త్రివిక్రమ్ తో సినిమా చేసేందుకు హీరోలు దొరకని పరిస్థితి. హీరో అంటే ఇక్కడ స్టార్ హీరోలండి బాబు. ఈ పరిస్థితి రావడానికి కారణం కూడా మన గురూజీనే. కేవలం స్టార్ హీరోలతో మాత్రమే సినిమాలు చేస్తానని పట్టుబడతాడు. అదే దెబ్బ కొట్టేసింది. ఎందుకంటే స్టార్ హీరోలు అందరూ పాన్ ఇండియా బడ్జెట్ లో చేసేస్తున్నారు. పైగా రియలస్టిక్ సినిమాలకే జెండా ఊపుతున్నారు. క్లాస్ సినిమాలు తీసే త్రివిక్రమ్ కు ఇది అడ్డంకిగా మారింది. బన్నీతో సినిమా ఉంటుందని ప్రచారం జరిగినా.. అది ఇప్పట్లో ఉండేలా కనిపించలేదు. అట్లీ మూవీ అయ్యాకే ఉంటుంది. దానికి ఇంకో మూడేళ్లు పడుతుంది. అప్పటి దాకా ఖాళీగా ఉండటం కన్నా వెంకటేశ్ తో తీస్తే బెటర్ అంటున్నారు. కానీ దానికి త్రివిక్రమ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావట్లేదు. త్రివిక్రమ్ తో చేయడానికి వెంకీ సిద్ధంగానే ఉన్నాడు. ప్రస్తుతం భారీ హిట్ తో ఖాళీగా ఉన్నాడు. కాబట్టి వెంకీతో మూవీ చేసి తానేంటూ త్రివిక్రమ్ నిరూపించుకుంటే బెటర్ అంటున్నారు ఆయన ఫ్యాన్స్. వెంకీ నటించిన ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు త్రివిక్రమ్ డైలాగులు రాశాడు. ఇద్దరి కాంబోలో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్ పెద్ద హిట్. కాబట్టి మళ్లీ ఓ మూవీ చేస్తే బాగుంటుందని వీరి ఫ్యాన్స్ అంటున్నారు. మరి త్రివిక్రమ్ ఏం చేస్తాడో చూడాలి.

# హిట్-3తో వస్తున్న నాని

హ్యాట్రిక్ హిట్స్‌తో మంచి జోష్ మీదున్నాడు నాని. దసరా, సరిపోదా శనివారంతో హండ్రెడ్ క్రోర్ హీరోగా ఛేంజయిన న్యాచురల్ స్టార్ నుండి వస్తోన్న చిత్రం హిట్ 3. ఇప్పటి వరకు నాని కెరీర్‌లోనే మోస్ట్ వయెలెంట్ పిక్చర్‌గా రాబోతుంది. మే 1న థియేటర్లలోకి వచ్చేస్తున్నాడు అర్జున్ సర్కార్. ఇప్పటి వరకు ఈ సిరీస్ నుండి వచ్చిన టూఫిల్మ్స్ మంచి హిట్ కొట్టడంతో పాటు నాని హీరో కావడంతో హిట్ 3పై భారీ అంచనాలున్నాయి. అయితే హిట్ 3కి టఫ్ కాంపిటీషన్ ఇచ్చేందుకు హాలీవుడ్ తో పాటు కోలీవుడ్ చిత్రాలు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి సీజన్ తర్వాత ఇప్పటి వరకు డ్రై సీజన్ నడిచింది. కొన్ని అడపా దడపా చిత్రాలు కొన్ని డబ్బింగ్ మూవీస్ సందడి చేశాయి. ఏప్రిల్ మొత్తం బాక్సాఫీస్ డల్ అయ్యింది. ఇప్పుడు మేలో వచ్చే సినిమాలపైనే హోప్స్. మేడేన వచ్చేస్తున్నాడు నాని. ఇదే సినిమాను పాన్ ఇండియా భాషల్లో డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. అయితే సౌత్, నార్త్ బెల్టులో హిట్ 3తో కొన్ని సినిమాలు పోటీపడుతున్నాయి. ముందుగా సూర్య.. హిట్ 3కి పోటీగా రెట్రోను మల్టీ లాంగ్వేజ్‌లో సినిమాను దింపుతున్నాడు. అలాగే టూరిస్ట్ ఫ్యామిలీ తమిళనాడులో రెట్రోతో పాటు హిట్ 3కి పోటీగా రాబోతుంది. హిందీ బెల్ట్‌లో చూస్తే సీనియర్లు అజయ్ దేవగన్ 2018లో వచ్చిన సక్సెస్ ఫుల్ మూవీ రైడ్‌కు సీక్వెల్‌గా రైడ్ 2 మే 1న రిలీజ్ చేస్తున్నాడు. సంజయ్ దత్ ది భూత్నీ కూడా అదే రోజు భయపెట్టేందుకు వస్తోంది. ఈ సినిమాలకే పిచ్చ కాంపిటీషన్ ఉంటే హాలీవుడ్ నుండి థండర్ బోల్ట్స్ వివిధ భాషల్లో రిలీజౌతుంది. ఇంత టఫ్ కాంపిటీషన్ ఉన్నప్పటికీ.. డేర్ చేసి వస్తున్నాడు నాని. ఇప్పటికే విపరీతమైన ప్రమోషన్లను చేసిన న్యాచురల్ స్టార్. వీటికి తోడు ఐపీఎల్ ఉండనే ఉంది. మరి ఇన్ని అవరోధాలను దాటుకుని నాని హిట్3 ఎలాంటి హిట్ కొడతాడో చూడాలి.




# వరుణ్ తేజ్.. మేర్లపాక కాంబోలో మూవీ

బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్స్ తో డౌన్ ఫాల్ లో ఉన్నాడు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్. ఎన్నో ఆశలు పెట్టుకున్న మట్కా మొదటి ఆటకే మకాం సర్దేసింది. దీంతో కాస్త గ్యాప్ తీసుకుని కథలపై దృష్టి పెట్టిన ఈ మెగా హీరో యంగ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్ లో సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు కొరియన్ కనకరాజ్ అనే క్రేజీ టైటిల్ ఫిక్స్ చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ లోని ఆచార్య సెట్ లో జరుగుతుంది. సినిమాలో వచ్చే ఐటమ్ సాంగ్ కోసం అక్కడ నిర్మించిన ప్రత్యేక సెట్స్ లో సాంగ్ షూట్ చేస్తున్నారు. ఈ కోసం హాట్ బ్యూటీని రంగంలోకి దింపుతున్నారు. హుషారు, బంగార్రాజు వంటి సినిమాలలో మెప్పించిన దక్షా నాగర్కర్ కొరియన్ కనకరాజ్ లో వరుణ్ తేజ్ తో కలిసి ఆడిపాడనుంది. లాంగ్ గ్యాప్ తర్వాత వస్తున్న వరుణ్ తేజ్ ఈ సినిమాతో స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వలని భావిస్తున్నాడు. ఈ సినిమా కోసం వరుణ్ తేజ్ థైక్వాండో లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. వరుణ్ తేజ్ కెరీర్ లో 15వ సినిమాగా వస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. మరి వరుణ్ ఆశను మేర్లపాక గాంధీ నెరవేరుస్తాడో లేదో రానున్న రోజుల్లో తెలుస్తుంది.



# గురునానక్ పాత్రలో అమీర్ ఖాన్ పోస్టర్

## అది నకిలీదంటూ టీమ్ స్పష్టీకరణ

బాలీవుడ్ మిస్టర్ ఫర్‌ఫెక్ట్ అమీర్ ఖాన్.. సిక్కు మతస్థుల దైవం అయిన గురునానక్ బయోపిక్ చేస్తున్నట్లు అతడి రూపంలో ఉన్న ఒక పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.. తాజాగా ఈ వార్తలపై అమీర్ ఖాన్ టీమ్ స్పందించింది. ఆ పోస్టర్ పూర్తిగా నకిలీదని, అది కృత్రిమ మేధస్సు ద్వారా సృష్టించిన పోస్టరని టీమ్ చెప్పుకొచ్చింది. ఈ విషయంపై అమీర్ ఖాన్ టీం స్పందిస్తూ.. గురునానక్‌గా అమీర్ ఖాన్‌ను చూపిస్తున్న పోస్టర్ పూర్తిగా నకిలీది. దానిని ఎఐ ద్వారా తయారు చేశారు. అమీర్ ఖాన్‌కు అలాంటి ప్రాజెక్ట్‌తో ఎలాంటి సంబంధం లేదు. ఆయన గురునానక్‌ను ఎంతో గౌరవిస్తారు. ఎలాంటి అగౌరవకరమైన చర్యలకు ఆయన మద్దతు ఇవ్వరు. దయచేసి ఇలాంటి నకిలీ వార్తలను నమ్మవద్దని పేర్కొన్నారు. ఈ పోస్టర్‌ను ఒక నకిలీ యూట్యూబ్ ఛానెల్ ద్వారా వ్యాప్తి చేయడంతో సిక్కు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ ఘటనపై శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీకి కూడా ఫిర్యాదు అందింది. ఇది మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు జరిగిన ఉద్దేశపూర్వక ప్రయత్నంగా ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ ఈ మోసాన్ని వెంటనే బహిరంగంగా ఖండించాలని, తమకు దీనితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేయాలని డిమాండ్ చేసింది.



# చిత్రదర్శకురాలుకు అరుదైన గౌరవం

## ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీలో కపాడియాకు చోటు



భారతీయ చలనచిత్ర దర్శకురాలు పాయల్ కపాడియాకి అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్టాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025 జ్యూరీలో పాయల్ చోటు దక్కించుకున్నారు. గతేడాది పాయల్ దర్శకత్వంలో వచ్చిన ’ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్స అనే చిత్రం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ పిక్స్ అవార్డు గెలుచుకున్న విషయం తెలిసిందే. ముంబై, కొంకణ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం మహిళా స్నేహం, ప్రేమ ఆకాంక్షల గురించి రూపొందించబడింది. ఈ సినిమా విడుదలై ప్రశంసలు అందుకోవడమే కాకుండా.. 30 సంవత్సరాల తర్వాత కేన్స్ ఫెస్టివల్‌లో నిలిచిన మొదటి భారతీయ చిత్రంగా చరిత్ర సృష్టించింది. అయితే తాజాగా పాయల్ కపాడియా జ్యూరీ మెంబర్‌గా చోటు దక్కించుకుంది. ఈ వేడుకలో ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ అధ్యక్షురాలిగా ఫ్రెంచ్ నటి జూలియెట్ బినోష్ వ్యవహరించనుండగా.. జ్యూరీలో పాయల్‌తో పాటు హాలీవుడ్ నటి హాలీ బెర్రీ, ఇటాలియన్ నటి ఆల్బా రోర్‌వాచర్, కొరియన్ దర్శకుడు హాంగ్ సాంగ్సూ, కాంగోలీస్ దర్శకుడు డైయెడో హమాడి, మెక్సికన్ దర్శకుడు కార్లోస్ రేగాడాస్, ఫ్రెంచ్-మొరాకన్ రచయిత్రి లీలా స్లిమాని కూడా సభ్యులుగా చోటు దక్కించుకున్నారు. గతేడాది దర్శకురాలిగా ఎంట్రీ ఇచ్చిన పాయల్ ఈసారి జ్యూరీ సభ్యురాలిగా కేన్స్‌లో భారతీయ సినిమాకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ చలనచిత్రోత్సవం మే 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో జరగనుంది.

# ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు....

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్.

**విజయవాడ,ఏప్రిల్29( వెలుతురు):**



ప్రధాని పర్యటనకు పటిష్ట ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మే 2వ తేదీ అమరావతి రాజధాని పనుల పున:ప్రారంభ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరు కానున్న నేపథ్యంలో చేపట్టవలసిన ఏర్పాట్లపై మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, బోండా ఉమామహేశ్వరరావు, కొలికపూడి శ్రీనివాసరావు, పర్యటన విధులు నిర్వహించే రూట్ ఆఫీసర్లు, లైజనింగ్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ మే 2వ తేదీ అమరావతి రాజధాని పనుల పున:ప్రారంభ కార్యక్రమానికి రానున్న దృష్ట్యా అందరి భాగస్వామ్యంతో పర్యటనను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రధాన మంత్రి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని క్యాబినేట్ సబ్ కమీటి ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే పలు మార్లు సమావేశాలు నిర్వహించి దశ దిశ నిర్ధేశిస్తున్నారన్నారు. గ్రీన్‌ఫీల్డ్ రాజధాని లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో సభా వేదికకు జిల్లా నుండి బస్సు సౌకర్యం కల్పించాలని ముఖ్యంగా రైతులు, పారిశ్రామిక వేత్తలు, విద్య వైద్య వివిధ రంగాలకు చెందిన వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా తీసుకురావాలన్నారు. వివిధ ప్రాంతాల నుండి బయలు దేరే బస్సులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా నుండి సుమారు లక్ష మంది కార్యక్రమానికి హాజరు కానున్న నేపథ్యంలో త్రాగునీరు, ఆహారం, తదితర అవసరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణకు స్థానిక కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఏర్పాట్ల సమన్వాయానికి ప్రత్యేక అధికారులకు భాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. అధికారలు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమిష్టి భాగస్వామ్యంతో గౌరవ ప్రధాన మంత్రి పర్యటనను విజయవంతం చేద్దామని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ ప్రధాన మంత్రి పర్యటనకు జిల్లా నుండి చేసిన ఏర్పాట్లను మంత్రికి వివరించారు. జిల్లా నుంచి ప్రధాన కార్యక్రమ వేదికకు చేరుకునేందుకు ఉన్న మార్గాలు, వివిధ ప్రాంతాలకు ఏర్పాటు చేసిన బస్సులు, ప్రతి బస్సుకు ఏర్పాటు చేసిన ఇన్‌చార్జ్‌లు, ప్రజలకు కల్పించిన సౌకర్యాలు, వైద్య శిభిరాలు, తదితరల అంశాల మొబలైజేషన్ ప్రణాళికను ఇన్‌చార్జ్ మంత్రికి వివరించారు. సమన్వయ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ హెచ్. ఎం. ధ్యానచంద్ర, డిఆర్‌వో ఎం. లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్‌డివో కె. చైతన్య, తదితరులు ఉన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగులకు శుభవార్త

- సర్వీసును ఏడాది పొడిగించిన ప్రభుత్వం




**అమరావతి,ఏప్రిల్29( వెలుతురు):**
కాంట్రాక్ట్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో, జిల్లాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలు ఏడాదిపాటు– పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.. ఈ ఏడాది మార్చి 31వ తేదీతో కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవా కాలం ముగిసిపోగా.. వారి సేవలను 2026 ఏడాది మార్చి 30వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.. అయితే, ఆర్థిక శాఖ అనుమతితో నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రమే సేవల పొడిగింపు వర్తిస్తుందని ఉత్తర్వులు జారీ చేశారు ఏపీ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయుష్ కుమార్.. ఇక, కొత్తగా కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకానికి ఆర్థిక శాఖ ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. కాగా, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలతో పాటు–.. జిల్లాల్లో వందలాది మంద్రి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న విషయం విదితమే..

## వీధిలో చిన్నారిని వదిలేసిన తల్లి


- పోషించే స్థోమత లేదని లేఖలో వెల్లడి



**అనంతపురం,ఏప్రిల్29( వెలుతురు):**
ఏ కష్టం వచ్చిందో ఏమో తెలియదు.. కానీ, ఓ తల్లి తన కన్న బిడ్డని పోషించలేక ఓ ఇంటి ముందు వదిలేసి వెళ్లిపోయింది. హృదయ విదాకర ఘటపురంలో వెలుగు చూసింది.. ఆధునిక సమాజంలో ప్రపంచ దేశాలతో భారత్ పోటీ– పడుతోందని చెబుతున్నా.. కనీసం కన్నబిడ్డలను కూడా పోషించలేని స్థితిలో ఎంతో మంది ఉన్నారని చెప్పడానికి ఈ ఘటన అద్దం పడుతోందనే చెప్పాలి.. అనంతపురంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. అభం శుభం తెలియని రోజుల వ్యవధిలో ఉన్న చిన్నారిని గుర్తు తెలియని మహిళ రాత్రి సమయంలో విజయనగర్ కాలనీలోని ఓ ఇంటి ముందు వదిలేసి వెళ్లిపోయింది. చిన్నారి ఏడుపును గమనించిన స్థానికులు బయటకు వచ్చి చూడగా ముద్దులొలికే చిన్నారి నుదుటున బొట్టుతో కనిపించింది. చిన్నారి వద్ద ఓ లేఖ ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. లేఖలో తన బిడ్డను నేను పోషించలేక వదిలి వెళ్లిపోతున్నానని.. ఈ బిడ్డకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని తాను కోరుకుంటున్నట్లు లేఖలో రాసింది. పోలీసులు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు.. శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఒకటో పట్టణ పోలీసులు ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు..

## జైలులో సౌకర్యాలు మృగ్యం

- కనీస వసతులుకల్పించడం లేదు
- కోర్టు దృష్టికి తెచ్చిన పిఎస్ఆర్



**విజయవాడ,ఏప్రిల్29( వెలుతురు):**
విజయవాడ జిల్లా జైల్లో తనకు మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం లేదని కోర్టుకి సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు తెలిపారు. పూజకు పుస్తకాలు, పెట్టుకోవటానికి బొట్టు ఇవ్వటం లేదని జడ్జికి చెప్పారు. తాను విచారణకు సహకరిస్తున్నానని, మరోసారి కస్టడీకి తీసుకున్నా సహకరిస్తానన్నారు. జైల్లో తాను వెళ్లిన తర్వాత తన కారణంగా వేరే వారికి కూడా సౌకర్యాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను జైలుకి వెళ్లిన తొలి రోజున టీవీ ఉందని, వాకింగ్ వెళ్లి వచ్చేసరికి టీవీ లేదని కోర్టుకి పీఎస్ఆర్ తెలిపారు. ఈ సదుపాయాలపై పిటిషన్ వేరేగా దాఖలు చేసుకోవాలని జడ్జి సూచించారు. కస్టడీలో ఇబ్బంది పెట్టరా? అని ప్రశ్నించగా.. లేదని పీఎస్ఆర్ బదులిచ్చారు. పీఎస్ఆర్‌ను కోర్టు నుంచి జైలుకు తరలించారు. ముంబై నటి కాదంబరీ జెత్వానీ, ఆమె తల్లిదండ్రులను అక్రమంగా నిర్బంధించిన కేసులో అరెస్టయిన పీఎస్ఆర్ ఆంజనేయులు.. ప్రస్తుతం సీఐడీ రిమాండ్‌లో ఉన్నారు. సీఐడీ అధికారులు మూడో రోజు ఆయనను కస్టడీలోకి తీసుకున్నారు. ఈరోజు విజయవాడ జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు అనంతరం సీఐడీ ఏఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో పీఎస్ఆర్‌ను విచారిస్తున్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుమారు ఆరు గంటల పాటు సీఐడీ అధికారులు ప్రశ్నించారు. 80కి పైగా ప్రశ్నలు అడిగినా సూటిగా సమాధానం చెప్పలేదు.

# ఉగ్రదాడితో వణుకుతంటే దిగజారుడు వ్యాఖ్యలా

- కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ వ్యాఖ్యలపై ఆగ్రహం
- మా ఉద్వేగాలతో ఆడుకోవద్దన్న సంతోష్ జగదలే సతీమణి

**పుణె,ఏప్రిల్29( వెలుతురు):**




పహల్గాం ఉగ్రదాడితో దేశం ఉలిక్కిపడింది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన సంతోష్ జగ్‌దలే సతీమణి ప్రగతి జగ్‌దలే నేతలకు ఓ విజ్ఞప్తి చేశారు. ఈ దాడిని రాజకీయం చేయొద్దని, తమ ఉద్వేగాలతో ఆడుకోవద్దని కోరారు. మహారాష్ట్ర కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె తీవ్రంగా స్పందించారు. ఓవైపు ఉగ్రవాదులు మతం పేరు చెప్పి కాలుస్తుంటే...ఇలాంటి వ్యాఖ్యలతో మమ్మలను అవమానించవద్దని కోరింది. ఉగ్రవాదులకు కులం, మతం లేదని వాడెట్టివార్ చేసిన వ్యాఖ్యలపై ఆమె అభ్యంతరం తెలిపారు. పర్యాటకులను కాల్చేముందు వారి మతం గురించి అడిగారంటున్న వాదనపైనా వాడెట్టివార్ అనుమానం వ్యక్తంచేశారు. ఆ నేత వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. ఈ క్రమంలోనే ప్రగతి పుణెలో మీడియాతో మాట్లాడారు. ఇప్పటికీ ఆ ఉగ్రదాడి భయం మమ్మల్ని వీడలేదు. నేను కళ్లు మూసుకున్నప్పుల్లా.. రైఫిల్ పట్టుకున్న వ్యక్తి కనిపిస్తాడు. ఉగ్రవాదాన్ని దగ్గరి నుంచి చూశాం. విద్వేషపూరిత మాటలు విన్నాం. సరిగా నిద్రపోయి ఎన్నిరోజులైందో. ఈ ఘటనను రాజకీయం చేయొద్దు. మా ఉద్వేగాలతో ఆడుకోవద్దని నేతలందరినీ కోరుతున్నానని ఆమె అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన ఆ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో మహారాష్ట్రకు చెందిన సంతోష్ జగ్‌దలే ఒకరు. ఇదిలా ఉంటే.. ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఒక్కో కుటు–ంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు– ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ వెల్లడించారు. వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని క్యాబినెట్ సవవేశం అనంతరం వెల్లడించారు.

## అఖిలపక్షానికి రాకుండా ఎన్నికల ప్రచారానికా

- మోడీ తీరుపై మండిపడ్డ జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ,ఏప్రిల్29( వెలుతురు):**



పహల్గాం ఉగ్రదాడిపై అఖిల పక్ష సమావేశానికి ప్రధాని మోడీ గైర్హాజరు కావడంపై కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ మండిపడ్డారు. రాబోయే బీహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గనేందుకు ప్రధాని మోడీకి సమయం ఉంది, కానీ అఖిలపక్ష సమావేశానికి హాజరయ్యేందుకు సమయం లేదని ఎద్దేవా చేశారు. బాధ్యత వహించాల్సి సమయంలో ప్రధాని మోడీ 'గాయబ్' అయ్యారని అంటూ ఆయన సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిపై ఏప్రిల్ 22న అఖిల పక్షం నిర్వహించాలని డిమాండ్ చేశామని అన్నారు. ప్రధాని విదేశీ పర్యటన నుండి తిరిగి వచ్చారు కానీ, బీహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లారని అన్నారు. ప్రధానికి బీహార్ ఎన్నికల పచారంలో ప్రసంగించేందుకు సమయం ఉంది కాని అఖిలపక్ష సమావేశంలో ప్రసంగించేందుకు సమయం లేదని అన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సెషన్ నిర్వహించాలని, దీనిలో అంశంపై రాజకీయ ఎజెండా లేదని అన్నారు. మనమంతా ఐక్యంగా ఉన్నామని ప్రపంచానికి చూపించడానికి, ఐక్యంగా ఉండాల్సిన సమయమిదని అన్నారు. పహల్గాం ఉగ్రదాడిపై పార్లమెంట్ ప్రత్యేక సెషన్ నిర్వహించాలని కోరుతూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలు సోమవారం ప్రధాని మోడీ లేఖ రాశారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ప్రతి భారతీయుడిని ఆగ్రహానికి గురిచేసింది. ఈ క్లిష్ట సమంయలో,. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మనమంతా ఐక్యంగా ఉంటామని భారతదేశం చూపాల్సి వుందని లేఖలో పేర్కొన్నారు. ప్రతిపాదిత పార్లమెంట్ సెషన్ దాడిపై ఉమ్మడి వైఖరిని వ్యక్తీకరించడానికి ఒక వేదికగా ఉంటుందని, పరిస్థితిని ఎదుర్కొనే సమిష్టి సంకల్పాన్ని ప్రదర్శిస్తుందని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు. ఐక్యత, సంఘీభావంపై ప్రతిపక్షాల నమ్మకాలు ఈతరుణంలో అత్యవసరమని గుర్తించారు.

## పహలామ్ దాడి అనంతీరపరిస్థితులు

- హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉన్నతసమీక్ష

**న్యూఢిల్లీ,ఏప్రిల్29( వెలుతురు):**
పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలు, భద్రతపై సమీక్షించేందుకు హోం మంత్రిత్వ శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం అత్యున్నత స్థాయి భద్రతా సమావేశం నిర్వహించారు. దీనికి హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షత వహించారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్), బోర్డర్ సెక్యూరిటీ–ఫోర్స్ (బీఎస్‌ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), సహస్ర సీమ బల్ (ఎస్ఎస్‌బీ), ఇండో–టిబిటెన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ), నేషనల్ సెక్యూరిటీ–గార్డ్ (ఎన్ఎస్‌జీ), అసోం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్స్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. పహల్గాంలో ఉగ్రవాదులు అత్యంత పాశవికంగా 26 మంది టూరిస్టులను పొట్టనపెట్టుకోవడంతో జమ్మూకశ్మీర్ అంతటా కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లు ఉధృతం చేశారు. ఈ క్రమంలో భద్రతా ఏర్పాట్లు, బలగాల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించేందుకు ఎంహెచ్‌ఏలో అత్యున్నత స్థాయి భద్రతా సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాల వివరాలను గోప్యంగా ఉంచుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. జమ్మూకశ్మీర్‌లో కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్ నడుస్తున్నందున ఈ సమయంలో సున్నితమైన అంశాలను వెల్లడించలేమని అంటున్నారు.

## పాక్ అనుకూల విధానాల్లో కాంగ్రెస్ నేతలు

- కాంగ్రెస్ గాయబ్ పోస్టుపై మండిపడ్డ బిజెపి




**న్యూఢిల్లీ,ఏప్రిల్29( వెలుతురు):**
పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో రెండ్రోజులు సైలెంట్‌గా ఉన్న బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయం మొదలైంది. కాంగ్రెస్ ప్రధాని నరేంద్రమోడీని టార్గెట్ చేస్తూ..అవసరమైన సమయాల్లో మిస్ అవుతారని కామెంట్ చేసింది. ప్రధానిని సూచించే ఒక ఫోటోని పోస్ట్ చేసి, దానికి తల లేకుండా ఉంచింది. గాయబ్ అంటూ కామెంట్ పెట్టింది. దీనిపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్‌ని టార్గెట్ చేస్తూ బీజేపీ నేతలు ఘాటు వ్యాఖ్యలు చేశారు. అఖిల పక్ష సమావేశానికి ప్రధాని మోడీ గైర్హాజరు కావడాన్ని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఎత్తిచూపారు. కాంగ్రెస్ నేతల కామెంట్స్‌పై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పాకిస్తాన్‌తో కుమ్మక్కైందని, రాహుల్ గాంధీ రహస్య వ్యూహాల మేరకు ఇలా చేస్తున్నారని అన్నారు. గతంలో ప్రధాని మోడీ చేసిన రక్తం నీరు కలిసి ప్రవహించలేదనే వ్యాఖ్యల్ని ఠాకూర్ గుర్తు చేశారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు పాకిస్తాన్ భాష మాట్లాడటం, పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడం నాకు అర్థం కాదు. భారతీయుల్ని చంపినప్పుడు వారి రక్తం మరగదా.. ప్రతీకారం తీర్చుకోవాలని అనిపించదా..ని ప్రశ్నించారు. తన ముస్లిం ఓటు బ్యాంక్ కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని బీజేపీ నేత అమిత్ మాల్వియా ఆరోపించారు. కాంగ్రెస్ ఇలా చేయడం ఇదే మొదటిసారి కాదని చెప్పారు. బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ మాట్లాడుతూ.. పాకిస్తాన్ నుంచి కాంగ్రెస్‌కి ఆదేశాలు వస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టుని పాకిస్తాన్ రాజకీయ నాయకుడు వాడుకున్నాడని అన్నారు.

## కృష్ణారెడ్డి పట్టుదలకు హ్యాట్సాఫ్

### చంద్రబాబు ప్రశంసలు

**అమరావతి,ఏప్రిల్29( వెలుతురు):**
కానిస్టేబుల్ ఉదయ కృష్ణారెడ్డి సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఆల్ ఇండియా 350 ర్యాంక్ సాధించిన సంగతి తెలిసిందే. ఆయన ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ఉదయ కృష్ణారెడ్డి సక్సెస్ స్టోరీపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ మేరకు తన ట్విటర్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఉదయ కృష్ణారెడ్డిపై ప్రశంసల జల్లు కురిపించారు. ' కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్‌గా ఎదిగిన ఉదయ కృష్ణారెడ్డి ప్రయాణం.. ధైర్యం, నిరంతర కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తోంది. సాధించాలనే పట్టు–దల ప్రతీ అడ్డంకిని బద్దలు కొడుతుంది. కొత్త చరిత్రను రాస్తుంది. భవిష్యత్తు పట్టు– వదలకుండా పని చేసే వారిదే ' అని పేర్కొన్నారు.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com